# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

నవంబర్ - 2017

సంపుటి- 43 సంచిక : 11



## సంపాదక వర్గం

ఎన్.కుమార్ రాజా

ప్రధాన సంపాదకులు

ఐ.వెంకటేశ్వరరావు

పి.బాబురెడ్డి

టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు

సిహెచ్.శ్రీహరి


## ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| ఛలో సిక్కోలు | -05 |
| ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే... | -06 |
| పాఠశాలలకు ర్యాంకులు ఎందుకు? | -07 |
| మహిళా సాధికారతోనే... | -08 |
| భయో'మెట్రిక్' | -09 |
| విద్యాహక్కు చట్టం... | -11 |
| కథల పుస్తకం .... | -13 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -14 |
| ఉద్యమవార్తలు | -16 |
| సిపిఎస్ రద్దుకు .... | -18 |
| బయోమెట్రిక్‌పై నిరసనలు | - 21 |
| ప్రశ్నోత్తరాలు | -23 |
| ప్రభుత్వఉత్తర్వులు | -42 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ 650-00 |
| సం॥ చందా | : | ₹ 150-00 |
| విడిప్రతి | : | ₹ 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBINO534641

ఐక్య ఉపాధ్యాయ

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763

Website: www.aputf.org

E-mail: ikyopadhyaya1975@gmail.com


# బాలల సంక్షేమమే బాలల దినోత్సవ లక్ష్యం కావాలి

నవంబర్ 14 బాలల దినోత్సవం. బాలల సంక్షేమం కోసం పునరంకితమయ్యే దినోత్సవం. బాలలు సంతోషంగా తమ బాల్యాన్ని గడపటానికి, వారి హక్కులను కాపాడడానికి తగిన చర్యలు తీసుకోవడం, వీటిపై బాలల్లో, సమాజంలో చైతన్యం కల్పించడం ఈ దినోత్సవ లక్ష్యం.

ప్రపంచంలో అత్యధిక బాలల జనాభా గల దేశం మనది. ఈ రేపటి పౌరుల ఆరోగ్యం, విద్య, జీవనం, సామాజిక భద్రతకై ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నిర్దిష్టమైన కార్యక్రమాలు తీసుకుంటూనే ఉన్నాయి. 1992లో కేంద్రం రూపొందించిన కార్యాచరణ పథకం ప్రకారం 80% బాలురుకు, 75% బాలికలకు పాఠశాలల్లో విద్యా సదుపాయాలు కల్పించ బడాలి. 2009లో నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం ప్రకారం 14 సం॥ల బాల బాలికలకు ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా అందించాలి. బాల కార్మిక చట్టం నిర్బంధంగా అమలుచేసి బాలలందరూ బడిలో ఉండేలా చూడాలి. ఇవన్నీ అమలు జరుగుతున్నాయా అనేది నేటికి ప్రశ్నార్ధకమే?

దేశ వ్యాప్తంగా 40% మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో శారీరక, మానసిక ఎదుగుదల లేక అనారోగ్యానికి గురి అవుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. బాలల భద్రతకు సంబంధించిన అంశాలు ఆందోళన కల్గిస్తున్నాయి. పేదరికం కారణంగా బాలలు అక్రమ రవాణాకు, వేధింపులకు ఇంకా గురి అవుతూనే ఉన్నారు. బాల కార్మికులుగా మారుతున్నారు. 14 ఏళ్ళలోపు పిల్లలు తెల్లవారకముందే చెత్తకుప్పల్లో కాగితాలు ఏరడం, పేపర్లు ఇంటింటికి వేయడం, టీ దుకాణాల్లో, మెకానిక్ షాపుల్లో, సంపన్నుల ఇళ్ళలో నౌకర్లుగా మగ్గడం నేటికి కన్పిస్తున్న సత్యం.

మరోవైపు పాలకులు చేస్తున్న విద్యారంగ వింత ప్రయోగాలలో వత్తిడికి గురి అవుతున్నారు. మార్కులు, గ్రేడులు, పోటీ పరీక్షల భారంతో, అలసటతో అభద్రతాభావంతో బలవన్మరణాలకూ గురి అవుతున్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద విద్యావ్యవస్థ కలిగిన మన దేశంలో ప్రాథమిక, మాధ్యమిక విద్య నిర్లక్ష్యానికి గురికాబడుతుంది. ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన పాఠశాల విద్య పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో ప్రైవేటు రంగంలోకి, ఆపై కార్పొరేట్ల చేతుల్లోకి క్రమంగా విస్తరిస్తున్నది.

పెరుగుతున్న జనావాసాలకు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో, పాఠశాలల స్థాపన లేకపోవడంతో విద్య వ్యాపారానికి తెరతీసినట్లయింది. పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు పుట్టుకొస్తూ ప్రభుత్వ విద్యారంగ పునాదులను పెకలిస్తున్నాయి.

6-14 సం॥లలోపు పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఉచితంగా అందించాల్సిన విద్యా హక్కు చట్టం నానాటికి అలంకారప్రాయంగా మారుతున్నది.

బాలల పౌష్టికాహార పథకాలైన మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్ ఏజెన్సీల ప్రవేశంతో నీరసించి పోతున్నది. అంగన్‌వాడీ కేంద్రాలు నిధుల కొరత, నిర్వహణ లోపంతో కునారిల్లుతున్నాయి. అయినా బాలల దినోత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. పాఠశాలల్లో పిల్లల కార్యక్రమాల నిర్వహణకే పరిమితమవుతున్నాయి.

ఈ బాలల దినోత్సవం నాడైన ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆలోచించాలి. కామన్ స్కూల్ వ్యవస్థ తెచ్చేందుకు కృషి చేయాలి. పాఠశాల విద్యను జవసత్వాలతో నింపేందుకు ప్రణాళికలు రూపొందించాలి. భారత తొలి ప్రధాని జన్మదినం సందర్భంగా ఆయనకు ప్రీతిపాత్రులైన భావిభారత పౌరులైన బాలల సంక్షేమంపై నిజమైన దృష్టి సారించాలి. అప్పుడే బాలల దినోత్సవ లక్ష్యం నెరవేరుతుంది.

# జాతీయం అంతర్జాతీయం

## ఆత్మహత్య చేసుకొంటున్న భవిష్యత్తు

బంగారు భవిష్యత్‌కోసం ఉన్నదంతా ఊడ్చి అప్పుచేసి బిడ్డను కార్పొరేట్ స్కూలుకు పంపితే ఆ బిడ్డ భవిష్యత్తే లేని శవంగా తిరిగొస్తే... ఈ దశ్యం కళ్ళలో గుచ్చుకొంటున్నట్లు, కడుపులో దేవినట్లు పదేపదే మనచుట్టూ ప్రత్యక్షమౌతోంది. కార్పొరేట్ కాలేజీ కారాగృహాల్లోంచి ర్యాంకులతో పాటు శవాలు కూడా బైటకొస్తున్నాయి. గత నెల రోజుల్లో మన రాష్ట్రంలో 50నుంచి 60మంది పసి వయస్సులోనే ఎండుటాకుల్లా రాలిపోయారు. ర్యాంకుల రేసుల్లో పసిప్రాణాలు సమిదలౌతున్నాయి. పిల్లల మరణాలు అధికంగా గల దేశం భారత దేశం. ప్రపంచ వ్యాప్తంగా 8లక్షల పిల్లలు ఆత్మహత్య చేసుకొంటుండగా అందులో 1,35,000మంది భారతదేశానికి చెందినవాళ్ళే. లాన్సంట్ రిపోర్టు అయితే ఈ సంఖ్యను 1,87,000గా లెక్కకట్టింది.

కార్పొరేట్ స్కూళ్ళలో సరైన తిండిలేక, నిద్రలేక, జ్వరం వచ్చినా మనసు బాగాలేకపోయినా పంచుకొనే దిక్కులేక, తల్లిదండ్రులతో ఫోన్ అయినా చేసుకొనే వీలులేక అత్యంత దయనీయ స్థితిలో పిల్లలు మగ్గుతున్నారు. దండించే అధ్యాపకులు, తమ ఆశల్ని నెత్తినరుద్ది చివాట్లు పెట్టే తల్లిదండ్రులు తప్ప ఓదార్చేవారు లేని స్థితిలో ఆ బిడ్డలకు ప్రపంచం చీకటిమయం అయిపోయి వుంటుంది. కుంగి పోయిన చిన్నారి హృదయాలకు మనోధైర్యం ఇవ్వని అమానవీయ స్థితి చుట్టూ అలముకొని వుంటుంది. ఇటువంటి స్థితిలోకి పిల్లల్ని నెట్టిన పాపం రక్తపిశాచి వంటి కార్పొరేట్ విద్యావ్యవస్థది. దీన్ని రాష్ట్రంలో, దేశంలో రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి. అప్పుడే ఈ సమస్యకు పరిష్కారం!

## ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల్లో బాబాలపై ప్రశ్నలు

ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షా పత్రాల్లో బాబాలగురించి, తిథి, వార, నక్షత్రాల గురించి ప్రశ్నలు ఉండడం అభ్యర్థులను నివ్వెరపరుస్తోంది. ఉద్యోగార్థుల సామర్థ్యాన్ని శాస్త్రీయ పద్ధతిలో పరీక్షించాలి. కానీ హర్యానాలో 2014 నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల్లో పలు బాబాల గురించి ప్రశ్నలు అడిగారు. 2016లో షిఫ్ట్ అసిస్టెంట్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో "హర్యానాలో కలి కమాలి బాబా దేరా ఆశ్రమం ఎక్కడుంది?", పర్వరీ పరీక్షలో "బాబా రామ్‌దేవ్ గురువు పేరేమిటి?", స్టాటికల్ అసిస్టెంట్ పోస్టులకు నిర్వహించిన పరీక్షలో "హర్యానాలో కపిలమునికి చెందిన ప్రాంతమేది?" వంటి ప్రశ్నలు అడిగారు. ప్రస్తుతం ఒక కండక్టర్‌గా పనిచేస్తూ ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న అలోక్ కుమార్ మాట్లాడుతూ "ఈ ప్రశ్నలు సిలబస్‌లో వుండవు. ఎక్కడి నుండి ఇస్తారో తెలియదు. ఉద్యోగానికి సంబంధంలేని ప్రశ్నలను తరచూ అడగడంతో ఈ జవాబుకోసం ముసలి వాళ్ళపై ఆధారపడాల్సి వస్తోంది" అన్నాడు. అయితే హర్యానా ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో సాంస్కృతిక, సామాజిక స్థితిగతులపై అవగాహన అభ్యర్థులకు ఉండాలంటూ సమర్థించుకొంటోంది.

## తొలిసారిగా విద్యపై ప్రపంచ బ్యాంకు రిపోర్టు

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచబ్యాంకు విద్యపై రిపోర్టు తయారు చేసింది. వందల సంఖ్యలో పరిశోధనల, రిపోర్టుల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా వున్న లెర్నింగ్ క్రైసెస్ గురించి సమీక్షించింది. పేదరికం, పౌష్టికాహార లోపం పిల్లల నేర్చుకోవడం మీద తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపింది. "స్కూలు పిల్లల్ని ఫెయిల్ చేస్తే, వ్యవస్థ స్కూలును ఫెయిల్ చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 5వ తరగతిలో వెనుకబడ్డ విద్యార్థి. 1వ తరగతి ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాడు. నేర్చుకొనేదేమీ లేకుండానే స్కూలు సంవత్సరాలు గడిచిపోతున్నాయి. తక్కువ ప్రమాణాలు గల స్కూళ్ళకు నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లల్ని (రోజువారీ పనుల్లో తమకు అందించే సహకారం త్యాగంచేసి) పంపడానికి ఇష్టపడడంలేదు" అని తెలిపింది. వ్యవస్థలు చిత్తశుద్ధితో తలచుకొంటే మంచి చదువు ఎలా అందించగలవో దక్షిణ కొరియా,వియత్నాం, పెరూలను ఉదాహరణలుగా చూపింది.

ఒక మోస్తరు ఆర్థిక వ్యవస్థ అయిన వియత్నాం 15 సం॥ పిల్లల పెర్ఫార్మెన్స్‌లో జర్మనీ సరసన ఎలా నిలిచిందో, 2009 నుండి 2015 కాలంలో పెరూలో శీఘ్రగతిన విద్యాభివృద్ధి ఎలా జరిగిందో, 1950 లో అక్షరాస్యతలో ఎంతో వెనుకబడ్డ దక్షిణ కొరియా 1995 నాటికే అత్యున్నత ప్రమాణాలు గల విద్యను ఎలా అందించిందో వివరించింది. ప్రాథమిక విద్య పూర్తయ్యేనాటికి కనీసం నేర్చుకోవాల్సింది నేర్చుకొన్న పిల్లలు జపాన్‌లో 99%, సర్వేలో 98% వుండగా భారత్‌లో 40% లోపే ఉన్నారని తెలిపింది. చదువంటే – మెడికల్ రిపోర్టు చదవగలగడం, బ్యాంకు స్టేట్‌మెంట్ అర్థం చేసుకోగలగడం, ఉద్యోగ అవకాశాలు తెలుసుకోవడం, తమ పిల్లలకు బోధించడం, కుటుంబ బడ్జెట్ వేసుకోగలగడం, లోను అగ్రిమెంటు చదవడం, టీంలలో పనిచేయడం, సాఫ్ట్‌వేర్ రాయగలగడం, హక్కుల్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోగలగడం అని వ్యాఖ్యానించింది.

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

"ఐక్యఉపాధ్యాయ" మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతో పాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియ జేయగలరు. **ఉత్తరాల ద్వారా ....**"**ఐక్యఉపాధ్యాయ**", యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారివీధి, గవర్నరుపేట, విజయవాడ–520002. **E-Mail : ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

– సంపాదకవర్గం

ఫ్లాష్ లైట్లు

# ఉపాధ్యాయ ఉద్యమ సారధి

## యుటియఫ్ 15వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలు జయప్రదం చేయండి

**2017 డిసెంబర్ 9,10,11**

**ఆం**ధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) 15వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలు 2017 డిసెంబర్ 9,10,11 తేదీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు) శ్రీకాకుళంలో జరుగుతున్నాయి.

ఈ మహాసభలకు 1500మంది ప్రతినిధులు హాజరగుతున్నారు. పదివేలమందితో ఒకటిన్నర రోజులు బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. బహిరంగ కార్యక్రమాలకు 10వేలమంది హాజరుకానున్నారు. విద్యారంగంపై చైతన్య సదస్సు, సిపిఎస్, మహిళ సదస్సులు, ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. ఒకటిన్నర రోజులు పాటు విద్యారంగం, ఉపాధ్యాయుల మరియు రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించటం జరుగుతుంది.

యుటియఫ్ ఉద్యమ ప్రస్థానంలో జరిగిన గత మహాసభలు యుటియఫ్‌ను ఒక్కొక్క మెట్టుపైకి ఎక్కించాయి. మొదటి మహాసభ యుటియఫ్ ఆవిర్భవించిన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో 1974 అక్టోబర్‌లో జరిగింది. ఆ మహాసభ స్ఫూర్తితో అన్ని జిల్లాలలో శాఖలు ఏర్పాటు చేయటం జరిగింది. ఐక్యఉపాధ్యాయ మాస పత్రిక ప్రారంభిం చడమైనది. తదుపరి తెలంగాణ ప్రాంత మంతటికి సంఘం విస్తరించింది. ఏడువేలమందితో ప్రారంభమైన మన సంఘం రాష్ట్ర విభజన నాటికి 1,10,000లమంది సభ్యులతో అతి పెద్ద సంఘంగా ఉపాధ్యాయ ఉద్యమాలకు కేంద్రబిందు వైంది.



**ఐ.వెంకటేశ్వరరావు**
యుటియఫ్ రాష్ట్రఅధ్యక్షులు

యుటియఫ్ ఏర్పడి 43 సం॥లు నిండాయి. ఈ కాలమంతా స్వతంత్ర కార్యాచరణ, ఐక్య కార్యాచరణలతో పోరాటాలు పోటెత్తినాయి. ఈ పోరాటాల వలన గొప్పగొప్ప విజయాలు సాధించ గలిగాయి. అన్ని సమస్యలతోబాటు ఎయిడెడ్, మున్సిపల్, గిరిజన సంక్షేమ, ఎస్సి, ఎస్టి స్పెషల్ విద్యావాలంటీర్ల, అప్రెంటిస్ టీచర్ల సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక పోరాటాలు చేసి మంచి విజయాలు సాధించాము. క్రొత్త పెన్షన్ విధానం రద్దుకై ప్రత్యేక పోరాటాలు చేస్తూ వచ్చాం.

నిర్మాణ నిబద్ధత, పోరాటాలలో సమరశీలత, విధానంలో సూత్ర బద్ధవైఖరి, అవినీతికి వ్యతిరేకంగా నిలబడటం, నాయకుల, కార్యకర్తల క్రమశిక్షణ, అంకితభావంతో ఉపాధ్యాయులకు చేసిన సర్వీసు, వ్యక్తి నిబద్ధత ఇవన్నీ ఉపాధ్యాయులు గుర్తించారు. కనుకనే యుటియఫ్‌ను పెద్ద సంఘంగా ఆదరించారు.

పోరాటాలు, ప్రాతినిధ్యాలు ద్వారా సాధించుకొన్నవి ఒకరకం. పే రివిజన్ కమీషన్స్ ద్వారా సాధించుకొన్నవి మరొక ఎత్తు. రీ గ్రూపింగ్ వేతనాలు, 9వ పిఆర్‌సి, 10వ పిఆర్‌సి వేతనాలలో వచ్చిన పెరుగుదల ఉపాధ్యాయుల వేతనాలు ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ళు, అప్రెంటీస్ నోషనల్ ఇంక్రిమెంట్లు, పెద్ద సంఖ్యలో పోస్టుల అప్‌గ్రేడేషన్ వలన వేతనాలు వృద్ధి అయ్యాయి. పదవీ విరమణ ప్రయోజనాలు పెంచుకోగలిగాము. సీనియర్లకేకాదు, యువతరానికి వేతనాలు వృద్ధి చెందాయి.

ఇన్ని హక్కులు, రాయితీలు సాధించుకొన్నామంటే స్వతంత్ర, ఐక్య ఉద్యమాలకు ఎంతో మూల్యం చెల్లించాము. ఎందరో చనిపోయారు. ప్రభుత్వం కొందరి సర్టిఫికెట్లు రద్దు చేసింది. నిర్బంధాలకు గురి చేసింది. కొందరు జైళ్ళకు వెళ్ళారు. ఎమర్జెన్సీ డిటెన్యూలు కాబడ్డారు. వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చారు. సర్వం ఉద్యమానికి అంకితమైన వారు ఉన్నారు. ఇలా ఎందరెందరో త్యాగాలు కలగలిపి ఉన్నాయి.

ప్రస్తుతానికి బాగానే ఉన్నామనుకొన్నా రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులు, ధరలు పెరుగుదల నిజ వేతనాలను హరిస్తున్నాయి.

శాసనమండలి రంగంలో (2007కి ముందు తర్వాత) సాధించిన విజయాలు ఎన్నదగినవి. 2007లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటియఫ్ బలపరచిన 9మంది టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు గెలిచారు. అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ అధికార పక్షానికి ఎదురొడ్డి మంచి విజయాలు సాధించాము.

ఈ విజయాల స్ఫూర్తితో శ్రీకాకుళంలో డిసెంబర్‌లో జరుగుతున్న మహాసభలు ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరియు విద్యారంగం సమస్యలు చర్చించుటకు వేదిక కానుంది.

ఇన్ని గొప్ప విజయాలు సాధించిన కాలంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల సామాజిక భద్రతనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకొచ్చారు. ప్రభుత్వ పెన్షన్ రద్దు చేయడం, పిఎఫ్ రద్దు చేయడం, చివరకు ఉద్యోగాలకే ఎసరుపెట్టే విధానాలు అమలు చేయడం, రంగాలను రంగాలనే కుదించి, మూసివేసే నిర్ణయాలు ఈ తరానికి ఇవన్నీ పెద్ద సమస్యలు, పెను సవాళ్ళుగా మారాయి.

ప్రత్యేకంగా విద్యారంగంపై అధికారంలోకి వచ్చిన వారు ఎవరి ప్రయోజనాలు వారు చేస్తున్నారు. సారాంశంగా చూస్తే ప్రభుత్వ విద్యకు పాడిగట్టే నిర్ణయాలు అమలు చేస్తున్నారు. పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయుల కుదింపు జరుగుతుంది. ప్రభుత్వమే ప్రైవేట్ భాగ స్వామ్యాన్ని పెంచుతుంది.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల, ప్రస్తుత సమస్యలపైనా, విద్యారంగ సమస్యలపైన పోరాటాలు ఉధృతం చేయాలి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభ కార్యక్రమాలను అన్ని జయప్రదం చేయవలసి ఉన్నది.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ప్రధాన కర్తవ్యం






ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యంగా ఉపాధ్యాయులు తీసుకోవాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు నాగటి నారాయణ సూచించారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అక్టోబర్ 5న రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాకినాడ యుటియఫ్ హోంలో జరిగింది. సమావేశంలో ముందుగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి ఉపాధ్యాయులకు బోధనలో స్వేచ్ఛనివ్వాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ యుటియఫ్‌లాంటి ప్రజా సంఘాలు చేసే ఉద్యమాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పుడూ తమ పూర్తి సహాయసహకారాలు అందజేస్తారని పేర్కొన్నారు.

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసురెడ్డి మాట్లాడుతూ ఏపి సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్టు ముసాయిదాను శాసనమండలిలో తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యారంగానికి ఊతమిచ్చే చర్యలను పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అడ్డుకుంటారని కూడా తేల్చిచెప్పారు. యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి సంఘ కార్య కలాపాల నివేదికను ప్రవేశపెట్టారు.

అనంతరం ఆయన మాట్లాడు తూ పాఠశాలలపై 'నీతిఅయోగ్' చేసిన సిఫార్సులు ప్రైవేట్ పాఠశాలలకు ఊతమివ్వడమేనని విమర్శించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుకోసం అలాగే ఉపాధ్యాయుల సమస్యలపై యుటియఫ్ సంఘంగా స్వతంత్రంగా పోరాడుతూనే, ఫ్యాప్టో ఐక్య ఉద్యమం ద్వారా కూడా పోరాడతామన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 2008 హామీ పత్రాల ఉపాధ్యా యుల వేతన వ్యత్యాసాలను సరిచేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యా యులకు హెల్త్‌కార్డులు, 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని, మున్సిపల్ ఉపాధ్యాయులను చేర్చాలని, 10వ పిఆర్‌సి అరియర్స్ చెల్లించాలని, బకాయి పడిన డిఏలను ప్రకటించాలని, 11వ పిఆర్‌సిని నియమించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నరసింహుడు, కోశాధికారి కె.సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కెఎస్ఎస్ ప్రసాద్, ఎస్.కె.సాజ్జీ, గౌంటి గిరిధర్, డి.రాము, మహమ్మద్ జిలాన్, బి.లక్ష్మిరాజా, ఎస్.జయప్రభ, ఆడిట్ కన్వీనర్ కె.సత్తిరాజు, ఐక్య ఉపాధ్యాయ ప్రధానసంపాదకులు ఎన్.కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.





# 2018 డైరీ రెడీ

**2018 యుటియఫ్ డైరీ ఆకర్షణీయమైన డిజైను, మన్నికైన బైండింగ్, నాణ్యమైన పేపర్, విలువైన సమాచారంతో సిద్ధమైంది. డైరీతోపాటు అధ్యాపకదర్శిని (2017లో వెలువడిన జిఓల పుస్తకం), రంగులవాల్ క్యాలెండర్ ఉచితం. అదనంగా కావలసివస్తే వాల్ క్యాలెండర్ రూ.15/-లు, స్టిక్కర్ క్యాలెండర్ రూ.3/-**

**కావలసిన వారు యుటియఫ్ జిల్లా శాఖలు, బాధ్యులకు అడ్వాన్స్ చెల్లించి మీ కాపీని పొందగలరు.**

# వెల ₹ 150

# పాఠశాలలకు ర్యాంక్‌లు ఎందుకు?



**నాగటి నారాయణ**
ఎస్‌టిఎఫ్‌ఐ
జాతీయ ఉపాధ్యక్షులు

ప్రభుత్వ పాఠశాలలకు ర్యాంక్‌లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ముందుగా కేంద్రీయ విద్యాలయాలకు వచ్చే విద్యా సంవత్సరం నుండే అమలు చేయాలని, ఆ తర్వాత కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ విస్తరించాలని తలపోస్తోంది. పాఠశాలల అభివృద్ధికి పోటీతత్వాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ర్యాంకింగ్ విధానాన్ని ముందుకు తెస్తున్నట్లు హెచ్‌ఆర్‌డి అధికారుల భోగట్టా.

ప్రతి కేంద్రీయ విద్యాలయాన్ని సంవత్సరంలో రెండుసార్లు తనిఖీ చేయాలనీ, వెయ్యి పాయింట్ల ప్రాతిపదికన నాలుగు కేటగిరీలుగా విభజించాలని నిర్ణయించారు. 80 శాతం పైగా పాయింట్లు వచ్చే పాఠశాలలను 'ఏ' (ఎక్సలెంట్) కేటగిరీగా, 60-79.9 పాయింట్లను 'బి ' (వెరీగుడ్)' గా, 40- 59.9 పాయింట్లను 'సి' (గుడ్)గా మరియు 40 శాతం కంటే తక్కువ పాయింట్లు వచ్చిన వాటిని 'డి' (యావరేజ్) కేటగిరీగా పేర్కొంటారు. వేయి పాయింట్లను ఏడు రకాల పేరామీటర్స్‌కి కేటాయిస్తారు. ఎకడమిక్ ఫెర్‌ఫామెన్స్‌కి 500 పాయింట్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి 150, స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌కి 120, ఫైనాన్స్‌కి 70, కమ్యూనిటీ పార్టిసిఫేషన్‌కి 60, గ్రేస్ 90, ఇన్‌స్పెక్టర్‌ల అబ్జర్వేషన్‌కి 10 పాయింట్లు చొప్పున కేటాయించారు.

దేశంలో మొత్తం 1,125 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్‌కి సంబంధించిన పాయింట్స్ అన్ని స్కూళ్లకి సమానంగానే ఉండవచ్చు, వాటిని యాజమాన్యమే కల్పిస్తుంది కాబట్టి. గ్రేస్, అబ్జర్వేషన్ పాయింట్లు ఇన్‌స్పెక్టర్‌ల విచక్షణకు సంబంధించినవి. ఎకడమిక్ పెర్‌ఫామెన్స్‌ని పది, పన్నెండు తరగతుల ఫలితాలతో చూస్తే దాదాపు అన్ని స్కూల్స్ 'ఏ', బి' కేటగిరీల్లోనే ఉంటాయి. ఆ ఫలితాలు అత్యధిక పాఠశాలల్లో ఎప్పుడూ వందశాతం ఉంటున్నాయి. కొన్ని స్కూళ్లలో ఎప్పుడైనా వంద శాతం ఉత్తీర్ణత లేకపోయినా 90 శాతం పైగానే ఉంటుంది. ఇవన్నీ సులభంగా అర్థమయ్యే విషయాలుగా ఉన్నా కేంద్రీయ విద్యాలయాలు అన్నీ సమాన స్థాయిలో ఉండే అవకాశం లేదు. ప్రాంతాన్ని బట్టి, విద్యార్థుల సామాజిక ఆర్థిక నేపథ్యాన్ని బట్టి, సిబ్బంది పరిస్థితిని బట్టి అనేక రకాల అసమానతలు, వ్యత్యాసాలు అనివార్యంగా ఉన్నాయి.

దేశవ్యాపిత బదిలీలకు గురయ్యే ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ మున్నగు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు సమాన విద్యావకాశాలను కల్పించుట కోసమే కేంద్రీయ విద్యాలయాలు నెలకొల్పబడినవి. అయినా కొంత మంది స్థానిక విద్యార్థులను కూడా చేర్చుకోవడం జరుగుతోంది. అయితే ఆ సంఖ్య ఒకప్పుడు 20శాతం వరకు ఉంటే, ఈనాడు కొన్ని స్కూళ్లలో 40 శాతం వరకు పెరిగింది. 80 శాతంపైగా ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ వగైరా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఉండే స్కూళ్లలో, వారు 60 శాతం వరకే ఉండే స్కూళ్లలో విద్యార్థుల అభ్యసన స్థాయిల్లో తేడాలు ఉండే అవకాశం ఉంది. మెట్రోపాలిటన్ నగరాల్లో ఉండే స్కూళ్లలో మరియు జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలలో ఉండే స్కూల్స్‌లో పెద్ద వ్యత్యాసమే ఉంటుంది. ప్రధాన నగరాల్లోని విద్యాలయాల్లో అనుభవం గల రెగ్యులర్ టీచర్స్ ఉండగా, ఇతర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చాలా పోస్టులు ఖాళీగా ఉండడం, అడ్‌హక్ సిబ్బందితో నెట్టుకురావడం జరుగుతోంది. ఇంతటి అసమానతలు గల పాఠశాలలను ఒకే కొలమానంతో కొలవడం సరైందేనా?

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి సంబంధించి లేబోరేటరీ, లైబ్రరీ, డిపార్ట్‌మెంట్స్, ఆడియో విజువల్ రూమ్స్, టాయ్‌లెట్స్, సిసిఏ హాల్, స్పోర్ట్స్ రూమ్, గార్డెన్ మున్నగునవి అన్ని స్కూళ్లలో ఉంటాయి. నిధుల అందుబాటు, ప్రిన్సిపాల్స్ చొరవ, సిబ్బంది శ్రద్ధతో కొన్ని అదనపు వసతులు సమకూర్చే అవకాశం ఉంటుంది. అయితే వాటికి అవసరమైన నిధులు 'సంఘటన' ఇవ్వదు. విద్యార్థుల నుండి ఫీజుల ద్వారా వసూలు చేసే 'విద్యాలయ వికాస్ నిధి' నుండే వినియోగించుకోవాల్సి ఉంటుంది. కొన్ని స్కూల్స్‌లోని అడ్‌హాక్ సిబ్బందికి జీతాలు కూడా ఆ నిధి నుండే చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా విద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది నియామకాలు లేకపోవడం వలన అటెండర్, సెక్యూరిటీ వంటి సిబ్బందికీ విద్యా వికాస్ నిధులనే వెచ్చిస్తున్నారు. ఇలాంటి ఖర్చులు లేని స్కూళ్లకు మాత్రమే అదనపు హంగులు, అలంకరణలు చేసుకునే అవకాశం ఉంటుంది. స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన 120 పాయింట్లను స్కూళ్లకు కేటాయించడమూ అసంబద్ధమైన అంశమే కాగలదు. పాఠశాలల పని విధానం, సిలబస్, పరీక్షలు, ఆఫీస్ నిర్వహణ, అకౌంట్స్ మున్నగు సకల విధి-విధానాలు ఎంహెచ్‌ఆర్‌డీ సూచనల మేరకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నుండి వచ్చే వాటిని అమలు చేయడమే తప్ప ఏ స్కూల్‌కూ స్వంత నిర్ణయాలు చేసుకునే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ర్యాంకింగ్స్ విధానంతో కేంద్ర ప్రభుత్వం ఏమి సాధించదలచుకుంది అనేదే అసలు ప్రశ్న.

ఏ విధానమైనా దాని ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. కేంద్రీయ విద్యాలయాలను ర్యాంక్‌లతో విభజించాలనే విధానంతో సానుకూల ప్రయోజనాలు ఏమో గానీ, కొన్ని ప్రతికూల పరిణామాలు సంభవించే అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాలనూ ఏడాదికి రెండు సార్లు తనిఖీ చేయాలనేదే పెద్ద సందేహంగా ఉంది. అసిస్టెంట్ కమిషనర్ ద్వారా ఏడాదికి ఒకసారి ప్యానల్ ఇన్‌స్పెక్షన్, మరోసారి డిప్యూటీ కమిషనర్ ద్వారా ఆకస్మిక తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి. ఆపైన నెలకోసారి నిర్వహించే పరీక్షలను మరియు బోర్డ్ ఎగ్జామినేషన్‌కి ముందు జరిగే మూడు పరీక్షల ఫలితాలను అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు సమీక్షలు చేసి అవసరమైన





# మహిళా సాధికారతతోనే సమానత్వం

మహిళా సాధికారత సాధించినప్పుడే సమాజంలో సమానత్వం వస్తుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే చెప్పారు. నేషనల్ ఫోరం ఆఫ్ వుమెన్ టీచర్స్ (ఎన్ఎఫ్‌డబ్ల్యూటీ) ఆధ్వర్యంలో 'ప్రస్తుత సామాజిక పరిస్థితి- మహిళా ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై అక్టోబర్ 8న హైదరా బాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మరియం ధావలే మాట్లాడుతూ మహిళా చైతన్యమే సమాజ మార్పునకు నాంది అని అన్నారు. సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత తీసుకొని విద్యార్థులను జాతి నిర్మాతలుగా తీర్చిదిద్దాలని కోరారు.

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లయినా మహిళల అక్షరాస్యత 50 శాతం దాటకపోవడం పాలకుల డొల్లతనం అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాప్రణాళికలో మతతత్వ ధోరణులు పెరిగేలా పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తున్నారని అన్నారు. మూఢవిశ్వాసాలు పెరిగేలా సిలబస్ రూపకల్పన చేస్తున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణ వేగవంతం చేయాలని నీతిఆయోగ్ నివేదిక ఇవ్వడం పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉంటే ప్రైవేటు రంగానికి అప్పగించాలని కుట్ర చేస్తోందని చెప్పారు. మతతత్వ ధోరణులు, లింగ వివక్ష, సామాజిక అణచివేత, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఐద్వా, ఎస్‌టీఎఫ్ఐ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అన్వయించి బోధించాలని మహిళా ఉపా ధ్యాయులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం తెలుసుకొని బోధనలో మెళకువలు పాటించాలని కోరారు.

జాతీయ మహిళా ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ ఎం సంయుక్త మాట్లాడుతూ బాలికల విద్య పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. అమ్మాయిలు విద్యాసంస్థల నుంచి పారిపోయేటట్టు విధానాలు రూపొందించడాన్ని తీవ్రంగా ఖండించారు. జీడీపీలో ఆరు శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

జాతీయ మహిళా ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌డబ్ల్యూటీ కో-కన్వీనర్ విజయగౌరి, ఎస్‌టిఎఫ్ఐ ఉపాధ్యక్షుడు రాజేంద్రన్, ఎన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలకు ర్యాంక్‌లు ఎందుకు?


ఆదేశాలు ఇస్తూనే ఉన్నారు. ప్యానల్ ఇన్‌స్పెక్షన్‌లో కొన్ని పేరామీటర్స్ ప్రకారం ప్రతి పాఠశాలకూ కొన్ని పాయింట్లు కేటాయించి వాటిని పాఠశాలలకు తెలియజేయడం జరుగుతూనే ఉంటుంది. ఇంక అదనంగా ఏడాదికి రెండుసార్లు తనిఖీలు ఎందుకు, ఎవరితో చేయిస్తారు? ప్రైవేట్ ఏజెన్సీలతో చేయిస్తారా అనే అనుమానం కలగడం సహజం.

ర్యాంక్‌ల పేరుతో చేసే వర్గీకరణలో 'డి' కేటగిరీలో వుండే పాఠశాలల భవిష్యత్ ఏమవుతుంది? వాటి అభివృద్ధి కోసం సంఘటన తీసుకునే చర్యలు ఏమిటో భవిష్యత్‌లో చూడాల్సిందే. సిబ్బందిపైన చర్యలు తీసుకోవచ్చు. స్కూళ్లకు వెచ్చించే నిధులు వృథా అవుతున్నాయనే ప్రకటనలు చేయవచ్చు. దానితో ఆ స్కూళ్లల్లోని విద్యార్థుల పేరెంట్స్ అనివార్యంగా తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఇప్పటిదాక మన దేశ పాఠశాల విద్యలో కేంద్రీయ విద్యాలయాలు ఉత్తమ శ్రేణిగా కీర్తించబడుతున్నవి. వసతులు, వాతావరణం, ప్రమాణాలు, ఫలితాలు వగైరా అన్ని విషయాల్లో మోడల్ స్కూళ్లుగా విరాజిల్లుతున్నాయి. దేశ సమగ్రత, సమైక్యతను బోధించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, తీర్చిదిద్దే ప్రతిభా కేంద్రాలుగా భాసిల్లుతున్నాయి. స్కూల్ అంటే ఇలా ఉండాలి అని అనేక సందర్భాల్లో సగర్వంగా చెప్పుకోవడం జరుగుతోంది. ఇప్పుడు తలపెట్టే ర్యాంక్‌ల ప్రయోగంతో వాటి ప్రతిష్ట దిగజారే పరిస్థితి దాపురిస్తుంది. అది పరోక్షంగా ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకే మేలు చేసే అవకాశం ఉంటుంది. ప్రైవేట్ పెట్టుబడిదారుల ఒత్తిడికి తలొగ్గి ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న విధానమే ఇప్పుడు కేంద్రీయ విద్యాలయాలపై కేంద్రీకరిస్తోంది.

# భయో 'మెట్రిక్'

రాష్ట్ర విద్యారంగం నిత్య ప్రయోగశాలగా మారిపోయింది. సిలబస్ మార్పు, పరీక్షలు, మీడియం పేరిట ఇప్పటికే ఎన్నో ప్రయోగాలు జరుగుతున్నాయి. కాగా బయోమెట్రిక్ పేరుతో ఇప్పుడు ఉపాధ్యా యులు, విద్యార్థుల హాజరును క్రమబద్ధీకరించేందుకు మరో ప్రయోగం మొదలయింది.

అధికారంలోకి రాగానే మోదీ సర్కారు 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం చేపట్టింది. ఉద్యోగుల అలసత్వం కారణంగానే ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు అందకుండా పోతున్నాయని కాబట్టి ఉద్యోగుల హాజరును, పని గంటలను క్రమ బద్ధీకరిస్తే చాలు మొత్తం వ్యవహారమంతా చక్కబడుతుందని విశ్లేషించారు. "ఏ ఇద్దరు వ్యక్తుల ఐరిష్ (కనుగ్రుడ్లు)గాని, వేలి ముద్రలుగాని ఒకేలా వుండవు" అనే శాస్త్రీయ భావన ఆధారంగా "Aadhar Enabled Bio-metric Attendance System (AE-BAS)" విధానం అమలులోకి తెచ్చారు. దీనికుండే జిపిఎస్ విధానం ద్వారా ఉద్యోగి ఎక్కడ నుండి తన హాజరు నమోదు చేశారు? ఆఫీసులో ఉన్నారా? ఫీల్డులో ఉన్నారా? ఎన్నింటికి వచ్చారు? ఎన్నింటికి వెళ్ళారు? పనిలో ఉన్నారా? సెలవులో ఉన్నారా? లేక గైర్హాజరయ్యారా? ఇత్యాది వివరాలన్నీ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలుస్తాయి. వీటి ఆధారంగానే భవిష్యత్‌లో జీత, భత్యాల చెల్లింపులు ఉంటాయి. దీనివల్ల ఉద్యోగుల హాజరు, పనిలో వేగం పెరిగి, తద్వారా దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందు తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలతో బాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ, స్థానిక సంస్థల కార్యాలయాలలో పనిచేసే ఉద్యోగులను దీని పరిధిలోకి తెచ్చారు.



**కెఎస్ఎస్ ప్రసాద్**
**యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి**

మోదీ సర్కారు నిర్ణయం వెలువడీ వెలువడకముందే చంద్రబాబు ప్రభుత్వం కూడా "ఈ-ఆఫీసు" పేరుతో హడావుడిగా చర్యలు చేపట్టింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో బయోమెట్రిక్ విధానం ద్వారా ఉద్యోగుల హాజరు నమోదు తప్పనిసరి చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారు. టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించడం వల్లే తన మొదటి దఫా పరిపాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా హైదరాబాద్ ఆర్థికంగా అభివృద్ధి చెందిందని ఆయన భావన. "కంప్యూటర్లు కాదు - కందిపప్పు కావాలి" అని ప్రజలు మొత్తుకున్నా వినలేదు. రెండవ సారి అధికారంలోకి వచ్చీరాగానే రాష్ట్ర పరిపాలనను కాగితరహిత పాలనగా మార్చేదిశగా అడుగులు వేశారు. విద్యారంగానికి సంబంధించి రాష్ట్రాన్ని ఒక నాలెడ్జ్ ఎస్టేట్‌గా, ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని; ప్రతీ ఆదర్శ పాఠశాలకు 5కోట్ల రూపాయలతో సకల సదుపాయాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, వర్చువల్ విద్యా బోధన, అంతర్జా తీయ ప్రమా ణాలతో కూడిన విశ్వ విద్యాల యాల ఏర్పాటు - ఇలా ఎన్నెన్నో వినూత్న ఆలోచనలతో కూడి న హామీలు గుప్పి స్తున్నారు. మారు మూల ప్రాంతాలలో ఉపాధ్యాయుల గైర్హా జరు పెరుగుతున్న దని, విద్యార్థుల హాజరులో వాస్తవికత లోపించిందని, మధ్యాహ్న భోజన పథక నిధులు ప్రక్కదారి పడుతున్నాయని వీటన్నింటినీ క్రమబద్ధీకరిం చేందుకు పాఠశాల విద్యారంగంలో కూడా బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశ పెడ్తున్నట్లు ప్రకటించారు.



హాజరు నమోదుకు మార్కెట్‌లో దొరికే యంత్రాలలో అత్యంత ఖరీదైన "Mantra MFS Tab"లను సరఫరా చేశారు. వేలిముద్రల ద్వారా "కార్వే డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్" వారికి, ఐరిష్ ద్వారా హాజరును "అనాలజీస్ టెక్ ఇండియా లిమిటెడ్" వారికి సాఫ్ట్‌వేర్ రూపొందించే బాధ్యత అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిచేసి 2016-17 విద్యా సంవత్సరం నుండి అమలు ప్రారంభించారు. క్రమంగా రాష్ట్రంలో అన్ని జిల్లాలకు విస్తరించారు. ప్రతీ పాఠశాలకు ఒక ఐరిష్ యంత్రం, ప్రతీ 100మంది విద్యార్థులకు ఒక వేలిముద్రల యంత్రం చొప్పున సరఫరా చేశారు. ఆయా ప్రాంతాలలో పనిచేసే నెట్‌వర్క్ 2జి, 3జి సిమ్‌లు ట్యాబ్‌లకు అమర్చారు. హాజరు నమోదు చేసేకాలాన్ని "గ్రీన్‌జోన్-ఎల్లో జోన్-రెడ్‌జోన్"లుగా విభజించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హాజరును పర్యవేక్షించేందుకు "Dash Board" లు ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కాని ఇక్కడినుండే అసలు కథ మొదలైంది.

సరఫరా చేసిన యంత్రాలు నాసిరకంగా ఉండడం ఒక భాగమైతే, వాటిలో పొందుపరచిన సాఫ్ట్‌వేర్ ఇంకా అభివృద్ధి పరచే దశలోనే ఉండడం, నెట్‌వర్క్ సమస్యలు పెద్ద ఆటంకంగా మారాయి. జోన్‌ల పేరిట చేసిన హడావుడికి సకాలంలో హాజరు నమోదు చేసుకోవాలని గంటముందే విధులకు హాజరైనా ఎప్పుడు నమోదు అవుతుందో చెప్పలేని పరిస్థితి. హాజరు నమోదుకు ఒక్కొక్కరికి 2 నిమిషాలకుపైగా ఎక్కువ సమయం పట్టడం, ఒకటికి 10సార్లు ప్రయత్నించినా చక్రం తిరుగుతూనే ఉండడం జరుగుతోంది. ఉపా ధ్యాయుల ట్రైనింగ్‌లు, డెప్యుటేషన్ ప్రాంతాలలో హాజరు, సెలవులు నమోదు వంటి అంశాలు సాఫ్ట్‌వేర్‌లో లేకపోగా జీతభత్యాలు

బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే చెల్లిస్తామని విద్యాశాఖాధికారులు ప్రకటించడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు.

హాజరు నమోదుకు పదేపదే ప్రయత్నించడం వల్ల కొందరికి కంటి బాధలు కలుగుతున్నాయి. విద్యాబోధనా సమయం కూడా హరించుకుపోతూ ఉండడంతో బయోమెట్రిక్ హాజరుపై ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో చెట్లు, గుట్టలు ఎక్కితే గాని సిగ్నల్ దొరకడం లేదంటూ జోకులు పేలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నవంబర్ 1వ తేదీనుండి విద్యార్థుల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు ఆదేశాలు ఇచ్చారు. అంతేగాక మధ్యాహ్న భోజన పథకం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ ఇత్యాదులన్నీ బయోమెట్రిక్ విధానం ద్వారా పర్యవేక్షిస్తామని చెబుతున్నారు. ఇలాగైతే రోజంతా బయోమెట్రిక్ నమోదుకే సమయం సరిపోతుంది. విద్యా బోధనకు తీవ్ర ఆటంకాలు ఏర్పడే ప్రమాదముంది. దీనితో ఉపాధ్యాయులలో ఆందోళనల రెట్టింపు అయ్యింది. మొత్తంగా పరిణామాలన్నీ బయోమెట్రిక్‌ను ఒక “భయో'మెట్రిక్”గా మార్చివేశాయి.

టెక్నాలజీని అభివృద్ధికి వినియోగించుకోవాలి, అంతేగాని టెక్నాలజీ వినియోగమే అభివృద్ధి కాదు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వంటి చర్యలవల్ల మోదీ సర్కారు చెప్పినట్లు అభివృద్ధిలో లేశమైనా పెరుగుదలలేదు సరికదా! ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది. మరోప్రక్క ప్రభుత్వ డాష్‌బోర్డును పరిశీలిస్తే మొత్తం ఉద్యోగులు, ఉపాధ్యా యులలో రోజూ 80% పైబడి సకాలంలో హాజరు అవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని కార్యాలయాలను, కొంతమంది సిబ్బందిని ఇంకా రిజిష్టరు చేయక పోవడం, నెట్‌వర్క్ సమస్య పరిష్కారం కాకపోవడం, సెలవులు, ఆన్‌డ్యూటీలు నమోదు కాకపోవడం కూడా పరిగణనలోకి తీసుకుంటే 95%పైగా హాజరు కన్పిస్తుంది. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నా, లేకున్నా నిత్యం జరిగేది ఇదే. ప్రభుత్వ విధానాలు మెరుగుగావుంటే అభివృద్ధి కన్పిస్తుంది తప్ప బయోమెట్రిక్ హాజరు వల్ల కాదనేది స్పష్టమవుతోంది. అయినా ఉన్న కొద్దిపాటి అలసత్వాన్ని కూడా నియంత్రించేందుకు ఈ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు. అందుకు ప్రభుత్వం తక్షణమే కొన్ని చర్యలు తీసుకోవాలి.

1. ముందుగా నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలి. ప్రస్తుతం వినియోగిస్తున్న 2జి, 3జి సిమ్‌ల స్థానే “4జి సిమ్”లు లేదా “ఫైబర్ నెట్‌వర్క్” ద్వారా వైఫైతో కూడిన సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరచాలి.
2. నాణ్యమైన యంత్రాలు సరఫరా చేయాలి. పూర్తిగా అభివృద్ధి పరచిన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టాలి.
3. ప్రతీ పాఠశాలకు కనీసం 2 ఐరిష్ యంత్రాలు, ప్రతీ 50 మందికి ఒక వేలిముద్రల యంత్రం చొప్పున సరఫరా చేయాలి.
4. బయోమెట్రిక్ హాజరు నమోదు ఉపాధ్యాయులే పర్యవేక్షించవలసి వస్తున్నది. దీనివల్ల విలువైన బోధనా సమయం తగ్గిపోతోంది. కాబట్టి ఈ పనిని బోధనేతర సిబ్బందిని నియమించి వారికి అప్పగించాలి.
5. బయోమెట్రిక్ హాజరు నమోదు సమయాన్ని అర్థగంట సడలిస్తామని ముఖ్యమంత్రి ఏపిఎన్‌జిఓల రాష్ట్ర మహాసభలలో ప్రకటించారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలి. అంతవరకు ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేయకుండా అధికారులు వ్యవహరించాలి.
6. యంత్రాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసిన తర్వాత మాత్రమే బయెమెట్రిక్ హాజరును, జీతభత్యాల చెల్లింపుకు పరిగణనలోకి తీసుకోవాలి.

ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన 3 సం౹౹ల ప్రణాళికను పరిశీలిస్తే ప్రభుత్వం విద్యారంగంలో ప్రైవేటీకరణకు పెద్దపీట వేసేందుకు సిద్ధమౌతున్నట్లు స్పష్టమౌతుంది. డొల్ల పాఠశాలల పేరుతో పాఠశాలల కుదింపుకు పూనుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలలకన్న ప్రైవేట్ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నదని కాబట్టి పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో పాఠశాలలు నడపాలని సూచించింది. దీనికి బయోమెట్రిక్ హాజరును ఒక సాధనంగా వాడుకునే ప్రమాదం వుంది.

బయోమెట్రిక్ హాజరు మాటున పాఠశాలల కుదింపు, సిబ్బంది తగ్గింపువంటి చర్యలకు ప్రభుత్వ పూనుకుంటే పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు ద్వారా ప్రతిఘటించేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధంగా ఉండాలి.


## రచయితలకు ఆహ్వానం

సృజనాత్మకత, అభ్యుదయ భావజాలం కల్గిన రచనలను ఐక్య ఉపాధ్యాయ పాఠకులకు అందిం చాలనే లక్ష్యంతో కథలు, వ్యాసాలు, కవితలు పంపవలసిందిగా రచయి తలను ఆహ్వానిస్తున్నాము. సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే ఏ అంశానైనా వస్తువుగా తీసుకుని రచనలు పంపండి. అనుకరణ, అనువాదం కాకుండా స్వీయ రచన అయి ఉండాలి. హామీ పత్రం జత పరచండి. ప్రచుర నార్హమైన రచనలను సమయాను కూలంగా ''ఐక్య ఉపాధ్యాయ'' లో ప్రచురిస్తాము. రచనతోపాటు రచయిత ఫోటో, చిరునామా, ఫోన్ నంబరు పంపండి. **– సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ**

**రచనలు పంపవలసిన చిరునామా :**
**చీఫ్ ఎడిటర్, ఐక్యఉపాధ్యాయ,** 27-31-11,
గవర్నపేట, పాలపర్తివారి వీధి,
విజయవాడ- 520002
మెయిల్ : *ikyopadhyaya1975@gmail.com*

### ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు

| | | |
|---|---|---|
| **4వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 30,000 |
| **2వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 20,000 |
| **3వ కవర్ పేజీ (కలర్)** | - | ₹ 20,000 |
| **లోపలి పేజీ (బ్లాక్ & వైట్)** | - | ₹ 10,000 |
| **లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్** | - | ₹ 11,000 |

# విద్యాహక్కు చట్టం
# ఒక విఫల స్వప్నం!!



సిహెచ్. శ్రీహరి
ఐక్యఉపాధ్యాయ
సంపాదకవర్గ సభ్యులు

స్వాతంత్ర్యోద్య కాలంలో ఒక డిమాండ్‌గాను, ప్రజల స్వప్నంగాను ఉన్న ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు చట్టం, స్వాతంత్ర్యానంతరం 63 ఏళ్ళకుగానీ సాకారం కాలేదు. భారత దేశంలో ఉచిత నిర్బంధ ప్రాథమిక హక్కు అమలుపర్చాలని గోపాల కృష్ణ గోఖలే 1910లో బ్రిటీష్ కౌన్సిల్ ముందు ప్రతిపాదించిన 100 ఏళ్ళకు, 2010 ఏప్రిల్ 1న అమలులోకి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఎందుకు ఈ చట్టం అమలు చేయలేక పోయాం? ఎందుకింత ఆలస్యం అయ్యింది?

**మన పాలకుల వైఖరి :** మొదట్నించీ మన పాలకులకు ఇటువంటి చట్టం తీసుకురావడం, అమలు చేయడం ఇష్టంలేనట్లు అడుగడుగున కన్పిస్తుంది. 1947లో రాజ్యాంగ సలహామండలి విద్యాహక్కు చట్టం తేవడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. 1949లో డా॥ బి.ఆర్. అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల సహకారంతో రాజ్యాంగ అసెంబ్లీలో చర్చకు పెట్టారు. దురదృష్టవ శాత్తు అది వీగిపోయింది.

తర్వాత అనేక కమీషన్లు వచ్చాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కమీషన్ల ప్రతిపాదనలు చిత్తశుద్ధితో అమలుపర్చింది లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో ఉన్నత విద్యపై సర్వేపల్లి రాధా కృష్ణన్ కమీషన్ వేశారు. ఏదో నడిచినట్లే వుండింది. తీరాచూస్తే ఇవాళ ప్రపంచంలో అత్యుత్తమ 200 విశ్వ విద్యాలయాల్లో మనది ఒక్కటి కూడా లేదు. ఈ విశ్వవిద్యాలయాల జాబితాలో అమెరికావి 62, బ్రిటన్ 31, జర్మనీ 20, నెదర్లాండ్స్ 13, చైనా 7, కెనడా 6, .... ఈ దేశాలే కదా ఈ రోజు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి! టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై వచ్చిన లక్ష్మణస్వామి మొదలియార్ కమీషనర్ గానీ, కామన్ స్కూలు వ్యవస్థ ప్రతిపాదించిన కొఠారీ కమీషన్ గానీ అమలయ్యింది లేదు. అమర్త్యాసేన్ "మన పిల్లలు ఈ రకమైన దైన్య స్థితిలో వుండడానికి కారణం రాజకీయ చిత్తశుద్ధి, సామాజిక కార్యాచరణ లేకపోవడం తప్ప వనరులు లేక కాదు" అంటాడు. ఔను! ఈ కారణంగానే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది.

**విద్యా హక్కు చట్టం పూర్వరంగం :** విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) పాలకవర్గాలు బుద్ధిమార్చుకొని ఇచ్చిందేమీ కాదు. అనేక పోరాటాలు, కోర్టు వాజ్యాలు, సుప్రీంకోర్టు తీర్పు (1993లో ఉన్నికృష్ణన్ జడ్జిమెంట్)లతో గత్యంతరం లేక ఈ చట్టం తేవాల్సి వచ్చింది ప్రభుత్వాలకి.

రాష్ట్రాలు 6 సంవత్సరములలోపు పిల్లలందరికి బాల్యసంరక్షణ, విద్య సమ కూర్చాలని ఆర్టికల్ 45 చెపుతుంది. ఉచిత విద్య ఏ వయస్సువారికి అందించాలనే దానిపై పార్లమెంట్‌లో పెద్ద చర్చ నడిచింది. ఎన్‌డిఏ ప్రభుత్వం 0-6 వయస్సు పిల్లల్ని వదిలేసి 6-14 సం॥ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యగా పరిగణించి ఆర్టికల్ 45లోకి చేర్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉన్నికృష్ణన్ జడ్జిమెంట్‌లో "14ఏళ్ళ లోపు" అని చెప్పిందే తప్ప 6-14 సం॥లు అని కాదు. ఎట్టకేలకు 2002లో 86వ రాజ్యాంగ సవరణతో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించారు. ఆర్టికల్ 21కు (జీవించే హక్కు) అనుబంధంగా ఆర్టికల్ 21(ఎ)గా చేర్చారు. 2003 నుండి 2008 వరకు అనేక రూపాలుగా విద్యాబిల్లుపై చర్చ జరిగి చివరకు 2009లో చట్టం అయింది.

**ఆశల పల్లకితో విద్యాహక్కు చట్టం :** సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్న భారతీయ విద్యావ్యవస్థలో ఆశల పల్లకిగా విద్యాహక్కు చట్టం వచ్చిందని అందరూ భావించారు. విద్యాహక్కు చట్టం ఇలా చెప్పింది. "దేశంలో పిల్లలందరకు సమాన విద్యావకాశాలు, బోధనానుభవాలు ఇచ్చేదిగా విద్యావ్యవస్థ ఉండాలి. అంతేకాని నాశిరకం చదువు ఇచ్చే విధంగా ఉండకూడదు. స్కూలు అందుబాటుకు, నాణ్యమైన విద్యకు, సమానతకు తల్లిదండ్రులది బాధ్యతకాదు. అది రాజ్యం యొక్క బాధ్యత. ఈ బాధ్యతను efficiency పేరుతోనో, excellence పేరుతోనో, భాగస్వామ్యం పేరుతోనో పౌర సమాజానికి, ప్రైవేట్ వ్యక్తులకు వదిలేయకూడదు. భయంలేని బోధన, నేర్చుకొనే వాతా వరణం స్కూళ్ళలో ప్రభుత్వమే ఏర్పరచాలి. 8వ తరగతి వరకు డిటెన్షన్ అమలు చేయకూడదు..."

కానీ ఇప్పుడు ఏం జరుగుతోంది?

**విద్యాహక్కు చట్టం పట్టాలు తప్పిందా? :** విద్యాహక్కు చట్టం అమలు చేయడం మొదలుపెట్టిన తరువాత 3ఏళ్ళ కాలపరిమితిలో



జపాన్



ఆంధ్రప్రదేశ్

సరిపడినంతమంది టీచర్లను, స్కూళ్ళను ఏర్పాటుచేసి మార్చి 31, 2013 రివ్యూ జరపాలని నిర్ణయించారు. ఈ రివ్యూ తేదీ మార్చి 31, 2017కు, ఇప్పుడు తాజాగా మార్చి 31, 2019కు పొడిగించ బడిందే తప్ప రివ్యూ జరిగిందిలేదు. పాలకవర్గాల వైఖరిలో ఏ మార్పూ లేదు అని స్పష్టమౌతోంది. ప్రభుత్వ స్కూళ్ళలో 9.4 లక్షల ఉపాధ్యాయుల కొరత (ప్రాథమికలో 5.86లక్షలు, యుపిలలో 3.5 లక్షలు) అలానేవుంది. 96,000 స్కూళ్ళు నేటికీ ఏకోపాధ్యాయ స్కూళ్ళే. పుట్టగొడుగుల్లా పెరిగి 50% పిల్లలకు విద్యనందించే ప్రైవేటు స్కూళ్ళు విద్యాహక్కు చట్టాన్ని ఏ మాత్రం అమలు పర్చుడం లేదు. ఆర్‌టిఇ అమలుకు జాతీయ నియంత్రణా మండలి లేదు. చట్టాలు ప్రైవేట్ లాబీకి చుట్టాలై పోయాయి. టీచర్లు, భౌతిక వసతుల పరంగా చూస్తే దేశం మొత్తం మీద 9.54% స్కూళ్ళు మాత్రమే ఆర్‌టిఇ నిబంధనలకనుగుణంగా వున్నాయి. ఎంహెచ్‌ఆర్‌డి సర్వే-2014 ప్రకారం 60 లక్షలమంది పిల్లలు (వీధిబాలలు, బాలకార్మికులు, పేద నిర్వాసితులు) స్కూలు విద్యకు దూరంగా వున్నారు.

కేంద్ర ప్రభుత్వం చట్టం అయితే చేసిందిగానీ నిధుల కేటాయింపు పెంచిందిలేదు. గత బడ్జెట్‌లో విద్యా కేటాయింపు (జిడిపిలో) 3.7% కాగా ఈ సంవత్సరమూ అంతే. ఈ అరకొర కేటాయింపులో కూడా ఖర్చు పెట్టింది తక్కువ. 2010-16 కాలంలో 21% నుండి 41% నిధులు ఖర్చు చేయలేదు.

అంతరాల వ్యవస్థలు అలాగే కొనసాగుతున్నాయి. ఒకవైపున పంచాయితీరాజ్, గురుకుల, మోడల్, కస్తూర్బా స్కూళ్ళు, మరోవైపున నవోదయ, సర్వోదయ, కేంద్రీయ స్కూళ్ళుగా విద్యావ్యవస్థ చీలిపోయి వుంది. నాసిరకమైన బడి పరిస్థితుల వల్ల పిల్లలు తగ్గిపోవడంతో పంచాయితీరాజ్ పాఠశాలల మూత దావానలంగా దేశంలో విస్తరి స్తోంది. రాజస్థాన్‌లో 18,000, మహారాష్ట్రలో 13,000, ఆంధ్రప్రదేశ్‌లో 3195 స్కూళ్ళు మూతపడ్డాయి. "ఒకే దేశం - ఒకే పన్ను" అమలు పరచిన పాలకులు "ఒకే దేశం - ఒకే విద్య" ఎందుకు అమలు పర్చరు? తొండముదిరి ఊసరవెల్లి అవుతుందో లేదో గానీ 'ప్రైవేటు' ముదిరి 'కార్పొరేట్' అయింది. కార్పొరేట్ వ్యవస్థ విద్యను ర్యాంకులు, గ్రేడ్‌ల క్రిందకు దిగజార్చింది. ఈ ట్రాప్‌లో భారతీయ సమాజం చిక్కుక్కుపోయింది. కార్పొరేట్ వ్యక్తులు అన్ని వ్యవస్థలని నియంత్రించే శక్తిగా అవతరించారు. విద్యాహక్కు చట్టం సాక్షిగా అత్యంత ప్రమాదకరమైన "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం ముందుకొచ్చింది.

**విద్యా సంక్షోభం :** విద్యాహక్కు చట్టం అమలుచేస్తున్న జర్మనీ, క్యూబా, కెనడా, దక్షిణ కొరియా, ఫిన్‌లాండ్ లాంటి దేశాలు అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయి. ఈ దేశాల్లో చదువుంటే మన దేశంలోలాగా చదవడం రాయడం మాత్రమే కాదు. చదువుంటే - మెడికల్ రిపోర్టు చదవడం, బ్యాంక్ స్టేట్‌మెంట్ అర్థం చేసుకోవడం, ఉద్యోగవకాశాలు తెలుసుకోవడం, తన పిల్లలకు బోధించడం, కుటుంబ బడ్జెట్ వెసుకోగలగడం, లోన్ అగ్రిమెంట్ చదవడం, సాఫ్ట్‌వేర్ రాయడం, టీమ్‌ల్లో పనిచేయడం, శాస్త్రీయంగా ఆలోచించడం,..... మన దేశంలో విద్యాహక్కు చట్టం వచ్చి 7 యేళ్ళు కావస్తున్నా మంచి విద్యలేదు సరికదా మరింత దిగ జారుతోంది. ప్రతి యేడాది చావు డప్పు కొడుతున్నట్లు చెప్పే అసర్ నివేదికలేకాదు, ఇటీవల ప్రపంచబ్యాంకు విద్యా రిపోర్టు కూడా విద్యా



# బలిపీఠంపై భావితరం చదువులు

- కుప్పిలి కామేశ్వర రావు, శ్రీకాకుళం

**కనికరము లేని కార్పొ'రేట్' కళాశాలల్లో చదువులు**
**మార్కులు మాయాజాల రేసులో**
**విద్యార్థులను మరమనుషుల్లా మార్చేస్తుంటే**
**బట్టీ చదువులు నిబంధనలు బుర్రలు బద్ధలు చేస్తుంటే**
**నిదుర చాలక హాయి ఎరుగక ప్రశాంతతక రువై**
**ఇరుక గదులు వసతి గృహాల్లో**
**ఒదిదొడుకలు ఒత్తిళ్ళను జయించలేని బాల్యము**
**ఉక్కిరిబిక్కిరై ఉరితాళ్లకు వ్రేలాడుతుంటే**
**ఈ పాపం ఆ పసివానిదా? ఆశల పల్లకిలో**
**ఊగిసలాడి గర్భశోకంలో మునిగిన తల్లిదండ్రులదా?**
**కాసులే పరమాదవదిగా భావించే కళాశాల యజమానులదా?**
**నిబంధనలు నిలువరించలేని ప్రభుత్వ అధికారులదా?**
**పిపిపి జపము చేసే ప్రభుత్వాలదా?**
**ఎవరిదైతేనేమి? పోయేది వేల విద్యార్థులలో**
**"ఒంటిరి"దే కదా?**
**రేపటి భావితరము రాలిపోవలిసిందేనా?**
**మా"నవ" వనరులు మట్టిలో కలిసిపోవలిసిందేనా?**
**వీటిని ఆత్మహత్యలందామా? హత్యలందామా?**
**నిజాలు చెప్పే నీరజారెడ్డి కమిటీ సిఫార్సులపై నీళ్ళు చల్లిందెవరు?**
**పరిష్కారము చూపే చక్రపాణి కమిటీ రిపోర్టుకు చెదలు పట్టాయి ఎందుకు?**
**చదువు బతుకు నివ్వాలే కాని బలికోరుతుందెందుకు?**
**ఆత్మ విశ్వాసం అందింపుచ్చుకోవలసిన భావితరము**
**కౌమారములోనే కాలము చాలించడమెందుకు?**
**నవ నిర్మాణ నాయకులారా! ఆలోచించండి!**
**బలిపీఠము చదువులు నియంత్రించండి**
**భావితరాన్ని బతికించండి.... లేదా?**
**"రేపు" మనని తోడుగా రమ్మంటాయి...**

ప్రమాణాల దిగజారుడుతనాన్ని బైటపెడుతున్నాయి. నేర్చు కోవడం లేకుండానే స్కూలు సంవత్సరాలు దొర్లిపోతున్నాయని, పేద వాళ్ళ పిల్లలు తక్కువ నేర్చుకోగలుగుతున్నారని ప్రపంచబ్యాంకు నివేదిక తెలిపింది. పిల్లల్ని స్కూలు ఫెయిల్ చేస్తుండగా, స్కూలును వ్యవస్థ ఫెయిల్ చేస్తోందని కూడా తెలిపింది.

**మరి ఏది దారి?! :** ఏ దేశ అనుభవం చూసినా ప్రభుత్వం తప్ప ఏ ప్రైవేట్, కార్పొరేట్ వ్యవస్థ అయిన మంచి చదువు ఇచ్చిందా! విద్యకు ప్రముఖస్థానం ఇచ్చి జపాన్, నార్వే, ఫిన్‌లాండ్, జర్మనీ, అమెరికా, చైనా హై క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తున్నాయి. ఇటీవల చిలీ, పెరూ, పోలండ్, ఇంగ్లాండ్ అదే దారిలో నడుస్తూ ప్రగతి సాధించాయి. వియత్నాం తన ఆర్థిక పరిమితులను అధిగమించి మంచి చదువు విషయంలో జర్మనీ సరసన నిలిచింది. బ్రెజిల్, ఇండోనేషియాలు ఇదే బాట పట్టాయి. "వ్యవస్థ అనుకుంటే సాధ్యం" పై దేశాల అనుభవాలు చెపుతున్నాయి. మరి మన దేశం??...

అలా చేయాలనుకొనే ప్రభుత్వాలూ లేవు. చేయండనే బలమైన ప్రజా డిమాండూ లేదు. ఇదొక విషాద భరిత నిశ్శబ్దం! గడ్డకట్టిన మౌన సంస్కృతి!!



# కథల పుస్తకాలు – పాఠ్య పుస్తకాలు

**పుస్తకాలు :** మనుషులు తమ మెదళ్ళు చిలికి చిలికి తీసిన అనుభవాల సారం పుస్తకాలు. మనిషి తాను చేస్తున్న మహా ప్రస్థానంలో ఎదురైన సంఘటనలు, అనుభవాలు, తాను కనుగొన్న సృష్టి రహస్యాలు, తాను కన్న కలలు, కష్టాలు కన్నీళ్ళు, జయాలు, అపజయాలు సమస్తం పుస్తకాలలో భద్రంగా దాచుకొన్నాడు. మన పూర్వీకులు భవిష్యత్తు తరాల కోసం దాచిపెట్టిన గొప్పనిధి పుస్తకం.

గతించిన వారంతా పుస్తకాల ద్వారా మనతో మాట్లాడుతూనే వున్నారు. పుస్తకాల్ని ప్రేమించడమంటే మన పూర్వీకుల్ని ప్రేమించడం. మనుషుల్ని ప్రేమించడం. గతం నుండి గుణపాఠాలు నేర్చుకోవడం. పుస్తకాలు మన దగ్గర ఉన్నాయంటే మనుషులు మన వెంట ఉన్నారని అర్థం–మనకు తోడు ఉన్నారని అర్థం. ఇంత అద్భుతమైన పుస్తకాల్ని ఇష్టపడని వారు ఎవరు ఉంటారు. కాని దురదృష్టం ఏమిటంటే చదువుకొన్న వారిలో అంటే పుస్తకాలు చదవగలిగిన వారిలో నూటికి పదిమంది కూడా పుస్తకాలు చదవడం లేదు. గొప్ప చదువులు చదివి ఉన్నత పదవుల్లో ఉన్నవారు, వివిధ వృత్తుల్లో నిపుణులైన వారు ఏడాదికి ఒక్క పుస్తకం కూడా చదవనివారు నూటికి తొంభైతొమ్మిది మంది ఉన్నారు. నిరంతరం తమ మెదళ్ళకు పదును పెట్టుకొంటూ నిత్య విద్యార్థిగా వుండాల్సిన ఉపాధ్యాయులు సైతం పుస్తకాలు చదవడం లేదు. ఎందుకని? వ్యక్తుల్ని తప్పుబట్టి ప్రయోజనం లేదు. చదవమని పుస్తకం ఇచ్చినందువల్లగానీ, ఆజ్ఞాపించినందు వల్లగాని ఎలాంటి ప్రయోజనం లేదు. జీవితంలో పుస్తకాలంటే భయపడేటట్లు చేసిన సంఘటనలేవో వారు ఎదుర్కొని ఉంటారు.




సి.వి. కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక


విద్యార్థి దశలో బాల్యంలో ఎదురైన అనుభవాలే పుస్తకాలు చదవకపోవడానికి అసలైన కారణం. అదేమిటో పరిశీలిద్దాం.

**పాఠ్యపుస్తకాలు :** ఎంతో అద్భుతమైన పుస్తకం కాస్తా పాఠ్య పుస్తకంగా మారగానే అది తన అద్భుతాన్ని కోల్పోతుంది. నిస్సారంగా మారిపోతుంది. ప్రశ్నలు జవాబులతో నిండిపోయి బెత్తంతో బెదిరిస్తూ ఉంటుంది. అర్థమయ్యే సులభమైన విషయాలు కూడా అర్థంగాని గజిబిజి మంత్రాల్లా మారిపోతాయి. వాటిని వల్లెవేయలేక గుర్తు పెట్టుకోలేక సతమతమైపోతుంటారు. ఎక్కడ మరిచిపోతామోనని, పరీక్షల్లో రాయలేమేమోనని భయపడుతూ ఉంటారు. ఆ పాఠ్య పుస్తకాల్ని చదవడానికి అర్థం చేసుకోడానికీ సాధ్యంగాక గైడ్లు, నోట్ పుస్తకాలు దగ్గర పెట్టుకొని పాఠ్య పుస్తకాలు చూడకుండానే పాసైపోతారు. డిగ్రీలు సంపాదిస్తారు. పాఠ్య పుస్తకాల పీడ విరగడైనందుకు ఆనందపడి పోతారు. ఇక జీవితంలో వాటి ముఖం చూడరు. ఈ పాఠ్య పుస్తకాల మీద ఏర్పడిన వైముఖ్యం ఇతర పుస్తకాలపైకి కూడా మరలుతుంది.

పుస్తకం అనగానే దాన్ని చదివి గుర్తు పెట్టుకోవాలనే భయం వెంటాడుతూ ఉంటుంది. అందులో అర్థంగాని జ్ఞానం ఉంటుందేమోనని సందేహిస్తూ ఉంటారు. చివరకు జ్ఞానం అంటేనే అర్థంగాని బ్రహ్మపదార్థం అని బెదిరిపోతూ క్రమంగా తమ ప్రయాణాన్ని మూఢ నమ్మకాలవైపు అజ్ఞానంవైపు కొనసాగిస్తారు.

దీనికి మరో కారణం కూడా ఉంది. బాల్యంలో పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవకపోవడం. గుర్తుపెట్టుకోనవసరం లేని కథల పుస్తకాలు, వారపత్రికలు, దినపత్రికలు చదవక పోవడం. భాషా సాహిత్యాలతో వినోదించకపోవడం.

**కథల పుస్తకాలు :** కథలు ఇష్టపడనివారు ఉండరు. పిల్లలు కథలంటే చెవికోసుకొంటారు. పాఠం అంటే పారిపోయే పిల్లలు కూడా కథలనగానే ఆనందపడి పోతారు. కుదురుగా కూర్చుని వింటారు. కథల్లో ఉన్న దేమిటి? పాఠాల్లో లేనిదేమిటి?

కథల్లో ఉన్నదీ పాఠాల్లో లేనిదీ ఒక్కటే. అదే ప్రాణం. కథల్లో జీవం తొణికిసలాడుతూ ఉంటుంది. పాఠం ఎండి పోయిన మోడులా ఉంటుంది. కథ పూలతో పండ్లతో పక్షుల కిలకిల రవాలతో నిండిన పచ్చని చెట్టులాంటిది. కథ తియ్యటి రసంతో నిండిన చెరుకు గడ లాంటిది. పాఠం రసం పీల్చిపారేసిన పిప్పిలాంటిది. పాఠం ఇంత చప్పగా ఎందుకు ఉండాలి?

జ్ఞానం ప్రత్యేకంగా ఉండదు. అది జీవితంతో కలిసిపోయి వుంటుంది. మనిషి జీవితాన్నీ, ప్రకృతినీ తీసి పక్కనబెట్టి జ్ఞానాన్ని (లోపల దాగివున్న రహస్యాలను లేదా ప్రయోజనాలను) మాత్రమే చెప్పడానికి ప్రయత్నించడం వలన పాఠం సారంలేని పిప్పిలా తయారయింది. ఇలాంటి సారంలేని పాఠాలతో నిండిన పాఠ్య పుస్తకం మీద ప్రత్యేకంగా ఇష్టంగాని శ్రద్ధగాని ఎవరికీ ఉండదు. పైపెచ్చు నన్ను చదువు, చదివి గుర్తుపెట్టుకో అని నిరంతరం వెంటబడుతూ వుంటుంది. ఇందువలన పిల్లలు దానికి మరింత దూరంగా పారిపోతూ ఉంటారు.

**కథలంత కమ్మగా పాఠాలు :** పాఠం కథలా ఎందుకు ఉండ గూడదు? 12 సం॥లోపు పిల్లల పాఠ్య పుస్తకాలు కథల పుస్తకాల్లా ఉండాలి. వారు ప్రపంచాన్ని సజీవంగా చూస్తారు. రాళ్ళూ, నీళ్ళు, కొండలు, చెట్లు అన్నీ వారితో మాట్లాడతాయి. అందుకే పిల్లలు కార్టూను సినిమాలు ఎక్కువ ఇష్టపడుతూ ఉంటారు. వారికి జీవులు నిర్జీవులు అనే తేడా లేదు. రత్నాలు రాళ్ళు రెండూ వారికి ఒకటే. వారి ప్రపంచం చాలా ఉన్నతమైనది. విశాలమైనది. పెద్దలు ఆ ప్రపంచంలోకి ఎక్కివెళ్ళి బోధన చేయాలి. అప్పుడు పిల్లలు స్పందిస్తారు. ఆసక్తి చూపిస్తారు.

### విద్యాశాఖ వద్ద పెండింగ్‌లోన్ను రీయింబర్స్‌మెంట్స్ వెంటనే మంజూరు చేయాలి

పాఠశాల విద్యాశాఖ సచివాలయంలో పెండింగ్‌లోన్ను సుమారు 200 కేసులు తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యానాథ్‌దాస్‌ను నవంబర్ 1న కలిసి విజ్ఞప్తి చేయడమైనది. వీటిపై వెంటనే తగు చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని డిప్యూటీ సెక్రటరీని ఆదేశించారు.

### బయోమెట్రిక్‌లో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

బయోమెట్రిక్ పరికరాలు పని చేయకపోవడం, సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్స్ డౌన్ కావడం వంటి కారణాల వలన రోజుకి మూడుసార్లు హాజరు నమోదుకు ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని, ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు దేనికి ముడిపెడుతోందోనని ఆందోళన చెందుతున్నారని, బయోమెట్రిక్ హాజరు పడేవరకు బోధనకు అంతరాయం కలుగుతుందని నవంబర్ 1న ఆదిత్యనాథ్ దాస్‌ను కలిసి విజ్ఞప్తి చేశాము. దీనిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని తెలియజేశారు.

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆగస్టు 2017 నుండి బకాయి పడిన మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి అక్టోబర్ నెలలో విజ్ఞప్తి చేశాము. పాఠశాల విద్యాశాఖలో ఖాళీ పోస్టుల వివరాలు విద్యాశాఖ కమీషనర్ నుండి రప్పించుకొని ఆర్థికశాఖ అనుమతితో జీతాలు చెల్లిస్తామని ఆదిత్య నాథ్ దాస్ తెలిపారు.

### మెడికల్ రీయింబర్స్‌మెంట్ సాఫ్ట్‌వేర్ సరిచేయాలి

ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొరకు ఆన్‌లైన్‌లో పంపుతున్న క్లయిమ్స్ కొన్ని రిటన్ చేయబడుతున్నాయి. ఎందుకు రిటన్ చేస్తున్నారో వారికి తగు సమాచారం వెంటనే రావడం లేదు. ఈ జాప్యం వివరించాలి. రిటన్ చేసిన సందర్భంలో ఆరు నెలలు దాటితే తిరిగి ఆన్‌లైన్‌లో పంపుకొనుటకు సాఫ్ట్‌వేర్ అంగీకరించడం లేదు. కావున రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్ సమస్య పరిష్కరించాలని అక్టోబర్ 13న పాఠశాల కమీషనర్‌కు విజ్ఞప్తి చేయడమైనది. డిసెంబర్ 31వరకు అవకాశం ఇస్తూ సాఫ్ట్‌వేర్ సరి చేశారు.

### పిఆర్‌సి బకాయిల చెల్లింపుపై ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శితో జెఏసి బేటీ

10వ పిఆర్‌సికి సంబంధించి 10 నెలల పిఆర్‌సి అరియర్లు చెల్లించాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.రవిచంద్రను అక్టోబర్ 20న సచివాలయంలో ఏపిజెఏసి నాయకత్వం కలిసి విజ్ఞప్తి చేసింది.

పిఆర్‌సి అరియర్ల చెల్లింపుపై చర్చించాలని ఆర్థికశాఖ కార్యదర్శిని కోరగా వారం రోజుల్లో ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని రవిచంద్ర జెఏసి నేతలకు తెలిపారు.

గతంలో ఆర్థికశాఖ మంత్రి పిఆర్‌సి అరియర్ల చెల్లింపుపై విధివిధానాలు రూపొం దించుటకు ఆర్థికశాఖ కార్యదర్శితో చర్చించమని జెఏసి నాయకత్వానికి సూచించారు.

ఇటీవల స్థానిక సంస్థలు మరియు ఎయిడెడ్ సిబ్బందికి అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ కొరకు యిచ్చిన ఉత్తర్వులలో ప్రాస్పెక్టివ్‌గా అమలు చేయాలని పేర్కొనడం సరికాదని దీన్ని గతంలో నిలుపుదలచేసిన తేదీ నుండి అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని జెఏసి విజ్ఞప్తి చేసింది. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల 3 నెలల జీతాలు తక్షణం చెల్లించాలని, వచ్చే బడ్జెట్‌లో వీరి జీతాలకు పూర్తి బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.



ఐ.వెంకటేశ్వరరావు
యుటియఫ్ రాష్ట్రఅధ్యక్షులు

ఆర్థికశాఖ కార్యదర్శిని కలిసిన వారిలో జెఏసి చైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కో–చైర్మన్ ఎం.కమలాకర రావు, కోశాధికారి వీరేంద్రబాబు, పి.బాబురెడ్డి, పి.పాండురంగ వరప్రసాద్, పి.కృష్ణయ్య, కృష్ణమోహన్, బి.ఆశీర్వాదం ఉన్నారు.

### ప్రమోషన్లు, రిక్వెస్టు బదిలీలకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి హామీ - ఫ్యాప్టో

మున్సిపల్ టీచర్ల సమస్యలపై ముఖ్యకార్యదర్శి కరికాలవలవన్, డైరెక్టర్ కన్నబాబులు ఫ్యాప్టో నాయకత్వంతో అక్టోబర్ 24న సచివాలయంలో చర్చలు జరిగాయి. అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారం చేయుటకు అంగీకరించినట్లు ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టు ప్రాంతీయ డైరెక్టర్‌లు ప్రకటిస్తారని, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం ప్రమోషన్ లిస్టు మెరిట్–కం–రోస్టర్ విధానంలో ప్రకటిస్తామని అధికారులు అంగీకరించారు.
- ప్రమోషన్స్‌కుముందే పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలు చేస్తామని, ప్రమోషన్స్ తర్వాత అంతర్‌జిల్లా బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు.
- అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగేలా ఉత్తర్వులు ఇస్తామని, తెలుగు మీడియం బుక్స్ అందని వారికి అందిస్తామని, తెలుగు మీడియంలో పరీక్షలు నిర్వహించేలా ప్రశ్నాపత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
- అప్‌గ్రేడ్ అయిన పండిట్, పిఇటి పోస్టు అన్ని (100%) ప్రమోషన్స్ ఇస్తామని హామీ ఇచ్చారు.
- ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఎస్‌జిటి, ఉర్దూ పాఠశాలల్లోని పోస్టులు అన్ని అప్‌గ్రేడ్ చేయుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.
- సర్వీస్ రూల్స్‌లోని 'ఎబిలిటీ' అనేది తొలగించేందుకు 70:30 శాతం వంతున ప్రమోషన్, రిక్రూట్‌మెంట్ ఉండేలా నిబంధనలు సవరిస్తామని అంగీకరించారు.
- రేషనలైజేషన్ తర్వాత జరిగిన అక్రమ బదిలీలు, డెప్యుటేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వుల ఇస్తామని
- అప్‌గ్రేడ్ అయిన యుపి పాఠశాలలు, రేషనలైజేషన్‌లో నీడ్‌గా గుర్తించిన పోస్టులు మంజూరు చేయుటకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని

- మున్సిపల్ పరిధిలోని యుఎల్‌బి కో-ఆర్డినేటర్స్‌కి జాబ్‌చార్టు ప్రకటిస్తామని అంగీకరించారు.
- ఎంఇఓ / డివైఇఓ పోస్టులు తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేస్తామని
- 01.09.2004 తేదీకి ముందు ఉద్యోగంలో చేరినవారందరికి పిఎఫ్ అకౌంట్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని
- ఉపాధ్యాయులకు అదనపు భారంగా ఉన్న పీరియడ్లు తగ్గిస్తామని హామీ ఇచ్చారు.
- విదేశీ పర్యటనకు వెళ్ళే ఉపాధ్యాయులకు (ఎన్ఓసి) నో అబ్జక్షన్ సర్టిఫికెట్ 3 నెలల వరకు డైరెక్టర్, 6 నెలలు వరకు ముఖ్య కార్యదర్శి ఆమోదంతో ఇస్తామని అంగీకరించారు.
- రేషనలైజేషన్‌లో అసంబద్ధాలు పున:సమీక్షిస్తామని హామీ ఇచ్చారు.
- సిఎఫ్‌సి, ఏఎఫ్‌సి పాఠశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి పెట్టబోమని, విద్యార్థులను ప్రోత్సహించే మంచి ఫలితాల సాధనకు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ చర్చల్లో ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్, డైరెక్టర్ కన్నబాబు, డిప్యుటీ సెక్రటరీ వీరాంజనేయులు, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ చిట్టిబాబు, ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజ్, కో-చైర్మన్స్ సిహెచ్.సుధీర్‌బాబు, పి.కృష్ణయ్య, డిప్యూటీ సెక్రటరీ జనరల్ యం.రవిచంద్ర, కోశాధికారి జి.శౌరిరాయలు, కార్యవర్గ సభ్యులు ఎన్.రఘురామిరెడ్డి, ఇ. షణ్ముర్తి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**- ఫ్యాప్టో చర్చల ఫలితం :**

పండిట్, పిఇటి పోస్టులు 100 శాతం భర్తీ చేయుటకు మెమో నం.70557; తేది.24.10.2017న మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి విడుదల చేశారు.

## కథల పుస్తకాలు - పాఠ్యపుస్తకాలు

నది గురించి పాఠం చెప్పాలనుకోండి, నది పొడవు వెడల్పులు దానిమీద ఎక్కడెక్కడ ప్రాజెక్టులు కట్టారు, ఆ ప్రాజెక్టుల కింద ఎంత పొలం ఉంది, ఎన్ని నీళ్ళు ఉన్నాయి, ఎంత ఆదాయం వస్తుంది - అది ఎక్కడ పుట్టింది, ఎక్కడ సముద్రంలో కలుస్తుంది అంటూ లెక్కలు చెప్పినందువల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.

ఆ నదితో ఒక రైతు కుటుంబానికి, లేదా ఒక మత్స్యకారుని కుటుంబానికి, ఒక ఊరికి గల సంబంధం - నిత్య జీవితంలో మనుషులకు నదులకు గల అనుబంధం, మానవ నాగరికతతో నదికి గల సంబంధం గురించిన ఒక కథ చెబితే పిల్లలు ఆసక్తిగా వింటారు.

ఆవును గురించి చెప్పాలంటే - అది సాధు జంతువు దానికి నాలుగు కాళ్లు ఉంటాయి, ఒక తోక ఉంటుంది - దాని పాలు శ్రేష్ఠ మైనవి అని చెబితే ఉపయోగం లేదు.

ఆవుకు ఒక కుటుంబానికీ గల బంధం, ఆ ఆవు ఆధారంగా ఆ కుటుంబం జీవనం ఎలా పెనవేసుకుని పోయిందో ఒక కథలా ఉంటే ఎంతో ఆసక్తిగా ఉంటుంది.

కథల పుస్తకాలు ఇచ్చి చదవమని ప్రశ్నలు అడుగుతామని నిబంధన పెట్టకూడదు. చదవండి మర్చిపోండి అని చెప్పండి. మరింత బాగా చదువుతారు. ఇష్టంగా చదివే విషయాలు మరిచి పొమ్మన్నా మరిచిపోరు.

పాఠాలు కథల్లా ఉన్నా కొన్ని కథలనే పాఠాలుగా పెట్టినా ఎంతో ఉపయోగం - పిల్లలకు పుస్తకాలపైన ఇష్టం కల్గుతుంది. క్రమ క్రమంగా అన్నీ కథల్లా ఉండకపోయినా విజ్ఞానం కోసం పుస్తకాలు చదివే అలావాటు చేసుకొంటారు.

పాఠాలన్నీ వ్యాసాల్లా ఉండగూడదు. కథ, నాటకం, స్వగతం, పాట, పద్యం, ఎన్నో పద్ధతులున్నాయి - అన్ని ప్రక్రియలు ఉపయోగించుకోవాలి. సాధ్యమైనన్ని పాఠాలు నాటికలుగా రాయమని ప్రోత్సాహించి పిల్లల చేత నాటికలు వేయించవచ్చు.

ఇదంతా శ్రమగాదు. ఆనందం. ఇది సృజనాత్మక బోధనలో ఒక భాగం. భవిష్యత్తు తరాలు పుస్తకాలు చదవాలి, జ్ఞానాన్ని ఇష్టపడాలి. విజ్ఞానవంతమైన సమాజమే ముందుకు వెళుతుంది. లేకపోతే వెనుకబడిపోతాం. వెనుకబడ్డ సమాజం విచ్ఛిన్నమవుతుంది.

### మీకు తెలుసా?

బోధనలో ఉన్న పరమార్థం పిల్లలచేత ఇష్టంగా పుస్తకాలు చదివేటట్లు చేయడమే. అది కథల పుస్తకమైనా-పాఠ్య పుస్తకమైనా.



## భయో.... మె"ట్రిక్"

పి.గోపీనాథ్
నెల్లూరు

భావితరాల శిల్పాల్ని
మలిచే బాధ్యతలో శ్రమిస్తున్న ఉపాధ్యాయా!
నీ క్రమశిక్షణకొక యాంత్రికపరీక్ష మొదలైంది
సుద్దముక్క పట్టే బటనవేలును భద్రంగా
ఒక యంత్రానికి అంకితమిచ్చే
ఏకలవ్య శిష్యుడువి నువ్విప్పుడు
నీ వేలిముద్రలు లిఖించే నిజాయితీని
అందనంత దూరం నుండి అంచనావేస్తూ
ఆకాశమార్గ తరంగ దేగకళ్ళతో
అజమాయిషీ చేసే యజమానికి
నేడు నువ్వొక ఆధునిక దాసుడివి
నీ కంటిజీరల చారల తీరును
ఇట్టే పసిగట్టి చెప్పే ప్రాణంలేని పెట్టె ఎదుట
ప్రతి ఉదయం...సాయంత్రం
చేతులు కట్టుకొని నిలబడే
నీ చుట్టూ బోను ఒక్కటి లేదుగానీ...
నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవలసిన
ముద్దాయివే నువ్వు ప్రతినిత్యం
ఆడపిల్లల అత్యవసరాన్ని తీర్చే
మూత్రశాలలకు సైతం నోచుకోని
బళ్ళలో కూడా రెక్కలు విప్పుకొని ఇప్పుడు...
సాంకేతికత హైటెక్ రంకెలేస్తోంది చూడు
ఎన్నాళ్ళింకా అలా వెనుక నిలబడి ఉంటావ్
అక్షరాలంటని అరిగిపోయిన బోర్డులా!?
చెట్టుక్రింద చదువులు ఉంటే ఉండు గాక
ఆ గుట్టును గప్ చుప్ గా కప్పిపెట్టి
నీ కళ్ళకు గంతలు కట్టుకొని
ఆధునికత గుర్రం మీద అలవిగాని సవారీ నేర్చుకో!
పుస్తకాలూ, పాఠాలూ, పరీక్షల
పాతచింతకాయ జాడీల మూతిని బిగించే
డిజిటలైజేషన్ దీర్ఘప్రయాణం
మొండిగోడల తరగతి గదుల్లో మొదలైందంట
ఈ ప్రగతికి పరవశిస్తూ పాఠాలు చెప్పుకో!!
మనిషి బోధించడం..మనసును వినడం
మానవత్వకాలం నాటి మాట
యంత్రాలకు అంకితమయ్యే కాలంలోకి
సకాలంలో నిన్ను హాజరు పరచడానికై
"జీ హుజూర్" అంటూ అధికార యత్రాంగం
తెచ్చింది ఈ....."ఈ - హాజర్
విశాల ప్రయోజనాన్ని
పంచాల్సిన చదువులను
ఎప్పటినుంచో వీధిలో పెట్టి అమ్ముతున్న
విద్యారంగ పరిరక్షణ నాటకపర్వంలో
సరికొత్త ట్రిక్ కాదా...?? చెప్పు
ఈ బయోమెట్రిక్!!

# నిరసనలు - ధర్నాలు

**తూర్పుగోదావరి జిల్లా**

## పిఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలి




**కాకినాడ :** పిఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలంటూ యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అక్టోబర్ 12న జెడ్పి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటియఫ్ జిల్లా అధ్యక్షులు డివి రాఘవులు మాట్లాడారు. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి కెవిఎస్ ప్రసాద్ ధర్నాకు అధ్యక్షతన వహించారు. ఆయన పిఎఫ్ స్లిప్పులను విడుదల చేసే వరకూ ధర్నాను కొనసాగిస్తామన్నారు. యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ కె.సత్తిరాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ రోజు పిఎఫ్ సొమ్మును అందించా లన్నారు. ధర్నాతో జెడ్పి అధికారులు నాయకులను చర్చలకు ఆహ్వానించారు.

జెడ్పి చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, జెడ్పి డిప్యూటీ సిఇఓ సుబ్బారావు, సూపరింటెండెంట్లు, పిఎఫ్ సెక్షన్ సిబ్బంది ఈ చర్చల్లో పాల్గొన్నారు. పిఎఫ్ సెక్షన్‌లో సిటిజన్ చార్టర్ తయారీ, లోనులు, పార్ట్‌ఫైనల్స్ సొమ్ములు 5 రోజుల్లో విడుదల చేయాలని నాయకులు కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు. అలాగే ఫైనల్ పేమెంట్స్ 15 రోజుల్లో ఫ్రీ ఆడిట్‌కు పంపడానికి అంగీకరించారు. వైద్యంకోసం ఇచ్చే పిఎఫ్ సొమ్మును రూ.2లక్షలకు పెంచేందుకు హామీ ఇచ్చారు.

## పిఎఫ్ స్లిప్పులు విడుదల



పిఎఫ్ స్లిప్పులు కోసం ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని జెడ్పి చైర్మన్ తన కార్యాలయానికి ఆహ్వానించి మాట్లాడారు. కంప్యూటర్ రూమ్‌కు తీసుకెళ్లి 2015-16కు సంబంధించిన స్లిప్పులను వెబ్‌సైట్ లాంచ్‌చేసి కొన్ని స్లిప్పులు అందించారు. అనంతరం చైర్మన్ నవీన్‌కుమార్ ధర్నా శిబిరానికి వచ్చి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర వర్మ, జిల్లా ప్రధానకార్యదర్శి టి.కామేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.అరుణకుమారి, జోగా అప్పారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.జ్యోతిబసు, పి.కిష్టయ్య, ఇ.చైతన్యకిరణ్, ఎం.విజయగౌరి, ఎన్.విశ్వనాథ్, జె.సత్యనారాయణ, టివిజిఆర్‌ఆర్ చక్రవర్తి, ఎ.షరీఫ్, టిజి వాసింగ్టన్, ఆర్.వి.రమణమూర్తి, పెంకే వెంకటేశ్వరరావు, వి.చంద్రశేఖరరావు, పి.నాగేశ్వరరావు, సిహెచ్.వి.రమణ, వివి రమణ తదితరులు పాల్గొన్నారు. పిఇటి అసోసియేట్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.జార్జి ధర్నాకు మద్దతు తెలిపారు.

## కార్యకర్తలలో పోరాట స్ఫూర్తిని రగిలించిన డిఇఓ కార్యాలయం ధర్నా

ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని, డిఎస్‌సి జరిగేలోగా స్థానిక గిరిజన అభ్యర్థులతో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేయాలని, మైదానప్రాంత డిఇఓ పూల్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలనే డిమాండ్ల సాధనకు యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా పదిరోజుల కార్యాచరణను జిల్లాలో అమలు చేసింది. అక్టోబ 16వ తేదీ నుండి అక్టోబర్ 26వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో కార్యాచరణను అమలుచేసి ఉపాధ్యాయులను పోరాటానికి సన్నద్ధం చేయడం, అక్టోబర్ 27వ తేదీన డిఇఓ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించాలని జిల్లా శాఖ పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా అక్టోబర్ 16వ తేదీన కొవ్వొత్తులతో ప్రదర్శన - మానవహారాలు, 19వ తేదీన డిఇఓకి వాట్సాప్ మెసేజెస్, 20వ తేదీన వివిధ స్థాయి అధికారులకు వినతిపత్రాలు, 21వ తేదీన ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, 22వ తేదీన వంటావార్పు, 23వ తేదీన మండల కేంద్రాలలో ర్యాలీలు, 24వ తేదీన సదస్సులు, 25,26వ తేదీలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

అక్టోబర్ 27వ తేదీన డిఇఓ కార్యాలయం వద్ద జరిగిన మహా ధర్నాకు జిల్లా అధ్యక్షులు డి.వి.రాఘవులు అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసంలో రాఘవులు మాట్లాడుతూ 27 డిమాండ్లతో నోటీసు ఇచ్చామని, అధికారుల నుండి స్పందన లేని నేపథ్యంలో అనివార్యంగా ధర్నాను చేపట్టామని అన్నారు. ధర్నా శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి కెవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బదిలీల నిబంధనలకు విరుద్ధంగా డిఇఓ పూల్ ఉపాధ్యాయులను ఏజెన్సీలో పనిచేయించడం తగదన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసి ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ సబ్ కమిటీ చైర్మన్ ఇ.చైతన్యకిరణ్ ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా ఎల్‌పిసిలు పంపిన వైనాన్ని ఎద్దేవా చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి డిమాండ్లపై మాట్లాడారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి శేషబాబ్జీ మాట్లాడుతూ తమ పార్టీ తరపున ఈ డిమాండ్లపై విద్యాశాఖాధికారులకు ప్రాతినిధ్యం చేస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజా, సిఐటియు నాయకులు వీరలక్ష్మి, అజయ్‌కుమార్, డివైఎఫ్ఐ నాయకులు పలివెల వీరబాబు ధర్నా శిబిరానికి విచ్చేసి సంఘీభావ సందేశాలిచ్చారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.జార్జి మాట్లాడుతూ డిమాండ్లలో పిఇటిల సహేతుకమైన డిమాండ్లను చేర్చడాన్ని బలపరుస్తున్నామన్నారు. ధర్నా శిబిరానికి వచ్చిన జిల్లా విద్యాశాఖాధికారి వారిని, అసిస్టెంట్ డైరెక్టర్లను జిల్లా నాయకత్వం నిలువరించి, ఉత్తర్వులతోనే పోరాటాన్ని ఆపుతామని స్పష్టం చేయడం జరిగింది.

### డిఇఓ కార్యాయాల ముట్టడి

డిఇఓ పూల్ ఉపాధ్యాయుల రిలీవింగ్‌పై స్పష్టత రాకపోవడంతో ఆ రోజు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. జిల్లాశాఖ పోరాట రూపాన్ని మార్చి డిఇఓ కార్యాలయాన్ని అదే రోజు ముట్టడించడం జరిగింది. డిఇఓ ఆఫీస్ ఆవరణలోనే వంటా వార్పు నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది. తదుపరి జరిగిన చర్చలలో 20మంది డిఇఓ పూల్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి సమ్మతించడం, ఉత్తర్వులివ్వడం జరిగింది. అలాగే మిగిలినవారి రిలీవింగ్ కొరకు సిఎస్ఇని అనుమతి కోరుతూ లేఖవ్రాశారు. స్పెషల్ డిఎస్‌సి, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల కొరకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. రెండు రోజులలో చర్చల మినిట్స్ పంపుతామని హామీనిచ్చారు. పది రోజులలో సర్వీస్ రెగ్యులరైజేషన్ ఉత్తర్వులిస్తామని హామీ రావడం, మిగిలిన సమస్యలను మూడు రోజులలో పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకొని చర్చలలో పాల్గొనడం జరిగింది.

### విలీన మండలాల నుండి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

**వి.ఆర్. పురం :** యుటియఫ్ తూర్పు గోదావరి జిల్లా కమిటీ పిలుపు మేరకు వి.ఆర్. పురం మండల కమిటీ ఆధ్వర్యంలో విలీన మండలాల్లో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు విలీన మండలాల నుండి రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

అనంతరం జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి సోడె. నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది డిఇఓ పూల్ ఉన్న 2016 డియస్సీ ఉపాధ్యాయులను పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలైన ఎటపాక, కూనవరం, వి.ఆర్. పురం, చింతూరు లలో పని సర్దుబాటు ప్రక్రియలో నియమించారు. వీరి నియామకం ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని ఆరోపించారు. ఇటీవల బదిలీలలో వీరందరు మైదాన ప్రాంత పాఠశాలలను కోరుకన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో యస్.శంకర్, యస్. వెంకటేశ్, బి.నాగయ్య, వీర్రాజు, బి.ముత్తయ్య ఆనంద్, యస్.కన్నారావు, పి.కృష్ణ మూర్తి, ఇ.పాపారావు శ్రీమతి యం.విజయకుమారి తదితరులు హాజరయ్యారు.

### పిఎఫ్ సమస్యల పరిష్కార నిమిత్తం యుటియఫ్ నిరసన నాయకులు అరెస్టు



**శ్రీకాకుళం :** గడిచిన చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని యుటియఫ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట అక్టోబర్ 27న ధర్నా కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా ధర్నా నిర్వహిస్తున్న యుటియఫ్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పోలీసు స్టేషన్‌లో ధర్నా కొనసాగించారు. యుటియఫ్ తీవ్రంగా ఖండించింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు, జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నమోదులు సక్రంగా చేపట్టలేదని, ప్రారంభ నిల్వ, అంత్య నిల్వలు ఒక ఆర్థిక సంవత్సరంకి, తదుపరి ఆర్థిక సంవత్సరంకి వ్యత్యాసం ఉందని, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు అంత్య నిల్వ చెల్లింపులు, ఆడిట్ పరిష్కారంలో ఆడిట్ నందు తమ జాప్యం జరుగుతుందని, ముడుపులు చెల్లించనిదే క్లైముల పరిష్కారం కావడంలేదని గతంలో పలుమార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికీ జిల్లా పరిషత్ యాజమాన్యం తీరులో మార్పు రాలేదని, సమస్యల పరిష్కార దిశగా ఎటువంటి చొరవ చూపలేదని విమర్శించారు.

రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ వెంటనే పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు కె.కామేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు బి.శ్రీరామమూర్తి, యమ్.వాగ్దేవి, పి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు పి.ధర్మారావు, బి.చిట్టిబాబు, కె.వి.శ్రీరామ్‌మూర్తి, కె.చంద్రరావు, కె. ఉమాశంకర్, ఎస్.వెంకటరావు, హెచ్.అన్నాజీ, బి.ప్రకాశరావు, ఎల్.కోదండరావు, కె.గౌరినాయుడు, నాయకులు టి.వైకుంఠరావు, బి.రవికుమార్, జి.శ్రీనివాసరావు, జి.క్రాంతికుమార్, వి.శంకరరావు, బి.మురళీధర్, కె.సురేష్ కుమార్, డి.రాజేశ్వర రావు, శారద తదితరులు పాల్గొన్నారు.





# సిపిఎస్ రద్దుకు దేశవ్యాప్త పోరాటం

**విజయనగరం :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అందుకోసం దేశ వ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవుతున్నామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి తెలిపారు.

అక్టోబర్ 15న స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సిపిఎస్ రద్దు – పాత పెన్షన్ విధానం సాధనకు" జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యతన జరిగిన కార్యక్రమంలో బాబురెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 56 లక్షలు, రాష్ట్రంలో లక్షా 84వేల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సిపిఎస్ విధానం వల్ల తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగి చెల్లించే పదిశాతం, ప్రభుత్వం చెల్లించే పది శాతం వాటాను షేర్‌మార్కెట్‌లో పెట్టి ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సిపిఎస్ విధానం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట పెద్ద ప్రమాదంగా మారిందన్నారు. తక్షణమే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

మరోవైపు రాష్ట్రంలో కార్పొరేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేటు విద్యా సంస్థల్లో మరణాలపైనా, పదో తరగతి ఫలితాలపైనా హైకోర్టు జడ్జిలతో విచారణ జరిపించాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు పాఠశాలల్లో అమలు చేస్తున్న బయో మెట్రిక్ యంత్రాలు నాసిరకమైనవి ఇవ్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బయోమెట్రిక్‌తో వేతనాలు లింక్‌పెట్టడం సరికాదని తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2017 చట్టాన్ని విరమించుకోవాలన్నారు. పిఆర్‌సి, ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 398 వేతనం ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నవంబర్, డిసెంబర్ ఉద్యమించనున్నామని తెలిపారు.

సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, రాష్ట్ర కార్యదర్శి డి.రాము, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ, ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి, జిల్లా నాయకులు జి.నిర్మల, రమేష్‌చంద్ర పట్నాయిక్, మురళీమోహన్, ఎం.కృష్ణారావు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**

**తిరువూరు :**


కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని యుటియఫ్ కృష్ణా జిల్లా కోశాధికారి ఎ.కృష్ణసుందరరావు అన్నారు. యుటియఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 16న తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు కోరుతూ ధర్నా చేశారు.

2004 నుంచి ప్రవేశపెట్టిన కొత్త పెన్షన్ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని పలుమార్లు వివరించినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని కృష్ణసుందరరావు వివరించారు. ఈ విధానం రద్దుకు వెంటనే ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నాలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం.శ్రీనివాస్, డి.అపర్ణ, తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు మండలాల యుటియఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తయ్య, నాగేశ్వరరావు, రవీంద్ర, శ్రీనివాసరావు, చంటి, కృష్ణారావు పాల్గొన్నారు. తహసీల్దారు బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

**విస్సన్నపేట:**

సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటియఫ్ మండల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటియఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అక్టోబర్ 16న ధర్నా నిర్వహించారు.



శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం రద్దుచేస్తూ శాసనసభలో తీర్మానించి పాత పెన్షన్ విధానం అమలు చేసి ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చేయాలని కోరారు. యుటియఫ్ మండల అధ్యక్షులు జి.సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు పి.వీరకోటి, అసోసియేట్ అధ్యక్షులు వి.కిషోర్‌కుమార్, కోశాధికారి ఎ.శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**నూజివీడు :**



పింఛను సదుపాయం ఉద్యోగుల హక్కు అని, యజమాని తన ఇష్టప్రకారం ఇచ్చేది కాదని 1982లో సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొందని, దీనిని బట్టే రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్ పథకాన్ని రద్దుచేసి పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాలని యుటియఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేస్తూ యుటియఫ్ నూజివీడు, ముసునూరు మండలాల యూనిట్ల ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అక్టోబర్ 16న ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టులపై, ప్రజా హక్కులపై ఏ మాత్రం గౌరవం ఉన్నా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నడుచుకోవాలన్నారు. నూతన పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగిస్తూ అసెంబ్లీలో తీర్మానించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నూజివీడు, ముసునూరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సాకా రవి, ఎంవీ విరూపాక్షరావు, ఎం.వేదనాయకం, కె.అజరయ్య, నాయకులు పిల్లా జోజప్ప, పి.ధనరావు, ఎ.కోటేశ్వరరావు, టి.హరిప్రసాద్, పి.జగదీశ్వరరావు, పి.పద్మావతి, పి.పద్మాదేవి, మార్షా ధనలక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

**అవనిగడ్డ :**



నూతన పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేయాలని కోరుతూ యుటియఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు అక్టోబర్ 16న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు గ్రాట్యూటిని, కమ్యుటేషన్, కుటుంబ పెన్షన్, పిఎఫ్‌ని కోల్పోయారని చెప్పారు. ఇటీవల పోరాటాల ఫలితంగా కుటుంబ పెన్షన్, గ్రాట్యూటీని సాధించుకున్నామన్నారు. సిపిఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం వచ్చేవరకూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దుచేస్తూ శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అనంతరం తహసీల్దార్ ఆశయ్యకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాది, జనసేన కార్యకర్త రాయపూడి వేణుగోపాలరావు ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.కనకారావు, కోడూరు, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక మండల అధ్యక్ష, కార్యదర్శులు వి.విష్ణువర్ధన్, ఎన్ఎన్ స్వామి, జి.శ్రీధర్, రామకృష్ణ, బి.శివరామకృష్ణ, సింహాద్రి శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, డి.నవజీవన్, ఎ.సునీత, పి.తనూజ, నవీన పాల్గొన్నారు.

**బంటుమిల్లి :**




కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్ రద్దు కోరుతూ యుటియఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 16న స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న కృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఏ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసేంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేయాల్సి ఉందన్నారు. సంఘాల ఆందోళనను గుర్తించి ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

యుటియఫ్ పిలుపుమేరకు నిర్వహించిన ఈ ధర్నాలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల యుటియఫ్ అధ్యక్షులు కెజె మల్లేశ్వరరావు, కె.సూర్యప్రకాశరావు, జిల్లా కార్యదర్శి ఎండి షౌకత్ హుస్సేన్, మండల సిపిఎస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, సిహెచ్. సాంబశివరావు, జిల్లా, మండల సిపియు ప్రతినిధులు పాల్గొన్నారు.

**గుడివాడ టౌన్ :**



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై వివక్ష చూపుతుందనడానికి సిపిఎస్ పెన్షన్ విధానమే నిదర్శమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి అన్నారు. అక్టోబర్ 16న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యుటియఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక విధాలుగా మోసం చేస్తుందన్నారు. గతంలో ఏళ్ళతరబడి పెన్షన్ ప్రభుత్వమే ఇచ్చిందని, ఇప్పుడు ఈ విధానం ప్రవేశ పెట్టడం వలన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీన్ని రద్దుచేస్తూ ప్రభుత్వం రానున్న శాసనసభ సమావేశాలలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యుటియఫ్ జిల్లా కార్యదర్శి సీతారాం, మాజీ కార్యదర్శి గోవర్ధన రావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మీరా హుస్సేన్, నీలం ప్రభాకరరావు, సిఐటియు డివిజన్ సభ్యులు బి.వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కైకలూరు :**



ఉద్యోగులకు గుదిబండగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలకు చెందిన యుటియఫ్ సంఘం నాయకులు కైకలూరు ఎన్జీవోస్ హెూం వద్ద అక్టోబర్ 16న నిరసన వ్యక్తం చేశారు. డెప్యూటీ తహసిల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ మాట్లాడుతూ సామాజిక భద్రత లేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయడానికి మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సిహెచ్.వరలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల్లో 10శాతం, ప్రభుత్వ వాటా 10శాతం కలిపి షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా చెల్లించి, ఉద్యోగులకు పెన్షన్ అందిస్తామనడం అన్యాయమన్నారు. కైకలూరు, మండలవల్లి యుటియఫ్ అధ్యక్షులు ఏసురత్నం, ఏలియా, కైకలూరు కలిదిండి, ముదినేపల్లి మండలాల సంఘం ప్రధానకార్యదర్శులు మారెళ్ల రవిశంకర్, ఆంజనేయులు, బేతాళ రాజేంద్రప్రసాద్, తాలూకా ఎన్జీవో అధ్యక్షులు కెపి రావు, బిజెపి నేతలు లావేటి వీర శివాజీ, బేతాళరావు, బిజెపి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జగయ్యపేట అర్బన్ :**



నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 16న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు యుటియఫ్ ఆధ్వర్యంలో జగ్గయ్య పేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల స్థాయిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటియఫ్ పేట మండల అధ్యక్ష, కార్యదర్శులు వర్సా శ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య తదితరులు మాట్లాడుతూ యుటియఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎస్ రద్దు ఏకైక అజెండాగా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ బి.ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి షేక్ దస్తగిరి, వత్సవాయి మండల అధ్యక్ష, కార్యదర్శులు అజ్మీరు శ్రీను, షేక్ హుస్సేన్, ఎన్జీవో సంఘం వీఆర్వోల సంఘం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

**మైలవరం :**




సిపిఎస్ రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని యుటియఫ్ మైలవరం మండల శాఖ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అక్టోబర్ 16న ధర్నా చేపట్టారు. మైలవరం, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు యుటియఫ్ పూర్వ గౌరవాధ్యక్షులు జి.పాల్‌బాబూరావు, విశ్రాంత నాయకుడు పి.వెంకటేశ్వరరెడ్డి, మైలవరం మండల శాఖ గౌరవాధ్యక్షులు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి



**ఆగిరిపల్లి :** సిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు అక్టోబర్ 26న మండల కేంద్రమైన ఆగిరి పల్లిలో పోస్టుకార్డు ద్వారా ఉద్యమం చేపట్టారు. 30 సం॥ల పాటు ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన తరువాత మిగిలిన జీవితంపై ఆందోళన కల్గిస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పోస్టుకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి గంపా వెంకట్రావ్, టిఎన్‌యుఎస్ అధ్యక్షులు ఎ. తిరుపతయ్య, ఎస్‌టియు మండల అధ్యక్షులు దాసు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఉద్యమవార్తలు పంపండి

**యుటియఫ్ జిల్లా శాఖలు, మండల శాఖలు మీ జిల్లా / మండలంలో నిర్వహించిన సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రాతినిధ్యాల వార్తలను, ఫోటోలను ఎప్పటి కప్పుడు 'ఐక్య ఉపాధ్యాయ'కు మెయిల్ / పోస్టు ద్వారా పంపండి. మీ పోరాటాలు, విజయాలు అన్ని జిల్లా / మండల శాఖలకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ప్రతినెల 30వ తేదీలోగా వచ్చిన వార్తలు, ఫోటోలు మరుసటి నెల పత్రికలో ప్రచురించడం జరుగుతుంది. – సంపాదకవర్గం**

# బయోమెట్రిక్‌పై నిరసనలు

**శ్రీకాకుళం జిల్లా**

**ఉపాధ్యాయులను వేధిస్తే సహించేది లేదు**

**నందిగాం :** బయోమెట్రిక్ హాజరును ముడిపెట్టి ఉపాధ్యాయులను వేధిస్తే సహించేది లేదని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ స్పష్టం చేశారు. రాష్ట్ర మహాసభల క్యాంపెయిన్‌లో భాగంగా అక్టోబర్ 16న నందిగాం మండలంలోని పలు హైస్కూళ్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో ఉపా ధ్యాయులు బయోమెట్రిక్‌పై పలు సందేహాలు వ్యక్త పరుస్తున్నారన్నారు. ప్రభుత్వం నాసిరకమైన బయోమెట్రిక్ యంత్రాలు అందించిందనీ, రిమోట్ ఏరియాల్లో సరైన సిగ్నల్స్ లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించు కోకుండా యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నా యన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని విద్యార్థులు, విద్యా విధానాలను కాపాడా లని, లేకుంటే ఉద్యమంచేస్తామని హెచ్చరించారు.





ఈ నెల 19న జరగ నున్న యుటియఫ్ జిల్లా మహా సభలు, డిసెంబర్ 9,10,11 తేదీలలో జరుగ నున్న రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు, ప్రతినిధులు వి.సింహాచలం, బాలక శంకరరావు, ఎర్రన్నాయుడు, బాబూరావు, కూరాకులు, ఎస్. అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

**ఆందోళనకు గురిచేస్తున్న బయోమెట్రిక్**

**ఏలూరు :** అక్టోబర్ 10న ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ జెఏసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బయోమెట్రిక్ అటెండెన్స్ విషయంలో పరికరాలు పనిచేయకపోయినా ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడాన్ని జిల్లా టీచర్ల జెఏసి తీవ్రంగా ఖండించింది. ఏ జిల్లాలో లేని విధంగా పశ్చిమగోదావరి జిల్లాలో బయోమెట్రిక్ (ఐరిష్), బయోమెట్రిక్(థంబ్) రెండు వేయమనడం ఉపాధ్యాయులను మరింత ఆందోళనకు గురి చేస్తుందన్నారు. అన్ని పరికరాలు పనిచేసే విధంగా చూడవలసిన బాధ్యత అధికారులు తీసుకోవాలి. హాజరు శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చూపించడం కొరకు పనిచేయని పరికరాలు ఇచ్చి ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకు రావడం సరైనది కాదన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను పర్యవేక్షించమని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను నియమిం చడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేసారు. ఒక్కొక్క ప్రధానోపాధ్యాయునికి 5 నుండి 8 అంగన్‌వాడీ సెంటర్‌లను తనిఖీ చేసి ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయవలసి యున్నది. దీని వలన ప్రధానోపాధ్యా యులు తమ పాఠశాలలకు దూరం అవుతున్నారు. ఉపాధ్యాయుల ఫోటోలు పాఠశాలల వద్ద ప్రదర్శించమని ఆదేశాలు ఇవ్వడం సరికాదని ఆ ఉత్తర్వులును ఉపసం హరించుకోవాలని జెఏసి డిమాండ్ చేసింది. మధ్యాహ్న భోజన పథకంలో సరఫరా చేసే కోడిగుడ్లు పాఠశాలలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

10వ పిఆర్‌సి, డిఏ అరియర్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లిం చాలని, 11వ పిఆర్‌సి కమీషన్‌ను వెంటనే నియమిం చాలని జిల్లా టీచర్స్ జెఏసి సమావేశం డిమాండ్ చేసింది.

ఈ సమావేశంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. జయకర్, బి.గోపీమూర్తి, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

**బయోమెట్రిక్‌తో వేతనాలు ముడ్డిపెట్టటం సరికాదు**

ఉపాధ్యాయుల హాజరులో బయోమెట్రిక్ యంత్రాల్లో లోపాలతో సతమతం అవుతున్నారని, లోపాలు సరిచేయకుండా వేతనాలు బయోమెట్రిక్ హాజరుతో ముడిపెట్టటం సరికాదని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారుల దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్తున్నారని, ప్రసార మాధ్యమాల్లోనూ ఆధారాలతో సహా ప్రచురణ అవుతున్నాయని, కానీ ప్రభుత్వం సరిచేయక పోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన యంత్రాలు అత్యంత నాసిరకంగా ఉండటం, సర్వర్ పనిచేయక పోవటం, సిగ్నిల్ లేక పోవటం, కొన్ని ప్రాంతాల్లో సిమ్ పనిచేయక పోవటం, సాఫ్ట్‌వేర్ సిస్టమే సరిగా లేకపోవటం సమస్యలకు మూలంగా ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయులు ఎంత ముందుగా పాఠశాలకు వెళ్లినా హాజరు నమోదు కాకపోవటంతో హాజరు నమోదు అయ్యేవరకూ అదే ఆలోచనతో సతమతం అవుతున్నారని, బోధనై దృష్టి సారించలేకపోతున్నారని వివరించారు. మరోవైపు స్వచ్ఛ విద్యాలయ శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్‌కు 'మీరు ఈ రోజు బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసుకోలేదని, నమోదు చేసుకోండి' అంటూ మెస్సేజ్‌లు వస్తున్నాయని, దీంతో ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరిం చాలని, వేతనాలతో ముడిపెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు.

**కడప జిల్లా**

## బయోమెట్రిక్ హాజరుతో జీతాల నిలుపుదలను అంగీకరించం




యుటియఫ్ జిల్లా శాఖ ఇంజినీర్స్ హాల్ కడపలో జరిగిన విలేఖరుల సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.విజయ్ కుమార్ ఎస్‌వి సుబ్బరాజు, సహాధ్యక్షురాలు రూత్ ఆరోగ్యమేరి పాల్గొన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థులకు బయోమెట్రిక్ విధానం ఆఘమేఘాల మీద ప్రవేశపెట్టారు. అయితే ఈ బయోమెట్రిక్ యంత్రాలు సిగ్నల్స్ లేక, నెట్‌వర్క్ అందక పని చేయడం లేదన్నారు. విద్యా శాఖలో బయోమెట్రిక్ ప్రయోగాత్మకంగా జిల్లాలో కొన్ని పాఠశాలల్లో అమలుచేసి పిదప రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలుచేసి ఉంటే బాగుండేదన్నారు. బయోమెట్రిక్ పరికరాల లోపాల వలన ఉపాధ్యాయుల హాజరు తీసుకొని జీతాలు ఇవ్వ మనటం దుర్మార్గమైన చర్య అన్నారు. అలాంటి విధానాన్ని వ్యతిరేకి స్తామన్నారు.

10వ పిఆర్‌సి అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి వున్న డిఏ అరియర్స్ ఇవ్వాలన్నారు. 11వ పిఆర్‌సి కమిటీని నియమించాలన్నారు. రూ.398/–తో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతి పేరుతో ఆగిపోయిన జిల్లా విద్యాశాఖాధికారుల పోస్టులు కౌన్సిలింగ్ ద్వారా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2008 డిఎస్‌సి హామీ పత్రాల ఉపాధ్యాయులకు 2010 పిఆర్‌సి రివైజ్డ్ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సిపిఎస్ విధానం రద్దు చేసే వరకు దశల పోరాటాల ఉద్యమాలు నిర్మిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులను సిపిఎస్ విధానం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. 2017 బదిలీలలో రిలీవ్‌కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. 2 నెలలుగా జీతాలు అందని డిఇఓ పూల్ ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### బయోమెట్రిక్‌తో ముడిపెట్టడం తగదు

**బద్వేలు :** బయోమెట్రిక్ హాజరుతో ముడిపెట్టి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా పేర్కొన్నారు. బద్వేల్ పట్టణంలోని స్థానిక ఎంఆర్‌సిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పనిచేయని బయోమెట్రిక్ యంత్రాలను ఉపాధ్యా యులకు అందజేసి వాటి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని చెప్పడం ఉపాధ్యాయులను వేధించడమేనని ఆయన చెప్పారు. గతంలో కాలయాపన ద్వారా ఒక పిఆర్‌సిని నష్టపోయామని ఆయన గుర్తుచేశారు. జిల్లాలో దాదాపు 300 మంది ఉపాధ్యాయులు డిఇఓ పూల్‌లో కొనసాగుతున్నారని వీరిలో కొంతమంది 3 మాసాలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు.

డిఇఓ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించడంలో జిల్లా విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యాన్ని కనపరుస్తున్నారని ఆయన విమర్శించారు. సిపియస్ రద్దు చేసేంత వరకూ తమ పోరాటం ఆగదన్నారు. ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులను చేపట్టాలని కోరారు.

యుటిఎఫ్ జిల్లా మహాసభలను నవంబర్ 19న బద్వేలు పట్టణంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ మహాసభలకు ఎమ్మెల్సీలను, విద్యావేత్తలను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్ర నాయకులు పాల్గొంటారని ఉపాధ్యాయులు వీటిని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, యస్‌వి.సుబ్బరాజు, బద్వేలు మండల అధ్యక్షులు శశిధర్, గోపవరం అధ్యక్ష కార్యదర్శులు వీరదాసరి క్రిష్టఫర్, కంచిరెడ్డి, నాయకులు సుభాష్‌చంద్రారెడ్డి, యల్లారెడ్డి పాల్గన్నారు.

**కర్నూలు జిల్లా**

## బయోమెట్రిక్ మిషన్ల లోపాలను సవరించాలి




**ఎమ్మిగనూర్ :** రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన బయోమెట్రిక్ మిషన్లలోని సాఫ్ట్‌వేర్‌లో అనేక లోపాలు వున్నాయని వీటిని సరిచేసి పాఠశాలలకు పంపిణీ చేయాలని యుటియఫ్ జిల్లాకార్యదర్శి టి.యల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో అక్టోబర్ 17న ఏర్పాటు చేసిన సమావేశంలో యల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యతలేని బయో మెట్రిక్ మిషన్లు పంపిణీ చేయడం వల్ల అవి ఎక్కడా పనిచేయడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సిగ్నల్ అందక ఉపాధ్యా యులు బయోమెట్రిక్ హాజరు వేయలేకపోతున్నారని అన్నారు.

ఒకవైపు నాణ్యతలేని, సర్వర్ పనిచేయకపోగా, యంత్రాలను ఇచ్చి మరోవైపు బయోమెట్రిక్ హాజరు వుంటనే వేతనాలు చెల్లిస్తామని ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆందోళనలకు గురిచేస్తున్నారు. నాణ్యత లేని మిషన్లు ఇచ్చి వేతనాలు కట్ చేస్తామంటే ఉపాధ్యాయులు ఉద్యమించక తప్పదన్నారు. ఈ సమావేశంలో ఎం.రాజు, వేణు గోపాల్, భద్రయ్య, కౌలన్న, రాజశేఖర్, జ్ఞానప్రకాష్, యు.రాజు, భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

## నాసిరకం బయోమెట్రిక్‌తో భయపెట్టడం సరికాదు

నాసిరకం బయోమెట్రిక్ పరికరంతో ఉపాధ్యాయులను భయ పెట్టడం సరికాదని యుటియఫ్ నాయకులు మండిపడ్డారు. అక్టోబర్ 21న జిల్లా కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్, జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్, ప్రధానకార్యదర్శి రమణయ్య, నాయకులు కోటేశ్వరప్ప, శేషప్ప, గోపాల్, శ్రీరాములు, బాషా, రఘు రామయ్య సమావేశమయ్యారు. బయోమెట్రిక్ విషయంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై నిరసన తెలిపారు. జిలాన్ మాట్లాడుతూ పరికరాలు ఇచ్చి ఏడాది కావస్తున్నా... ఎక్కడా సరిగా పనిచేయడం లేదన్నారు. ఈ హాజరు తప్పనిసరి అనీ, లేదంటే చర్యలు అంటూ సిఎం స్థాయి నుంచి ఎంఇఓ స్థాయి వరకూ టీచర్లను భయభ్రాంతు లకు గురి చేస్తున్నారన్నారు. దీంతో ఉపాధ్యాయులు మానసిక వేదనకు లోనవుతున్నారన్నారు. ఈ హాజరు సాకుతో అధికారుల బెదిరింపులు ఆపాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya1975@gmail.com

**ప్రశ్న : నేను 31.08.2006న పదవీ విరమణ చేశాను. నా సర్వీస్ రిజిష్టర్‌లో 179 రోజులు సంపాదిత సెలవు వుండగా జిఓ నం.515; తేది.25.04.1998 ప్రకారం డిఇఓ కార్యాలయం వారు 90 రోజులకు మాత్రమే నగదుగా మార్చుకొనుటకు అనుమతించారు. జిఓ 154; తేది.04.05.2010 నాకు వర్తిస్తుందా?**

**-శాంతయ్య, రాయవరం**

**జవాబు :** వర్తించదు. జిఓ 154, తేది.04.05.2010 నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి మాత్రమే వర్తిస్తుంది.

**ప్రశ్న : నేను ఎస్‌జిటిగా పనిచేస్తున్నాను. సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయించుకోకపోతే సర్వీస్‌పరంగా జరిగే నష్టం ఏమిటి?**

**- చెల్లూరి వెంకటరెడ్డి, నాగులపల్లి, తూ॥గో॥**

**జవాబు:** సాధారణంగా ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ఆర్థికంగాగాని సర్వీస్‌పరంగాగాని ఆటంకంగా లేదు.

**ప్రశ్న : నేను మున్సిపాలిటీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఇఓ,జిఓ టెస్ట్ ఎవరు పాస్‌కావాలి?**

**- బి.కె.నాయుడు, నెల్లూరు**

**జవాబు:** మున్సిపల్ సర్వీస్‌రూల్స్ జిఓ వచ్చిన తేది.07.12.2016 నాటికి హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్ పాస్ అయి ఉంటే 3 సం॥ల వరకు ఇఓ,జిఓ పాస్‌కానవసరం లేదు. తదుపరి స్కూల్ అసిస్టెంట్ (ప్రమోషన్) 12 సం॥ల స్కేలు వరకు, ఎస్‌జిటి 24 సం॥ల స్కేలు కొరకు ఇఓ, జిఓ పాస్‌కావాలి.

**ప్రశ్న : నేను స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 24 సం॥ల సర్వీస్ పూర్తి చేశాను. నేను హెచ్‌ఎం పదోన్నతి రిలింక్విష్ చేయలేదు. నేను 24 సం॥ల స్కేలు పొందవచ్చునా?**

**- సాహిత్ , ఇ-మెయిల్**

**జవాబు:** డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పాసై అయివుంటే పొందవచ్చు.

**ప్రశ్న : నా జీతంనుండి ఏపిజిఎల్ఐ ప్రీమియంగా 850/-లు మినహాయింపు జరుగుతోంది. కాని బాండ్ 650/-లకు మాత్రమే వచ్చింది. పరిష్కారం తెలుపగలరు?**

**జవాబు:** మీ డ్రాయింగ్ అధికారి ద్వారా మీ జిల్లా బీమా కార్యాలయానికి సంబంధిత షెడ్యూల్‌తో దరఖాస్తు చేయండి.

**ప్రశ్న : ఒక స్కూల్ అసిస్టెంట్ డిగ్రీలో సెకండ్ లాంగ్వేజ్ తెలుగు, ఇంటర్‌లో సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం చదివాను. హెచ్‌ఎం పదోన్నతికి లాంగ్వేజ్ టెస్ట్ పాస్ కావాలా.**

**- ఎమ్.దుర్గాశ్రీనివాసరావు, కావూరు, గుంటూరు జిల్లా**

**జవాబు:** అవసరం లేదు. తాత్కాలిక సర్వీస్‌రూల్స్ ఉత్తర్వులు జిఓ ఎంఎస్ నం.10; తేది.23.01.2009 నందు ii. Where a test is prescribed of a language of higher standard a person shall be exempted from passing the test if he/she has passed the language as a subject in intermediate examination or its equivalent or higher degree అని ఉన్నది గమనించగలరు.

**ప్రశ్న : నేను ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేయుచున్నాను. 12 సం॥ల సర్వీసు పూర్తి అయినది. నేను ఇంటర్, టిటిసి అర్హతలు కలిగియున్నాను. ఇఓ, జిఓ పాస్ అయితే 12 సం॥ల స్కేలు వస్తుందా?**

**- కె.శ్రీరామమూర్తి, జగ్గయ్యపేట**

**జవాబు:** రాదు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం 12 సం॥ల స్కేలు అనగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని స్కేలు. ఆ స్కేలు పొందాలంటే డిగ్రీ, బిఇడీ తప్పనిసరి.

**ప్రశ్న : 24 సం॥ స్కేలు పొందిన తర్వాత పదోన్నతి పొందితే ఎఫ్ఆర్ 22ఎ(1) ప్రకారం వేతన స్థిరీకరణ చేశారు. ఎఫ్ఆర్ 2ఎల్ (బి) వర్తించదని అంటున్నారు. వాస్తవమేనా?**

**- పి.శ్రీవాణి, నెల్లూరు**

**జవాబు:** అవును. 24 సం॥లు స్కేలు పొంది పదోన్నతి పొందితే ఎఫ్ఆర్ 22ఎ(1) ప్రకారమే వేతన స్థిరీకరణ జరుగుతుంది. ఎఫ్ఆర్ 22(బి) వర్తించదు.

**ప్రశ్న : చైల్డ్‌కేర్ లీవు సంవత్సరంలో 20 రోజులు వాడుకోవాలని అంతకుమించి వాడుకోకూడదని అంటున్నారు వాస్తవమేనా?**

**- పి.మీనాకుమారి,కర్నూలు**

**జవాబు:** వాస్తవంకాదు. జిఓ నం.132 ఆర్థిక; తేది.06.07.2016నందు మూడుసార్లు తక్కువకాకుండా వాడుకోవాలని మాత్రమే ఉన్నది.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# కార్యవర్గ సమావేశాలు

**శ్రీకాకుళం జిల్లా**

**యుటియఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి**



డిసెంబర్ 9,10,11 తేదీలలో మొట్టమొదటిసారిగా ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం జిల్లాలో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) 15వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ఉపా ధ్యాయులకు పిలుపునిచ్చారు.

అక్టోబర్ 8న శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాబురెడ్డి ప్రసంగిస్తూ సిపిఎస్ రద్దు డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 10వ పిఆర్‌సి బకాయిలు, 2 విడతల డిఏలను చెల్లించాలని, 11వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధించబడిన నేపథ్యంలో ఎంఇఒ, డిప్యూఇఒ, హెచ్‌ఎం తదితర పోస్టులతోబాటు జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు ప్రమోషన్లు కల్పించాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్, 2008 హామీ పత్రాల టీచర్లకు పిఆర్‌సిలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమం తీవ్రతరం కాకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని బాబురెడ్డి డిమాండ్ చేశారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు సమావేశంనకు అధ్యక్షత వహించారు. సిపిఎస్ కరపత్రాన్ని సమావేశంలో విడుదల చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకై, విద్యావికాస ఉద్యమాన్ని విజయ వంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యంచేసే ఏపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్-2017 (స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం)ను వ్యతిరేకించాలని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు.

జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ నవంబర్ 19న శ్రీకాకుళం నగరంలో నిర్మించిన యుటియఫ్ భవనాన్ని ప్రారంభించుకొని అదేరోజు జిల్లా మహాసభలను నిర్వహించుకుందా మని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముందుగా సంతాప తీర్మానాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుప్పిలి కామేశ్వరరావు ప్రవేశపెడుతూ మతోన్మాధుల చేత హత్యకు గురైన గౌరీ లంకేష్‌కు, ఇటీవల మరణించిన సీనియర్ నాయకులు జి.రామయ్య మరియు తారమ్మలకు సంతాపం ప్రకటించారు. జిల్లా కోశాధికారి పి.అప్పారావు ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు.

కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎస్.కిశోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి, జిల్లా కార్యదర్శులు ఆరిక భాస్కరరావు, డి.ప్రకాశరావు, వై.ఉమాశంకర్, ఎల్.బాబూరావు, జె. చినబాబు, ఆర్.సుశీల, హెచ్.అన్నాజీరావు, కె.చంద్రరావు, జి.కోదండరావు, ఎస్.మహేష్, జిల్లా మహిళా టీచర్ల ఫోరం కన్వీనర్ బి.ధనలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల / పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చర్చలలో పాల్గొన్నారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

**విద్యా వ్యాపారంచేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలి**

**తాడేపల్లిగూడెం :** యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం అక్టోబర్ 8న తాడేపల్లిగూడెంలోని ఎన్.జి.వో హోమ్ నందు జిల్లా అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ హాజరయ్యి మాట్లాడుతూ 2004 తరువాత నియమింపబడిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ (కంట్రిబ్యూటరీ పెన్షన్) రద్దు కోసం ఫ్యాప్టో తరపున దశలవారీ పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు. నవంబరు లో ఎం.ఎల్.ఏ నియోజక వర్గ కేంద్రాలలో ధర్నాలు, అసెంబ్లీ జరిగే సమయంలో ఛలో అసెంబ్లీ చేపడతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరిచే విధంగా స్వయం పోషక పాఠశాలల చట్టం-2017 ముసాయిదాను విడుదల చేసిందని, ప్రైవేటు పాఠశాలలు యధేచ్ఛగా విద్యా వ్యాపారం నిర్వహించుకునే విధంగా ఫీజులు నిర్ణయం, నిర్వహణ విషయంలో ప్రభుత్వానికి నియంత్రణ లేకుండా ఉందన్నారు.

రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయప్రభ మాట్లాడుతూ యుటియఫ్ మండల/పట్టణ మహాసభలు అక్టోబర్ 31లోపు పూర్తి చేయాలన్నారు. మహాసభలలో మహిళా టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు చేయాలన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి మాట్లాడుతూ నవంబరు 10, 11 తేదీలలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.రామకృష్ణ, జిల్లా సహాధ్యక్షులు సిహెచ్.జగన్మోహనరావు, బి.సుబాషిణి, కోశాధికారి వి.కనక దుర్గ, జిల్లా నాయకులు పి.వి నరసింహరావు, ఎకెవి రామభద్రం, ఎం.వి.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సదస్సులు - సమావేశాలు

## శ్రీకాకుళం జిల్లా

### ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

**రాజాం:** ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని, వాటిని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే 'ఏపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ చట్టం-2017' వ్యతిరేకించాలని రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ఉపాధ్యాయులకు, విద్యాభిమానులకు పిలుపునిచ్చారు.

అక్టోబర్ 12న రాజాం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 'విద్యా వికాస వేదిక' రాజాం డివిజన్ సమావేశం పి.వాసు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో గిరిధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాల్లో సర్వేలు నిర్వహించాలని, విద్యాలయాల మౌలిక సౌకర్యాల కల్పనకోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖాధికారులకు వినతి పత్రాలు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం ప్రజాఉద్యమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో రాజాం, సంతకవిటి, రేగడి, వంగర మండల శాఖల నాయకులు పి.వాసు, డి.భాస్కరరావు, పాలవలస సురేష్ కుమార్, డోల కృష్ణారావు, ఎ.శంకరప్రసాద్, ఎ.శివరాంనాయుడు, ఏసోబు, కిశోర్, జె.నీలయ్య, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 19న యుటియఫ్ జిల్లా మహాసభలను, డిసెంబర్ 9,10,11 తేదీలలో శ్రీకాకుళంలో జరుగనున్న యుటియఫ్ రాష్ట్ర 15వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విజయనగరం జిల్లా

### ఉపాధ్యాయులకు ఇబ్బందులు తగదు

**నెల్లిమర్ల :** బోధనేతర అంశాలతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ తెలిపారు. యుటిఎఫ్ నాయకులతో సమావేశాన్ని శనివారం స్థానిక ఎంఆర్‌పి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేతులు కడగడం, మరుగుదొడ్ల నిర్మాణం, వాటి నిర్వహణపై ఫొటోలు తీసి ఆన్‌లైన్లో పంపించడం వంటి బోధనేతర అంశాలను ఉపాధ్యాయులపై రుద్దడం దారుణమన్నారు. బయో మెట్రిక్‌లో ఉపాధ్యాయులు హాజరు నమోదు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బోధన, అభ్యసన మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.రామారావు, పి.త్రినాద్, కార్యవర్గ సభ్యులు సంజీవరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

## విశాఖపట్నం జిల్లా

### 'కార్పొరేట్'తో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

**దేవరాపల్లి :** కార్పొరేట్ విద్యా రంగంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము పేర్కొన్నారు. విశాఖ జిల్లా దేవరాపల్లి మండలంలోని ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి, ఎం.అలమండ, కాశీపురం, పెదనందిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అక్టోబర్ 11న ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థల కారణంగా రానున్న కాలంలో ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ-హాజరుతో విద్యార్థులకు నష్టంతప్ప లాభం ఉండదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



మోడల్‌స్కూళ్లలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం అన్యాయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా లేవని, ఉన్నచోట నిర్వహణ కొరవడిందని విమర్శించారు. స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని అన్నారు. దీనిపై ఉపాధ్యాయులు పెద్దఎత్తున పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్ రామకొండలరావు, మండల అధ్యక్షులు ఆర్ ఎర్రయ్యదొర, కార్యదర్శి జి.శ్రీను, జిల్లా కౌన్సిలర్ ఎం శేఖర్, ప్రకాష్, మధు, రమణమూర్తి, డేవిడ్, నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా

### మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ మెరిట్ కమ్ రోస్టర్ విడుదల చేయాలి



మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టుట కోసం మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు మెరిట్ ప్రాతిపదికన కాకుండా మెరిట్ కం రోస్టర్‌లో రూపొందించి విడుదల చేయాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సదస్సు జిల్లా శాఖ అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పి.బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిఓ నం.40 ప్రకారం స్కూల్ ఎడ్యుకేషన్‌లో ప్రధానోపాధ్యాయులకు ఉన్న అన్ని అధికారాలు డ్రాయింగ్ పవర్‌తో సహా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీలో లాంగ్వేజ్ పండిట్ పోస్టులు, పిఇటిలను స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేసినందున ప్రస్తుత ప్రమోషన్ షెడ్యూల్‌లో చేర్చి అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల లో జనాభా పెరిగినందున జనాభా నిష్పత్తికి అనుగుణంగా నూతన పాఠశాలలు నెలకొల్పాలని, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న భార్యా భర్తలైన ఉపాధ్యాయులకు అంతరజిల్లా మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని అన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంకోసం మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో చర్చిస్తామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీస్‌రూల్స్ పరిధిలో చేర్చా లన్నారు. కార్పొరేషన్‌లో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పోస్టులు, మున్సిపాలిటీలల్లో పట్టణ విద్యాశాఖాధికారి పోస్టులను మంజూరు చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.

సదస్సులో యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసన్ మాట్లాడారు. ఏలూరు పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వి.అప్పారావు, జి.సాయిశ్రీనివాస్, వివిధ మున్సిపాలిటీల నాయకులు కర్నెలు, ఎస్‌కె ఆలిషా, సిహెచ్ సత్యనారాయణ, వై.యేసుబాబు, కె.రాజశేఖర్, రవితేజ, విల్సన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరు



**పాలకొల్లు రూరల్ :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిత్యం యుటియఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బొర్రా గోపిమూర్తి అన్నారు. అక్టోబర్ 12న పాలకొల్లు పట్టణ, మండలాల్లో జరుగుతున్న సమాఖ్య సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గతంలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యంగా సిపిఎస్ పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎంతోకాలంగా అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు పెద్దఎత్తున పోరాటాలు చేస్తున్న ప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదని ఆరోపించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గోపిమూర్తి హెచ్చరించారు.

పిఆర్‌సి బకాయిలు, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పోరాటాలు చేస్తున్న యుటియఫ్‌లో ఉపాధ్యాయు లందరూ సభ్యులుగా చేరి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తే మరిన్ని ఉద్యమాలు చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసన్, జిల్లా కార్యదర్శి ఏకెవి రామభద్రం, పట్టనశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డి.ఏసుబాబు, పి.రాజశేఖర్, కె.సత్యనారాయణ, జెజె దుర్గారావు, డి.రాజ్‌కుమార్, పి.మురళీకృష్ణ, కె.రాయపరాజు తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణా జిల్లా

## ఒత్తిడి వల్లే విద్యార్థుల ఆత్మహత్యలు



**తిరువూరు :** విద్యార్థులు చదివే చదువులలో ఒత్తిడి, చదువుకు చేసే ఉద్యోగానికి పొంతన లేకపోవడం వలనే ఎక్కువగా 15 నుండి 29 సం॥లోపు మధ్య వయస్కులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్ పేర్కొన్నారు. అక్టోబర్ 18న జరిగిన సోషల్ మీడియా ఫర్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో "విద్యార్థుల ఆత్మహత్యలు - నివారణా మార్గాలు" అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో మనోహర్ పాల్గొని ప్రసంగించారు. నిరుద్యోగం, ఒంటరితనం, అనారోగ్యకర పోటీ తదితర కారణాలవల్ల విద్యార్థులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

ఒక నిర్దేశిత లక్ష్యంతో విద్యార్థులు ఆత్మనూన్యతకు లోనవ్వకుండా చదువులు కొనసాగించాలని ఆయన కోరారు. జీవితంలో ఏదో సాధించాలనే తపనతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అలానే పాలకులు యువతకు శాశ్వత ఉపాధి కల్పించే వృత్తి నైపుణ్యాలను పెంచే కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. ఎస్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్.గంగాధర్, జెవివి ప్రధానకార్యదర్శి ఎం.హరికృష్ణలు మాట్లాడుతూ మూఢవిశ్వాసాలు కూడా వ్యక్తుల్ని ఆత్మహత్యలకు ప్రేరేపిస్తాయని, విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ఆంగ్లం, వర్తమాన విషయాలపై అవగాహన పెంచు కొని ఉద్యోగాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంఎస్ డివిజన్ కన్వీనర్ ఎం.రాంప్రదీప్, కళాశాల ఇన్‌చార్జ్ వేణుగోపాల రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గుంటూరు జిల్లా

## మున్సిపాలిటీలలో అవసరమైన చోట నూతన పాఠశాలలను స్థాపించాలి



మున్సిపాలిటీలలో అవసరమైన చోట నూతన పాఠశాలలను స్థాపించి, అదనపు పోస్టులను మంజూరు చేయాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి డిమాండ్ చేశారు. యుటియఫ్ గుంటూరు జిల్లా మున్సిపల్ ఉపాధ్యాయుల సదస్సు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన యుటియఫ్ కార్యాలయం గుంటూరులో జరిగింది. ఈ సందర్భంగా పి.బాబురెడ్డి

మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో వున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పోరాటం చేయడం ద్వారానే సాధ్యమైనదని, భవిష్యత్‌లో పోరాటం చేయడం ద్వారానే ఇప్పుడున్న సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రేషనలైజేషన్ తరువాత పాఠశాలల్లో ఖాళీలుగా వున్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం ప్రమోషన్స్‌కోసం లిస్టులు తయారవుతున్నాయని పార దర్శకంగా లిస్టులు తయారీకి కార్యకర్తలు అప్రమత్తంగా వుండాలని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ పద్ధతులు అమలు కోసం చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగం కార్పొరేటీకరణ అవుతున్న దశలో మున్సిపల్ పాఠశాలలను ఇబ్బంది పెట్టే ప్రయోగాలను పోరాటం ద్వారా తిప్పికొట్టాలని తెలిపారు. రేషనలైజేషన్ తరువాత మున్సిపాలిటీలలో నూతన పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విషయాలకు భిన్నంగా విద్య బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటుందని విమర్శించారు. భవిష్యత్‌లో పిపిపి పద్ధతిలో విద్యను నిర్వహించబోతుందని తెలిపారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటియఫ్ ముందు బాగాన వుందని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో 10/10 గ్రేడ్ రావాలని అధికారులు వత్తిడి చేయడం తగదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎండి గౌస్, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, యుటియఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఎం.కళాధర్, జి.శివపూర్ణయ్య, అహ్మద్‌హుస్సేన్, కొండపల్లి వెంకటేశ్వరరావు, స్వామి, కోటిరెడ్డి, రాము, అరుణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మహిళలు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయక తప్పదని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. 'మహిళా ఉద్యమాలు ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై యుటియఫ్ కార్యాలయంలో అక్టోబర్ 22న నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ఈ నేపథ్యంలో ఒత్తిడి, వేధింపులు మొదలయ్యా యన్నారు. మహిళా హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవా లన్నారు.

ఉమెన్స్ టీచర్ ఫోరమ్ కన్వీనర్ సిమెచ్. పద్మావతి మాట్లాడుతూ ఒకవైపు స్వచ్ఛ విద్యాలయ, బాలికల ఆరోగ్యం గురించి ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం శానిటరీ నాప్‌కిన్స్‌పై 4శాతం జీఎస్‌టి విధించడం శోచనీయమన్నారు. మహిళా ఉపాధ్యాయులకు రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు సంఘం నాయకులు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


**అచ్చంపేట :**



అక్టోబర్ 14న అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ ముప్పాళ్ళ, రాజుపాలెం, పెదకూరపాడు, సత్తెనపల్లి మండలాల "ప్రాంతీయ సమావేశం" జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్తెనపల్లిలో నిర్వహించ బడినది. ఈ సమావేశానికి యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఆది నారాయణ అధ్యక్షత వహించగా, పరిశీలకులుగా విచ్చేసిన గుంటూరు జిల్లా యుటియఫ్ అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెద్ద శాపంగా మారిందని, రద్దు అయ్యేంతవరకు అవిశ్రాంతంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.నాగకుసుమ కుమారి మాట్లాడు తూ అక్టోబర్ 22న నిర్వహించే "మహిళా ఉద్యమ తరగతు"లను జయప్రదం చేయవల్సిందిగా పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బి.నరసింహారెడ్డి, ప్రాంతీయ మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొని ప్రసంగించారు.

## సిపిఎస్ రద్దు చేయాలి



**మాచర్ల :** స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాల యుటియఫ్ ప్రాంతీ సమావేశం నవంబర్ 1న మాచర్ల శాఖ అధ్యక్షులు ఎ.నాసర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన పట్టభద్రుల ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడు సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ) రద్దయి పాత పెన్షన్ విధాన రావాలంటే అన్ని సంఘాలు ఏకతాటిపై ఒకే ఎజెండాతో ఉద్యమాలు, పోరాటం ద్వారానే సాధించుకోవచ్చనీ, దీనికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు, సిసిఇ విధానంలో ఎదురవుతున్న సమస్యలను, ప్రభుత్వం విద్యపై చూపుతున్న విపరీత ధోరణులను ఎండకట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ గాలిబ్‌సాహెబ్, రాష్ట్ర కౌన్సిలర్లు ఆర్.సాల్మన్‌రాజా, పి.పట్టాభిరామారావు, జిల్లా ఆడిట్ మెంబర్ జెవిడి నాయక్, 3 మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.శ్రీనివాసరావు, విజె ఫ్రాంక్లిన్, వై.ఏడుకొండలు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, బాలనాగమ్మ బాయి, ఆయేషా, పద్మ, శైలజ, వాణి తదితరు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా

### విద్య విజ్ఞానాన్ని పెంచాలి సామాజిక వికాసాన్ని పంచాలి



విద్య విజ్ఞానాన్ని పెంచాలి - సామాజిక వికాసాన్ని అందించాలి. కానీ దీనికి వ్యతిరేకంగా నేటి విద్యా విధానము ఉందని అక్టోబర్ 21న విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో తిరుపతి యుటియఫ్ భవనంలో జరిగిన ''రౌండ్ టేబుల్'' సమావేశంలో ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 'ఇంటర్ విద్య' మన రాష్ట్రంలో ప్రత్యేకంగా ఉందని, ఈ పరిస్థితిని కార్పొరేట్ కాలేజీలు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించు కొంటున్నాయని తెలియజేశారు. నేటి కార్పొరేట్ విద్యా సంస్థలు అవాంఛనీయ పోటీతో నిబంధనలకు తిలోదకాలిచ్చి తమ పేరు ప్రతిష్టలు పెంచుకోవడానికి విద్యార్థులపై వత్తిడి పెంచి విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడానికి దోహదపడుతున్నాయని అన్నారు.

ఇంజనీరింగ్ విద్య, వైద్య విద్య పైనే తల్లిదండ్రులు ఎక్కువ మక్కువ చూపుతున్నారని తెలియజేశారు. ఈ మనస్తత్వాన్ని కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగించు కుంటున్నదని, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి అన్నారు. ప్రభుత్వమే కార్పొరేట్ విద్యా సంస్థలను స్వాధీనపరచుకొని నిర్వహించాలని ప్రజా సంఘాల నేత నాగరాజు డిమాండ్ చేశారు. ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ రాజారామ్ మాట్లాడుతూ తల్లిదండ్రు లలో ఆలోచన విధానం మారాలని తమ బిడ్డలపై ర్యాంకులకు సంబంధించి వత్తిడి తీసుకొన రాదని తల్లిదండ్రులు ఓపికగా వినాలని తెలియజేశారు.

ఈ సమావేశం యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు దేవరాల నిర్మల అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్‌టియు నాయకులు జి.నాగేశ్వర రావు, పి.రేణుకాదేవి, జెవివి నాయకులు షామిర్‌భాషా, ఏపిటిఎఫ్ నాయకులు వెంకటముని, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాజారాం, సిఐటియు నాయకులు నాగరాజు, రమణ, యుటియఫ్ నాయకులు కె.ముత్యాలరెడ్డి, సురేష్, ఎం.జనార్ధన్ రెడ్డి, బండి మధుసూధన్‌రెడ్డి, పట్టాభి, డివైఎఫ్ఐ నాయకులు సహజ, యుటియఫ్ పట్టణ అధ్యక్షులు మునిరామయ్య, గుణశేఖర్‌రెడ్డి, ఎన్. మోహన్, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల నెలవారీ ప్రమోషన్లు ఇవ్వాలి



**తిరుపతి :** జిల్లాలోని ఉపాధ్యాయులకు నెలవారీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు డి.నిర్మల డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.ముత్యాలరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ కన్వీనర్ ఇ.చిన్నస్వామి మాట్లాడుతూ అర్ధజీతపు సెలవు నగదుగా మార్చుకొనే ఉత్తర్వులు విడుదల చేసిన రోజు నుండి కాకుండా రద్దుచేసిన రోజు నుండి అమలు చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కోశాధికారి ఎం.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ స్కూల్స్‌లో పండిట్ల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహిళా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన, శానిటరీ వర్కర్ల జీతం నెలల తరబడి చెల్లించలేదని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కౌన్సిలర్ కె.ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు కోడి గ్రుడ్లు పంపిణీచేసే ఏజెన్సీలు సకాలంలో పంపిణీ చేయడంలేదని, 2 లేదా 3 వారాలకు ఒకసారి, నాణ్యతలేని గుడ్లు పంపిణీ చేస్తు న్నారని, సక్రమంగా, సకాలంలో పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరుతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, రూరల్ ప్రాంతంలో సెల్ నెట్‌వర్క్‌లు సరిగాలేవని, కొన్ని చోట్ల పరికారాలు పనిచేయడం లేదని, జీతాలు ఇ-హాజరుతో ఇవ్వాలనడం సరికాదని తెలిపారు. ఈ సమావేశంలో నాగేశ్వర నాయుడు, పట్టాభి, ఆనంద్, మోహన్, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లా

### విద్యాశాఖలో వింత ప్రయోగాలు ఆపాలి



యుటియఫ్ ప్రాంతీయ మండలాల సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయుల నియామకం ప్రభుత్వం చేస్తున్నది. అయితే ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం పలు ఆటంకాలు కల్పిస్తున్నదన్నారు. అందులో బయోమెట్రిక్ విధానం, మార్కుల గ్రేడింగు, మధ్యాహ్న భోజనం ఆప్‌లో నమోదు చేయడం, స్వచ్ఛ విద్యాలయ పథకము నమోదు, పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రపరుచుట, పాఠశాలకు సంబంధించిన ప్రాంతములోని నివాసాలలో మరుగు దొడ్లు లేని వారి వివరాలు సేకరించడం పనులు చేయడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఇలాంటి బోధనేతర పనులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వి.సుబ్బరాజు, జిల్లా కార్యదర్శులు పి.మహేష్‌బాబు, కె.గంగన్న, ఆడిట్ కన్వీనర్ వై.మస్తానయ్య, ఖాజీపేట, పెండిమర్రి, సి.కె.దిన్ని మండలాల నాయకులు సుబ్బారెడ్డి, జి.వి.సుబ్బయ్య, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

### 11వ పిఆర్‌సి కమీషన్‌ను ఏర్పాటు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 10వ పిఆర్‌సి గడువు జూన్ 2018తో ముగుస్తున్నందున వెంటనే 11వ పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలని యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు, కార్యదర్శులు ఎన్.నాగమణి, జె.యల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఏర్పాటైన పిఆర్‌సి జాప్యం వల్ల 18 నెలలు నష్టపోయారన్నారు. ఈ పిఆర్‌సి (10వ) గడువు జూన్ 2018లో ముగిస్తుండగా, జులై 2018 నుండి నూతన పిఆర్‌సి అమల్లోకి రావాలి దాని కొరకు ముందుగా కమీషన్ ఏర్పాటు చేయాలన్నారు.

గత పిఆర్‌సిలో ఉద్యోగులకు రావలసిన 10 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నల్లారెడ్డి, దేవసాయి, లక్ష్మన్న, భద్రయ్య, పెద్దిరెడ్డి, నరసింహులు, జ్ఞానప్రకాష్, కె.నాగరాజు, అల్లు బకాస్, పాపయ్య, కౌలన్న, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులంతా ఉద్యమించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం" అమలులోకి తెస్తే ఉపాధ్యాయు లంతా ఉద్యమిస్తారని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.సురేష్‌కుమార్, డి.రామశేషయ్య అన్నారు. అక్టోబర్ 15న నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం"పై సదస్సును జిల్లా కార్యదర్శి హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాసేందుకు స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని తీసుకొస్తుందని ఆరోపించారు. పురపాలక పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి తెలుగు మాధ్యమాలకు ప్రాధాన్యతను తగ్గించేందుకు కుట్రలు పన్నుతున్నా రన్నారు. చట్టాన్ని అమలు చేస్తే ఫీజు నియంత్రణ ఉండదని, ఇక పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉండదన్నారు. ఇప్పటికే విచ్చల విడిగా కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా వెలిశాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహిస్తుందన్నారు.

ఇప్పటికైనా ఇలాంటి విధానాలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు కృష్ణమూర్తి, జయప్రద, జిల్లా నాయకులు రఫిక్, పట్టణ అధ్యక్షులు సునీల్ రాజ్‌కుమార్, మల్లి కార్జున, నాగేష్, పాపయ్యపాల్గొన్నారు.

### అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ 04.05.2010 నుండి అమలు చేయాలి



మండల, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయుల అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ వర్తింపజేస్తూ జిఓ 148, తేది.21.08.2017 ఇవ్వడమైనది. ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకొనే సౌకర్యం ఉత్తర్వులు విడుదలైన తేదీనుండే అమలు చేయాలనడం సమంజసం కాదని, ఈ ఉత్తర్వులు గతంలో నిలిపివేసిన తేదీ 04.05.2010 నుండి అమలు చేయాలని అక్టోబర్ 17న జరిగిన స్థానిక యుటియఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఎం.రాజు, వేణు గోపాల్, భద్రయ్య, కౌలన్న, రాజశేఖర్, జ్ఞానప్రకాష్, యు.రాజు, భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.

## యుటియఫ్ తరపున చెక్ పంపిణీ



**ప్రకాశం జిల్లా :** జిల్లాలోని దోర్నాల మండలంలో ఉపాధ్యాయు రాలుగా విధులు నిర్వహిస్తూ మరణించిన "పద్మజకుమారి" కుటుంబానికి కుటుంబ సంక్షేమ పథకం తరపున నవంబర్ 2న నిర్వహించిన సంతాప కార్యక్రమంలో మండల ఎంపిపి వేదాంత ప్రభాకర్ చేతుల మీదుగా 1.40 లక్షల రూపాయల చెక్‌ను వారి కుటుంబానికి అందించి అండగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఉపాధ్యా యుల సంక్షేమానికి యుటియఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహంతనాయక్, జిల్లా సహాధ్యక్షులు ఒ.వీరారెడ్డి, మండల అధ్యక్షులు రామకృష్ణనాయక్, కార్యదర్శి వర్ధన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# పట్టణ/మండల మహాసభలు

## శ్రీకాకుళం జిల్లా

### బయోమెట్రిక్ హాజరు పేరిట ఉపాధ్యాయులను వేధించొద్దు

**పోలాకి :** ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు నమోదుకై నెట్‌వర్క్ పనిచేయని, సర్వర్లు పనిచేయని, నాసిరకం బయోమెట్రిక్ మెషీన్లను పంపిణీ చేయడం వలన అవి సరిగా పనిచేయకపోవడంతో హాజరును జీతాలతో ముడిపెడతామని రాష్ట్ర విద్యాశాఖాధికారులు, జిల్లా, మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను మానసిక ఆందోళన గురి చేయడాన్ని యుటియఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు.

అక్టోబర్ 13న పోలాకి బోర్డు స్కూల్‌లో యుటియఫ్ మండలశాఖ అధ్యక్షులు టి.సుధీర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. మండల శాఖ ప్రధానకార్యదర్శి కె.సురేష్ కార్యదర్శి నివేదికను, రామకృష్ణ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. గౌరవాధ్యక్షులు దంత లక్ష్మణరావు, నాయకులు ఆర్.సింహాచలం, కృష్ణారావు, తిరుపతిరావు, కె.వెంకట రమణ, వెంకట్రావు, టి.శ్రీనివాసరావు, యుగంధర్, రమణరావు తదితరులు చర్చలలో పాల్గొన్నారు.

**నూతన కమిటీ :** గౌరవాధ్యక్షులు సింహాచలం, అధ్యక్షులు కె. వెంకటరమణ, సహాధ్యక్షులు కె.తిరుపతిరావు, కోటేశ్వరి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, కోశాధికారి రామకృష్ణ, కార్యదర్శులుగా వెంకటరావు, పి.ఉమాభాస్కర్, కెఎం యుగంధర్ సాహు, టి. రమణయ్య, కె.సూర్యనారాయణ, సిహెచ్.సంపత్‌కుమార్, వై.వి. రమణ, ప్రసాద్, ఎస్.లావణ్య, ఆర్.కృష్ణారావు, ఆడిట్ కన్వీనర్ దంత లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

### 15వ యుటియఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




**కోటబొమ్మాళి :** డిసెంబర్ 9,10,11 తేదీలలో ఉత్తరాంధ్రలో మొట్టమొదటిసారిగా శ్రీకాకుళంలో నిర్వహించబడుతున్న యుటియఫ్ 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కోటబొమ్మాళి మండలంలో మండల శాఖ అధ్యక్షులు వై.వాసుదేవరావు అధ్యక్షతన స్థానిక బిసి పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో మండలశాఖ గౌరవాధ్యక్షులు ఆర్‌పి పట్నాయక్ ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రను ఉపాధ్యాయులు బతకలేని బడి పంతులు స్థాయి నుండి బ్రతుకునేర్పిన బడి పంతులు స్థాయికి వచ్చిందంటే అది మన ఉపాధ్యాయ సంఘ నాయకులు కృషేనని వివరించారు. జిల్లా శాఖ సహాధ్యక్షులు మాట్లాడుతూ రూ.398/- లతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని బమ్మిడి శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్‌సి అరియర్స్ చెల్లించాలని, డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కోరాడ వైకుంఠరావు మాట్లాడుతూ 2008 డిఎస్‌సి వారికి న్యాయం చేయాలని, కొత్త పిఆర్‌సిని నియమించాలని కోరారు.

ఈ సమావేశంలో మండలశాఖ ప్రధానకార్యదర్శి జి.నారాయణ రావు, మండలస్థాయి నాయకులు కె.రామకృష్ణ, కె.అప్పన్న, కె.భాస్కరరావు, నక్కా రమేష్ నాయుడు, కె.భాస్కరరావు, ఆర్.రామ ప్రసాద్, యు.జగన్నాథం, సంతబొమ్మాళి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సంజీవరావు, బి.పాపారావు, సిహెచ్.వరప్రసాద్, పల్లివాను తదితరులతో సుమారు 40మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మండల శాఖ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించడమైనది. కోరాడ వైకుంఠరావు మరియు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామకృష్ణలను సన్మానించడమైనది.

**నూతన కమిటీ :** గౌరవాధ్యక్షులు ఆర్.ఆర్.పట్నాయక్, అధ్యక్షులు యర్నాగుల వాసుదేవరావు, సహాధ్యక్షులు కింజరాపు రామకృష్ణ, పి.లలితకుమారి, ప్రధానకార్యదర్శి గొండు నారాయణరావు, కోశాధికారి రొక్కం రామ్‌ప్రసాద్, కార్యదర్శులుగా కరజాన భాస్కర రావు, బలగ రాధ, బొడ్డేపల్లి పాపారావు, చల్ల వరప్రసాద్‌రావు, పల్లి వాసుదేవరావు, పంగ సింహాచలం, ఉరిటి జగన్నాథం, పొడంగు పద్మజ, నక్క అప్పయ్య, బలగ తవిటమ్మ, కోరాడ భాస్కరరావు, సీపాన సన్యాస అప్పారావు, ఆడిట్ కన్వీనర్ బెహరా సంతోష్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

### సిపిఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాటం
### యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు విజయగౌరి

యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలు డిసెంబరు 9, 10, 11 తేదీల్లో జిల్లాలో నిర్వహిస్తున్నామని, సంఘ సభ్యులంతా విధిగా పాల్గొని విజయ వంతం చేయాలని రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. అక్టోబర్ 14న వంగర మండలం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వంగర మండలశాఖ అధ్యక్షులు కాంబోతుల రమణ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం పోషక స్వతంత్ర చట్టం-2017ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.




ప్రభుత్వ విద్య, పరిరక్షణ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పు కోవాలని యోచిస్తుందన్నారు. సిపిఎస్ విధానం రద్దు అయ్యే వరకూ పోరాటం తప్పదని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు మాట్లాడుతూ మహాసభలకు సంఘ సభ్యులంతా విధిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలశాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా పల్ల మురళి వ్యవహరించారు.

అధ్యక్షులుగా కె.రమణ, ప్రధానకార్యదర్శిగా వి.సత్యంనాయుడు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పక్కి వాసు, రవిబాబు, రాంబాబు, దుర్గారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి**




శ్రీకాకుళంలో డిసెంబర్ 9,10,11వ తేదీలల్లో జరగనున్న యుటియఫ్ రాష్ట్ర మహాసభలను ఉపాధ్యాయ వర్గాలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలల్లో అక్టోబర్ 21న నిర్వహించిన యుటియఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాసభల్లో దీర్ఘాకాలంగా పరిష్కా రానికి నోచుకోని పలు సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రభుత్వం అస్తవ్యస్థ విధానాలతో ఉపాధ్యాయ వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఆర్. శ్రీనివాసరావును ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియా డారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు బమ్మిడి శ్రీరామమూర్తి, మండల అధ్యక్షులు కింతలి హరినారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రతినిధులు ఉప్పాడ వాసుదేవరావు, రాజాపు దమయంతి, నడిమింటి అప్పల నాయుడు, కె.వైకుంఠరావు, టి.సుధీర్, ఆర్.బాబూరావు, యు.రామారావు, పలువురు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

**పిఎఫ్ సమస్యను తక్షణం పరిష్కరించాలి**

**యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు**




ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభ మండల కేంద్రంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పిఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేస్తామని ఏడాదిగా చెబుతున్నా సక్రమంగా నిర్వహించడంలేదని అన్నారు. కేవలం ముడుపుల కోసమే పిఎఫ్ సమస్యలు పరిష్కరించ కుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలుగుతోందన్నారు. హాజరు పడకపోయినా ఆందోళన చెందవద్దని ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు కోరుతూ నవంబరు 3, 4, తేదీల్లో నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కిషోర్‌కుమార్, నాయకులు పి.అప్పారావు, ఎస్.నారాయణరావు, ఎస్.తులసీదాస్, డి.కోటేశ్వరరావు, బి.రాజారావు, టి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి జిల్లా**

**ప్రతి ఉపాధ్యాయుడు పోరాటంలో పాల్గొనాలి**



యుటియఫ్ చింతూరు మండల మహాసభకు జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య హాజరయ్యి, ప్రసంగిస్తూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జరిపే పోరాటంలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర కౌన్సిలర్ శ్రీమతి యం.కవిత మాట్లాడుతూ మగ వారి తో సమానంగా మహిళా ఉపాధ్యాయులు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కూనవరం, వి.ఆర్. పురం మండల ప్రధాన కార్యదర్శు లు పి.కన్నారావు, సోడె. నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. చింతూరు మండల నూతన కమిటీచే ఎన్నికల అధికారి సోడె నాగేశ్వరరావు ప్రమాణం చేయించారు.

**నూతన కమిటీ :** అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.ముత్తయ్య, కె.భీమయ్య, కార్యవర్గ సభ్యులు టి.వెంకటయ్య, కె.నాగరాజు, కె.భాస్కర్, కె.వెంకటేశ్వర్లు, కె.ముత్తయ్య, కె. శ్రీనివాస్ దొర, యం.జె.రఫి, ఎస్. జోగారావు, యు.వి.నారాయణ, శ్రీమతి యం.కవిత, శ్రీమతి కె.తులశమ్మ, ఆర్థిక కార్యదర్శి కె. బ్రహ్మయ్య లు ఎన్నుకోబడినారు.

**పిఆర్‌సి బకాయిలు చెల్లించాలి**

తూర్పుగోదావరి జిల్లా ప్రతిపాడు మండల మహాసభ అక్టోబర్ 27వ తేదీన ఎంఆర్‌సి భవనమునందు జరిగినది. ఈ సభకు యుటియఫ్ మండల అధ్యక్షులు ఎస్.చిట్టిబాబు అధ్యక్షత వహించి, ఇప్పటివరకు కార్యవర్గం చేసిన అనేక కార్యక్రమాలు వివరించారు. జిల్లా ఐక్యఉపాధ్యాయ కన్వీనర్ ఐ.ప్రసాదరావు హాజరై మాట్లాడుతూ ఉద్యమ పోరాటాలు, సంఘ నియామావళి, ముఖ్యంగా పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు ప్రకటించాలని, 2018 పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో డిఇఒ పూల్ టీచర్స్‌ని రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి నివేదికను ఆర్‌డిఎల్ రామ లింగేశ్వర రావు, ఆర్థిక నివేదికను డి.రాజబాబు ప్రవేశపెట్టారు. తదుపరి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

ఎన్నికల అధికారి ఐ.ప్రసాదరావు సమక్షంలో గౌరవాధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు, అధ్యక్షులు కోడి శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్.సూర్యావతి, కోశాధికారి ఆర్‌డిఎల్ రామలింగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**సిపిఎస్ రద్దు చేయాలి**



మండల మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గ సమావేశం స్థానిక ఎంఆర్‌సి భవనమునందు నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రధానకార్యదర్శి ఇ. రాంబాబు భవిష్యత్ కార్యక్రమాలు వివరించారు.

ముఖ్యంగా సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి అని నూతన కార్యవర్గం తీర్మానించింది. నేడు అన్ని శాఖలలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వారి ప్రధాన డిమాండ్ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని మండల సిపిఎస్ సంఘ కన్వీనర్ సిహెచ్ఎల్ గణేష్ డిమాండ్ చేశారు.

**పి.గన్నవరం :**

తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలం యుటియఫ్ మహాసభ అక్టోబర్ 14న మండల శాఖ అధ్యక్షులు ఆనందరావు అధ్యక్షతన పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ముందుగా జాతీయ పతాకాన్ని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి భమిడి శ్రీరామచంద్రమూర్తి, యుటియఫ్ పతాకాన్ని సిహెచ్ పేర్రాజు ఎగురవేశారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు అర్పించినారు. అనంతరం విద్యా సదస్సు జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయిన ఎంపిపి లక్ష్మీగౌరి మాట్లాడుతూ యుటియఫ్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాడే సంఘమని, వేసవి సెలవులలో మన ఊరు మనబడి మండలం అంతా నిర్వహించి పిల్లలను అధిక సంఖ్యలో బడిలో చేర్పించిన ఘనత యుటియఫ్‌కు దక్కుతుందని మండల శాఖను అభినందిం చారు. జిల్లా ప్రధానకార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దేయ్యవరకు యుటియఫ్ పోరాడుతుందని అన్నారు.

జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర వర్మ మాట్లాడుతూ ఉద్యమ నాయకుల పోరాటాల ఫలితంగా నేడు ఉపాధ్యాయులు అనేక సౌకర్యాలు పొందుతున్నారని, కార్యకర్తలు పోరాటాలలో పాల్గొని సంఘాన్ని బలోపేతం చెయ్యాలని కోరారు. కార్యదర్శి నివేదికను మండల ప్రధానకార్యదర్శి కెవి రమణ, ఆర్థిక నివేదికను జివిఎం ఎంఎస్ గుప్త, కుటుంబ సంక్షేమ పథక నివేదికను శివరామకృష్ణ ప్రవేశ పెట్టారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

**పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం**

**ఎంఎల్ఎ శ్రీ సున్నం రాజయ్య**




**రేఖపల్లి:** పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయని భద్రాచలం ఎమ్మెల్యే శ్రీ సున్నం.రాజయ్య తెలిపారు. మండల కేంద్రం రేఖపల్లిలోని ఎఎస్ డిఎస్ కార్యాలయంలో యుటియఫ్ మండలాధ్యక్షుడు పి.రాజారావు అధ్యక్షతన నిర్వహించిన యుటియఫ్ తృతీయ మండల మహాసభకు రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన్యంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకార మన్నారు. పోరాటాల ద్వారానే ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఎంపిపి కారం శిరమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధ్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూనే తమ సమస్యల పరిష్కారా నికి పోరాడాలన్నారు. ఏజెన్సీలో డిఇఓ పూల్ టీచర్ల రిలీవ్ కోసం అధికారులతో మాట్లాడతానని, డిఇఓ పూల్ టీచర్లు రిలీవ్ అయితే మన్యంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

మహాసభలకు పరిశీలకులుగా హాజరైన యుటియఫ్ జిల్లా కార్యదర్శి శ్రీ పండా కృష్ణయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక డియస్సీని ప్రకటించాలన్నారు. ప్రత్యేక డియస్సీ విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**నూతన కమిటీ ఎన్నిక :** ఎన్.రామక్రిష్ణ అధ్యక్షుడు, ఎస్.నాగేశ్వర రావు ప్రధాన కార్యదర్శి, సహాధ్యక్షులు సి.హెచ్. శాంతకుమారి, యం.భీమయ్య, కోశాధికారి యం.బాబు,ఆడిటర్ బి.విజయ్ కుమార్, కార్యదర్శులుగా ఎన్.జగదీశ్, కె.శ్రీను,ఎన్. ప్రసాద్, యం.విజయ, ఎస్. అజయ్ కుమార్, ఎస్.వెంకటేశ్, సి.హెచ్. శివకృష్ణలు ఎన్నికయ్యారు.

**పశ్చిమగోదావరి జిల్లా**




**భీమవరం :** నవంబర్ 2న శ్రీ కలిడిండి రాఘవ రాజు టీచర్స్ హోమ్ (యుటియఫ్ ప్రాంతీయ కార్యాలయం భీమవరం) నందు యూటీఎఫ్ భీమవరం గ్రామీణ మండల సర్వ సభ్య సమావేశం మండల మహాసభ మండల శాఖ అధ్యక్షులు ఎన్.భాను మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా యూటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపిమూర్తి మరియు ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా కార్యదర్శి ఎం.ఐ. విజయకుమార్, రాష్ట్రకౌన్సిలర్ పి.సీతారామ రాజు హాజరయ్యారు.

మండల యుటియఫ్ ప్రధానకార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య వార్షిక నివేదిక సమర్పిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017" తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేసేవిధంగానూ, కార్పొరేట్ పాఠశాలలకు పూర్తిగా రెడ్ కార్పెట్ పరచి ప్రభుత్వ అనుమతి లేకుండానే స్కూలు పెట్టుకునే వెసులుబాటును కల్పిస్తూ అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టాలు అమలులోకి వస్తే ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నాశనమైపోతుందని అన్నారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గోపిమూర్తి మాట్లాడుతూ ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత గౌరవప్రదమైన జీవితం గడపాలని ఓ సామాజిక భద్రతగా పెన్షన్ ఇచ్చారన్నారు. వామపక్షాలు తప్ప దాదాపు అన్నిపార్టీలు పిఎఫ్ఆర్‌డిఏ చట్టాన్ని ఆమోదించడంతో దేశవ్యాప్తంగా 56 లక్షల మంది, మన రాష్ట్రంలో 1,84,000మంది ఉద్యోగులు,

ఉపాధ్యాయులు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకంలోకి వచ్చి కనీస పెన్షన్ భద్రత కోల్పోయారన్నారు. సిపిఎస్ రద్దు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనసభలో చట్టం తేవాలని, పిఎఫ్ఆర్‌డిఏ పరిధిలో నుండి వెనక్కి రావాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు.

అనంతరం యుటియఫ్ జిల్లా కార్యదర్శి శ్రీ ఎం.ఐ.విజయ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పి.సీతారామరాజు నూతన కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల సెక్రటేరియట్‌ను మరియు జిల్లా మహా సభ ప్రతినిధులను ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు ఆర్.రామమూర్తి, అధ్యక్షులు జి.అబ్రహం, అసోసియేట్ అధ్యక్షులు కె. శ్రీరామకృష్ణ ప్రసాద్, శ్రీమతి బి.జె.వి.డి.రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య, కోశాధికారి జెఎన్‌వి హనుమంతరావు, ఆడిటర్ బి ఉమా మహేశ్వర రావు. కార్యదర్శులు: జి.వి.మురళీధర్, ఎన్.నర్సింహయ్య, ఎన్‌డివి ప్రసాద్, పి.రతన్ కుమార్, పి.రవిరాజు, ఎ.లక్ష్మీనారాయణ, ఐ.వి.ఆర్. మోహన్‌రావు, పి.రమేష్ బాబు, పి.వి.రాంప్రసాద్, జె.విజయలక్ష్మి.

### కృష్ణా జిల్లా

### పది నెలల పిఆర్‌సి బకాయిలను చెల్లించాలి

**తిరువూరు :** సిపిఎస్ విధానాన్ని రద్దు చేయటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడిన 10 నెలల పిఆర్‌సి అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని యుటియఫ్ జిల్లా కోశాధికారి కృష్ణసుందరరావు డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ భవన్‌లో అక్టోబర్ 8న జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జులై 2018 నుంచి 11వ పిఆర్‌సి అమలు చేయాల్సిన నేపథ్యంలో కమిటీ వేయాలని, 2008 హామీ పత్రాల వారికి వేతన రక్షణ కల్పించాలని కోరారు.



ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలపై బడ్జెట్ కంట్రోల్ తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 11,12 తేదీల్లో తిరువూరులో జరిగే యుటియఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సమావేశం తీర్మానించారు. అనంతరం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు ఎస్‌కె బాజీ, అధ్యక్షులు పురంశెట్టి నాగేశ్వర రావు, సహాధ్యక్షులు ఎన్.సుధాకర్, పి.మృదుల, ప్రధాన కార్యదర్శి ఎన్.ముత్తయ్య, కోశాధికారి జి.రవిబాబు, కార్యదర్శులుగా ఎం.బాలరాజు, ఎం.రామకృష్ణ, ఎం.కమలమ్మ, పివి శరత్ బాబు, ఎన్.వెంకటేశ్వర్లు, ఎం.ఏసుపాదం, పివి రమేష్, జి. రాంబాబు, ఎం.రవీంద్ర, ఎస్‌కె కరీముల్లా, జిల్లా కౌన్సిలర్లుగా మచ్చా శ్రీనివాస్, జె.ఆదిశూషు, ఈవీ భరతకుమారి, ఎం.రాబాబు, డి.అపర్ణ, ఎం.నాగేశ్వరరావు, పి.నగరాజకుమారి, మహిళా కమిటీ కన్వీనరుగా ఎస్.ఉషారాణి, కో-కన్వనర్‌గా బి.కృష్ణకుమారి ఎన్నికయ్యారు.

### మండల మహాసభ

**ఎ.కొండూరు :** అక్టోబర్ 22న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంభంపాడునందు యుటియఫ్ మండల మహాసభ జరిగింది. యుటియఫ్ మండల అధ్యక్షులు ఎల్.చంటి సభకు అధ్యక్షత వహించారు. యుటియఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డిలకు యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.సుందరయ్య, యుటియఫ్ మహిళా నాయకులు బి.విశ్వభారతి, కెఏ మంగమ్మ, మండల అధ్యక్షులు ఎల్ చంటిలు పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. యుటియఫ్ మండల కార్యదర్శి డి.శ్రీనివాసరావు సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు.



ముఖ్య అతిథి కె.సంజీవరెడ్డి మాట్లాడుతూ స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 ఉన్నత విద్యా సంస్థలలో ఉన్న ప్రైవేటీకరణను ప్రాథమిక పాఠశాల విద్యలో తీసుకురావటం కోసం ఈ చట్టంను తెచ్చారన్నారు. ఈ చట్టం వలన ప్రభుత్వ పాఠశాలలు మూతపడతాయని, దీనిని మనందరం వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల 11వ పిఆర్‌సిని వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుకు ప్రభుత్వం శాసనసభ, శాసన మండలిలో తీర్మానాలు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. తదుపరి యుటియఫ్ మండల అధ్యక్షులు చంటి గత కౌన్సిల్ నుండి నేటివరకు యుటియఫ్ మండల శాఖ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను మహాసభకు సమర్పించారు.

**నూతన కార్యవర్గం :** ఎన్నికల పరిశీలకులు కె.సంజీవరెడ్డి, ఎన్నికల అధికారి ఎ.సుందరయ్య పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులు బి.సూర్య, అధ్యక్షులు ఇసాక్, సహాధ్యక్షులు బి.నాగేంద్రరావు, పి.లీల, ప్రధానకార్యదర్శి ఎల్.చంటి, కోశాధికారి సిహెచ్.వి. కృష్ణారావు, ఆడిటర్ డి.శ్రీనివాసరావు, కార్యదర్శులు పి.రమేష్, జి.శ్రీనివాసరావు, బి.కృష్ణకుమారి, ఎస్.లక్ష్మీ నారాయణ, జివి నాగబాబు, ఎం.రాంబాబు, బి.రాజేంద్రప్రసాద్, ఎస్.కె.భాషా, కె.వసంత, జిల్లా కౌన్సిలర్స్ సిహెచ్.అప్పారావు, పి.గోపి, కెఏ మంగ, కె.నాగరాజు ఏకగ్రీవం ఎన్నికయ్యారు.

### సిపిఎస్ విధానం రద్దు చేయాలి



**జి.కొండూరు :** అక్టోబర్ 23న జరిగిన జి.కొండూరు మండల యుటియఫ్ మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రసంగిస్తూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలి, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పర్చాలని, విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు నిరంతరం పనిచేయాలని, ఎప్పటికప్పుడు

జరిగే పరిణామాలు, ప్రభుత్వ చట్టాలను ఉపాధ్యా యులు తెలుసు కోవాలని ఆయన కోరారు.

తదుపరి జరిగిన సన్మాన కార్యక్రమంలో యుటియఫ్ మండల కన్వీనర్ వి.నారాయణరావు ప్రధానోపాధ్యాయునిగా ప్రమోషన్ పొందినందుకు మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయిన యుటియఫ్ కార్యకర్తలు ఎం.లలితశ్రీ, వి.యోబులను, ఈ మండలం నుండి బదిలీ అయిన యుటియఫ్ ముఖ్య కార్యకర్తలు కె.అరుణ కుమారి, ఎం.కుసుమకుమారి, పి.రమేష్, కె.ఉమాశంకర్ తదితరులను సన్మానించారు.

యుటియఫ్ నూతన కార్యవర్గం ఎన్నికలలో జి.కొండూరు మండల యుటియఫ్ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి వి. రాంబాబు, సహాధ్యక్షులు ఎస్.విజయలక్ష్మి, వి.శేఖర్‌రావు, కోశాధికారి బి.నాగరాజు, గౌరవాధ్యక్షులు మూర్తి, కార్యదర్శులు ఐ.వి. కృష్ణారావు, సిహెచ్. ఆంజనేయులు, ఎం.శ్రీలక్ష్మి, జిల్లా కౌన్సిలర్స్ జి.వి.రామారావు, ఎం.లలితశ్రీ, ఎండి ఇర్ఫాన్, ఎ.భరత్, వి.యోబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఏ.కృష్ణసుందరరావు, పర్యవేక్షకులుగా జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్‌సి రాజు, జిల్లా కార్యదర్శి ఎ.సుందరయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.నాగేశ్వరరావు, సభాధ్యక్షులు వి.రాంబాబు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జీవితాలను త్యాగం చేసిన వారి బాటలో నడవాలి**




**రెడ్డిగూడెం :** యుటియఫ్ పటిష్ఠమైన సంఘంగా నిర్మించడంలో జీవితాలను త్యాగంచేసిన అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి వంటి నాయకులు చూపిన బాటలో నడిచి యుటియఫ్ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అక్టోబర్ 17న రెడ్డిగూడెం, విస్సన్నపేట, చాట్రాయి మండలాల కౌన్సిల్ ఎన్నిక సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యారంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేస్తూ, సామాజిక బాధ్యతలను విడనాడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభి వృద్ధికి కృషి చెయ్యాలన్నారు.

యుటియఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్ మాట్లాడుతూ నాణ్యతలేని బయోమెట్రిక్ యంత్రాలు, సిగ్నల్‌లేని పాఠశాలల్లో ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజర్ వెయ్యాలని చెప్పడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కోశాధికారి ఎ.కృష్ణసుందరరావు, సహాధ్యక్షులు భగీరధి, జిల్లా మహిళా కార్యదర్శి శాంతకుమారి, విస్సన్నపేట ఎంఇఓ ఎం.వెంకటరత్నం మూడు మండలాల నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మూడు మండలాల నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడం జరిగింది.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు టి.బాల భాస్కరరావు, అధ్యక్షులు డి.లక్ష్మీపతి, సహాధ్యక్షులు కె.రవిబాబు, పి.భవాని, ప్రధానకార్యదర్శి బి.సిహెచ్.వి.సూర్యనారాయణ, కోశాధికారి ఇ.నాగేశ్వరరావు, ఆడిటర్ సిహెచ్.లక్ష్మయ్య, జిల్లా మహాసభ ప్రతినిధులు ఎం.తిరుపతిరావు, ఎస్ఎస్ సుజాత, డి.శేషగిరి, కార్యదర్శులు జి.ఎస్తేరురాణి, సిహెచ్.జయరామకృష్ణ, ఎ.భిక్షాలు, జి.రవినాథ్, కె.రాజారమేష్, జి.రాము, జి.బేబిరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**సిపిఎస్ విధానం రద్దు చేయాలి**



**బంటుమిల్లి :** సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యుటియఫ్ కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శి కె.ఏ. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. యుటియఫ్ బంటుమిల్లి మండల శాఖ మండల మహాసభ స్థానిక మెయిన్ పాఠశాలలో అక్టోబర్ 26న జరిగింది. మండల శాఖ అధ్యక్షులు పూర్ణచంద్ర రావు అధ్యక్షతన జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. 2010 పిఆర్‌సి బకాయిలు వెంటనే మంజూరు చేయాలని, బయో మెట్రిక్ యంత్రాల లో ఉన్న లోపాలను సరిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా పెండింగ్‌లో వున్న డిఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. మండల స్థాయిలో ఎంఇఓ ఏర్పాటుచేసే సమావేశాలు సాయంత్రం ఐదు గంటల్లోపే ముగించాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలు, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం బంటుమిల్లి మండలశాఖకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బిఎస్‌డి నాక్, ప్రధానకార్యదర్శిగా డి.రాజశేఖర్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులు జివి తాతారావు సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఎండి సౌకత్ హుస్సేన్, రైతు సంఘం తూర్పుకృష్ణా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

**కార్పొరేట్,ప్రయివేటీకరణతో విద్యావ్యవస్థ నిర్వీర్యం**




**తుళ్ళూరు :** కార్పొరేట్,ప్రైవేటీకరణతో విద్యావ్యవస్థ నిర్వీర్య మవుతోందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. విద్యారంగం ప్రైవేటీకరణ ఆంధ్రప్రదేశ్‌లో జరిగినంతగా దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అక్టోబర్ 14న రాజధాని ప్రాంతం తుళ్లూరులోని కెవిఆర్ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన యుటిఎఫ్ మండల మహాసభలో లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగం

ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వరంగంలో ఉన్నప్పుడే పేద, బడుగు, బలహీన వర్గాలు విద్యనభ్యసించే వీలుంటుందన్నారు. కేరళలో విద్యా రంగంలో ప్రైవేటీకరణ 18శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతంగా ఉందని చెప్పారు. కార్పొరేట్ కళాశాలలు అనుసరిస్తున్న విధానాల వల్లనే విద్యార్థులు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రభుత్వ,ప్రయివేటు పాఠశాలలకు కలిపి ప్రతిభా పురస్కారాలు ఇవ్వడం సరికాదని, ఈ విధానంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ నాసిరకం మిషన్లతో బయోమెట్రిక్‌లో పలు ఇబ్బందులు వస్తున్నాయని, వేలి ముద్రలు లేవన్న సాకుతో ఉపాధ్యాయులకు జీతాలు ఆపితే సహించేది లేదని స్పష్టం చేశారు.

విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రభుదాసు మాట్లాడుతూ ప్రాథమిక విద్య బలోపేతం కావాలని, ఇందుకోసం జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

అనంతరం లక్ష్మణరావుతో పాటు ఉద్యోగ విరమణ, పదోన్నతి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి వడ్లమూడి పద్మలత, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.రవిచంద్ర శేఖర్, ఎ.శ్రీనివాసరావు, హెచ్ఎంలు బివి కృష్ణారావు, రామచంద్రరావు, గౌరవ అధ్యక్షులు రఘునాధరావు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు ఎ.రఘునాధ్, అధ్యక్షులు ఎ.శ్రీనివసరావు, సహాధ్యక్షులు ఎ.కెరుణాకుమారి, పి.అరుణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి షేక్ బాజి, కోశాధికారి కె.దాసు, కార్యదర్శులు కె.శేషారత్నం, పి.లకుమాదేవి, బి.సునీత, డి.రమేష్, ఆర్.పుణ్యవతి, ఇ.అనిల్‌కుమార్, కె.రవిబాబు, బి.రాజు, ఎ.శివరామకృష్ణ, ఆడిట్ కన్వీనర్ పి.ప్రేమ్‌చంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**ప్రకాశం జిల్లా**

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటియఫ్ కృషి

**రాచర్ల :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటియఫ్ కృషి చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటియఫ్ మండల అధ్యక్షులు జి.శాయన్న అధ్యక్షతన అక్టోబర్ 29న మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యుటియఫ్ నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు బి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సంఘంలోని సభ్యులందరూ సంఘటితమై పోరాడితే అన్ని సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ ప్రధానకార్యదర్శి జయచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు ఎస్.చెన్నారెడ్డి, అధ్యక్షులు జి.శాయన్న, సహాధ్యక్షులు వీరాంజనేయులు, వై.రంగయ్య, ప్రధానకార్యదర్శి ఎస్.జయచంద్రారెడ్డి, కోశాధికారి మురళీ మోహన్‌రెడ్డి, కుటుంబ సంక్షేమప్రతినిధిగా బి.కాశీం, మహిళా కార్యదర్శిగా శ్రీదేవిరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి. రమణారెడ్డి, జి.రవీంద్రనాథ్‌రెడ్డి వ్యవహరించారు.

**చిత్తూరు జిల్లా**

### పిఆర్‌సి, రెండు విడతల డిఏ బకాయిలు చెల్లించాలి



**పలమనేరు :** ఉద్యోగులకు, పెన్షనర్లకు పిఆర్‌సి, రెండు విడతల డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలని యుటియఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. అక్టోబర్ 8న స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన డివిజన్ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం రెండేళ్ళుగా నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. సర్వీస్‌రూల్స్ కేసులు వెంటనే పరిష్కరించాలని, జూనియర్ లెక్చరర్లకు ప్రమోషన్లు కల్పించాలని, ఎంఇఓ, ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా కార్యదర్శులు సిపి ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, డివిజన్ నాయకులు గురుమూర్తి, పాపయ్య, క్రిష్ణమూర్తి, వేమచంద్రారెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. పలమనేరు మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**నూతన కార్యవర్గం :** గౌరవాధ్యక్షులు జయకుమార్, అధ్యక్షులు జయచంద్రయ్య, సహాధ్యక్షులు హరిప్రియ, గోవిందస్వామి, ప్రధాన కార్యదర్శి వేమచంద్రారెడ్డి, కోశాధికారి ఆనంద్, ఆడిట్ కమిటీ సభ్యులు పురుషోత్తం, భానుమూర్తి, జిల్లా కౌన్సిలర్లుగా జయచంద్రయ్య, వేమచంద్రారెడ్డి, పుష్పావతి, గురుమూర్తిశెట్టి, విజయకుమార్, నటరాజ, క్రిష్ణమూర్తి, హరగోవిందయ్య, నారాయణ బాబు ఎన్నికయ్యారు.

**కడప జిల్లా**

### ఉపాధ్యాయులను వేధిస్తే సహించం



**బద్వేలు :** ప్రభుత్వం విద్యాశాఖలో వింత ప్రయోగాలను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను వేధిస్తే సహించేదిలేదని యుటియఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ హెచ్చరించారు. అక్టోబర్ 26న పట్టణంలోని స్థానిక సెయింట్ పాల్స్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన గోపవరం మండల యుటిఎఫ్ మహాసభలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని విమర్శించారు. అందులో భాగంగానే విద్యాశాఖలో వింత ప్రయోగాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలు కార్పొరేట్, ప్రయివేటు శక్తులకు అనుకూలంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్‌ను రద్దు చేసి సిపిఎస్‌ను అమలు చేశారని, దీంతో లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యా యులుపెన్షన్ భద్రతను కోల్పోతున్నారని అన్నారు. 10వ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించి, 11వ పిఆర్‌సి కమిటిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, రెండు విడతల డిఏను తక్షణమే చెల్లించాలని ఆయన అన్నారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరదాసరి క్రిష్టఫర్, కంచిరెడ్డి, నాయకులు దస్తగిరి, వెంకటసుబ్బయ్య, గురుమూర్తి, భాస్కర్, థామస్, సుబ్బరాయుడు, ఓబులేసు, పోలురాజు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**సిపిఎస్ రద్దు చేయాలి - పాత పెన్షన్ పునరుద్ధరించాలి**




**నందవరం :** 01.09.2004 తర్వాత ఉద్యోగంలో చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యుటియఫ్ జిల్లా కార్యదర్శి జె.యల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందవరం మండలంలో యుటియఫ్ నూతన కమిటీని స్థానిక ఎంఆర్‌సినందు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక భద్రతలేని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు.

అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులు ఎం.సుధాకర్, అధ్యక్షులు బి.జ్ఞానప్రకాష్, సహాధ్యక్షులు ఎస్.సుధాకర్, కె.ఇ.శైలజారాణి, ప్రధానకార్యదర్శి జె. వీరభద్రయ్య, కోశాధికారి కె.రామదాసు, జిల్లా కౌన్సిలర్స్ కె.రాజేష్, ఎం.తులసమ్మ, కార్యదర్శులు బి.రమేష్, అబ్దుల్, రఘునాథ్, కె.శ్రీనివాసులు, నాగేంద్రరెడ్డి, సాయిలక్ష్మి, రజియాసుల్తానా, పరిమళ, పి.హనుమంతు, టి.రామకృష్ణ, కె.నాగరాజు, రామాంజనేయులు, కృష్ణ, బాబు, దిలీప్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ శిక్షణా తరగతులు

**విజయనగరం జిల్లా**

**సిపిఎస్ విధానం రద్దు చేసేంతవరకు నిరంతర పోరాటం**

స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన 'సిపిఎస్ విధానం – కార్యాచరణ' అనే అంశంపై జరిగిన ఒక రోజు శిక్షణా తరగతులలో యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి పాల్గొని మాట్లాడారు.

సిపిఎస్ విధానం రద్దుచేసేంతవరకు యుటియఫ్‌గా, ఐక్య ఉద్యమాలు చేపడతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఐక్యఉద్యమాలు తీవ్రత పెంచుతామని, సిపిఎస్ సమస్య రాజకీయ ఎజెండాగా తీసుకువస్తామని అన్నారు. బయోమెట్రిక్ విధానంతో ఉపాధ్యాయుల హాజరును జీతాలతో ముడిపెట్టి, జీతాలను నిలుపుదల చేస్తామని ప్రకటను వెనక్కు తీసుకోవాలని, 11వ పిఆర్‌సి కమిటీని తక్షణమే ప్రకటించాలి, 10వ పిఆర్‌సి అరియర్సు, డిఏ అరియర్సు చెల్లించాలని, 2008 డిఎస్‌సి హామీపత్రాల టీచర్లకు 10వ పిఆర్‌సి జరిగిన వేతన వ్యత్యాసంను సరిచేసి న్యాయం చేయాలని, 398 ప్రత్యేక టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి జిల్లాలో సిపిఎస్ కోసం సంఘం చేసిన కృషి, రద్దుకోసం చేసే కార్యక్రమాలను, జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న కృషిని వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, రాష్ట్ర కార్యదర్శి డి.రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ, జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, జి.నిర్మల, కోశాధికారి రమేష్ పట్నాయక్, జిల్లా కార్యదర్శులు ఎ. సత్యశ్రీనివాస్, పి.లక్ష్మణ్, ఎం.అప్పలనాయుడు, పి.మధుసూధనరావు, పి.శ్రీనివాసరావు, వి.ప్రసన్నకుమార్, మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నీతి ఆయోగ్ సిఫార్సులు ప్రభుత్వ విద్యారంగానికే ప్రమాదం**

**పార్వతీపురం :** ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ప్రస్తుతం జరుగుతున్న ప్రతి సంస్కరణలను పరిశీలించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నీతి ఆయోగ్ సిఫార్సుల వల్ల ప్రభుత్వ విద్యారంగానికి పెనుప్రమాదం రానుందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. అక్టోబర్ 8న స్థానిక జూనియర్ కాలేజీలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యాన 'పాఠశాల విద్య– నీతి ఆయోగ సిఫార్సులు' అన్న అంశంపై కన్వీనర్ కె.భాస్కరరావు అధ్యక్షతన స్టడీసర్కిల్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్రంలో జరుగుతున్న సంస్కరణలను ప్రతి ఉపాధ్యాయుడు పరిశీలించాలన్నారు. ప్రతి విధానం వెనుక ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే ఆలోచనే పాలకులపై ఉందన్నారు. నీతి ఆయోగ్ సిఫార్సులు పరిశీలిస్తే భవిష్యత్‌లో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు

చదువుకునే పరిస్థితి ఉండదన్నారు. పాలకులు ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్, ప్రైవేటుపరం చేయనున్నా రన్నారు. ఎక్కడైతే తక్కువ విద్యార్థులున్నారో సర్వే చేసి ఆయా పాఠశాలలను పూర్తిగా పిపిపి విధానంలో నడిపిస్తారన్నారు. ఓచర్ విధానం ప్రవేశపెడతా రన్నారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమవుతుందని, అలాగే పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకునే పరిస్థితే ఉండదన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులు నీతి అయోగ సిఫార్సు వల్ల వచ్చే నష్టాలను తెలుసుకొని భవి ష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని, దీనిపై ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**

## ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి పాలకుల కుట్ర



**గుడివాడ :** ప్రపంచ బ్యాంకు సూచించిన విధానాలతోనే ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి విమర్శించారు. స్థానిక ఎన్‌జీవోస్ హోంలో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం"పై అక్టోబర్ 10న నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

ప్రపంచ బ్యాంకు విధానాలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ చట్టం అమలుతో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూసివేయబడతా యన్నారు. ప్రైవేటు పాఠశాలలు ఫీజుల పేరుతో తల్లిదండ్రులను హింసిస్తున్నారన్నారు. తొలుత అక్రమ ఫీజుల వసూళ్ళ నియంత్రణకు చట్టం చేయాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు విద్యా వ్యవస్థను బలోపేతం చేసేలా ఉండాలని, నాశనం చేసేలా ఉండకుడదన్నారు. సదరు చట్టంలోని లొసుగులు, జరుగుతున్న అక్రమాపై కోర్టుకు కూడా వెళ్ళే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించలేదన్నారు. చట్టం రూపొందించే ముందు ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండిస్ట్రీస్ అండ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) ను కేంద్ర ప్రభుత్వం సంప్రదించడం వెనుక మతలబు ఏమిటో తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ధ్వంధ వైఖరి స్పష్టమయ్యిం దన్నారు. చట్టం దుష్ఫలితాలను ప్రజలో ప్రచారం చేయాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా చూడాలన్నారు. ఈ సదస్సులోయుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రమేష్, జిల్లా కార్యదర్శి టి.సీతారామయ్య, బండి గోవర్ధనరావు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎల్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

## పరమత సహనాన్ని పాటించడం ద్వారా మహాత్మగాంధీకి నిజమైన నివాళి



జాతిపిత మహాత్మగాంధీ బోధించిన, ఆచరించిన పరమత సహనాన్ని పాటించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. యుటియఫ్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని వైన్ డీలర్ కళ్యాణ మండపంలో కార్యకర్తల శిక్షణా తరగతులు అక్టబర్ 2న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె. నాగమల్లేశ్వరరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి కెఎస్ లక్ష్మణరావు మూలమాలవేసి నివాళులర్పిం చారు.

ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశం ఐక్యంగా వుండాలని, ప్రజలందరు శాంతి సామరస్యాలతో వుం డాలని ఉద్భోదించిన గాంధీని చంపిన మతోన్మాదులు నేడు భారతా వనిని విచ్చిన్నం చేయడానికి వీరంగం వేస్తున్నారని విమర్శించారు. దేశంలో అసహనాన్ని పెంపొందిస్తూ దేశ సమైక్యతకు విచ్చిన్నం చేసే వారిపట్ల అప్రమత్తంగా వుండాలని కోరారు.

యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నెలకొన్న పరిస్థితులపట్ల కార్యకర్తలు అవగాహన కలిగి వుండటం ద్వారా ప్రజలను మన విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యం కలిగించవచ్చని చెప్పారు. ప్రతిదీ సరుకుగా మారుతున్న నేటి కాలంలో మనం సమాజానికి దిశదశను కల్పించే వారీగా వుండాలని కోరారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ యుటియఫ్ ఉపాధ్యాయుల హక్కులను సాధించడంలో ముందుబాగాన వుంటుందని, అదే విధంగా సామాజిక స్పృహ కలిగిన కార్యకర్తలను తయారు చేసుకోవడానికి ఇలాంటి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణలో భాగంగా 'ఆర్థిక సంస్కరణలు – విద్యారంగం' అంశాన్ని సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్.రఘు, భారతదేశ భిన్న సంస్కృతిని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, "కార్యకర్తలను తయారుచేసుకోవడం ఎలా"ని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి బోధించారు.

ఈ కార్యక్రమంలో ప్రచురణలవిభాగం రాష్ట్ర చైర్మన్ ఎన్.తాండవ కృష్ణ, యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.డి.గౌస్, జిల్లా కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, కె.కళాధర్, జి.శివపూర్ణయ్య, కె.శ్రీనివాసరెడ్డి, పి.పాల్ రాజు, నరసింహారెడ్డి, అరుణకుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

**శ్రీకాకుళం జిల్లా**

## జిల్లా పరిషత్ పిఎఫ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

జిల్లా పరిషత్‌లో పిఎఫ్ అక్కౌంట్లను, మిస్సింగ్ క్రెడిట్స్ సరిచేస్తూ కొద్దికాలంలో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ చౌదరి ధనలక్ష్మీ జిల్లా పరిషత్ సిబ్బంది, యుటియఫ్ ప్రతి నిధుల సమన్వయ సమావేశంలో హామీనిచ్చారు.

నవంబర్ 1న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చాంబర్‌లో పిఎఫ్ ఆన్‌లైన్ సమస్యలు, మిస్సింగ్ క్రెడిట్స్, లోకల్ ఫండ్ ఆడిట్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా పరిషత్ సిబ్బందితో యుటియఫ్ సమన్వయ సమావేశం జరిగింది.

సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌తోబాటు సిఇఓ నగేష్, డివైఇఓ లక్ష్మీపతి, ఏఓ కిరణ్‌కుమార్, జెడ్‌పి సూపరిండెంట్స్, సిబ్బంది యుటియఫ్ నుండి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, రాష్ట్ర ఆడిట్ సభ్యులు కె.వి.శ్రీరామమూర్తి, నాయకులు జి.శ్రీరంగ నాయకులు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పిఎఫ్ అక్కౌంట్స్ ఎటువంటి మిస్సింగ్ క్రెడిట్స్ లేకుండా సత్వరం ఆన్‌లైన్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఎల్ఎఫ్ ఆడిట్‌లో జరుగుతున్న అవినీతిని నిరోధించాలని చైర్‌పర్సన్‌ను కోరారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

అక్టోబర్ 31న ఉపాధ్యాయ సంఘ నేతలతో విద్యాశాఖ కమీషనర్ కె.సంధ్యారాణి సమావేశం ఏర్పాటు చేశారు. కలక్టరేట్ కాన్ఫిరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఏపిఎంఎస్‌టిఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రతినిధులు జి.లక్ష్మీనారాయణ, బి.సురేష్, పి.రాజు, ఎం. దామోదరరావులు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలపై కమీషనర్‌కు తెలియజేశారు. పలు సమస్యలపై వినతిపత్రం అంద జేశారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు (ఆగస్టు నెల నుండి విడుదల చేయాలని, 10వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, సమానమైన ఫిట్‌మెంట్‌ను పిజిటి, టిజిటిలకు వర్తింపుచేసి 10వ పిఆర్‌సిలో న్యాయం చేయాలని, కారుణ్య నియామకాలు, సర్వీసు నిబంధనలు, పెన్షన్ స్కీమ్ అమలు చేసి, ప్రాన్, ట్రెజరీ ఐడి కేటాయించాలని కమీషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వం నుండి వేరుచేయబడిన మోడల్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం ప్రకటించేందుకు ఆలస్యం వలన జీతాలందక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

**విజయనగరం జిల్లా**

## టీచర్లకు వార్డెన్ల బాధ్యత తొలగించండి

**విజయనగరం అర్బన్ :** ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలల పరిధిలో ప్రారంభించనున్న వసతి గృహాలకు సంబంధించి వార్డెన్ల బాధ్యత తమకు అప్పగించవద్దని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిఇఓ ఎస్.అరుణకుమారిని అక్టోబర్ 9న కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ల నియామక నిబంధనల ఆదేశాల (ఆర్‌సి నం.233 ఆర్ఎంఎస్ ఏ1) ప్రకారం వార్డెన్ల పోస్టులను ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేయాలని తెలిపారు. అలా కాకుండా తమకు అదనపు బాధ్యతలు అప్పగించడం సరికాద న్నారు. డిఇఓని కలిసిన వారిలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కెపిఎస్ నారాయణ, వివిధ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

## సంక్షేమాధికారుల బాధ్యతల నుంచి తప్పించాలి



**విజయనగరం అర్బన్ :** ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో సంక్షేమాధికారిణిలుగా మహిళా ఉపాధ్యాయులకు బాధ్యతలు తొలగిం చాలని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 17న అదనపు సంయక్తు కలెక్టర్ నాగేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. బోధనపై ప్రభావం పడుతుంద న్నారు. ఒప్పంద ఉద్యోగులనే నియమించాలని కోరారు. సమాఖ్య నాయకులు కె.ఎ.సత్యనారాయణ, యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పై అక్టోబర్ 31న ఉపాధ్యాయ సంఘ నేతలతో విద్యా శాఖ

కమీషనర్ కె.సంధ్యారాణి సమావేశం ఏర్పాటు చేశారు. కలక్టరేట్ కాన్ఫిరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె. శేషగిరి, కె.శ్రీనివాసులు, ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



డిఇఓ పూల్‌లో ఉన్న టీచర్లందరికీ తక్షణమే జీతాలు చెల్లించాలని, బదిలీలు రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తిస్థాయిలో జిల్లాలో పూర్తయి నందున ప్రస్తుతం చేసిన పనిసర్దుబాటును రద్దు చేయాలి. సబ్స్టిట్యూట్‌తో నిమిత్తం లేకుండా బదిలీ అయిన వారందరినీ రిలీవ్ చేయాలి. ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత గలిగి బదిలీ కావలసి, ఖాళీలు లేక బదిలీ కాని వారికి ప్రస్తుతం ఖాళీలు ఏర్పడినందున వారిని బదిలీ చేయాలి. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి స్కావంజర్స్‌ను నియమించాలి. నాసిరకం బయోమెట్రిక్ యంత్రాలు సక్రమంగా పనిచేయక టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. బయోమెట్రిక్ హాజరు జీతాలకు లింకు పెట్టరాదు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఫోటోలు, సెల్ నంబర్లు, ఆధార్ నెంబర్లు ప్రదర్శించాలనే ఉత్తర్వును రద్దు చేయాలి. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం పుస్తకాలు అందించాలి. 398 ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. 2008 డిఎస్‌సి హామీ పత్రాల ఉపాధ్యాయుల వేతన వ్యత్యాసాలను సవరించాలి. మోడల్ స్కూల్స్‌లో ఉపాధ్యాయినులకు హాస్టల్ వార్డెన్ బాధ్యతలను అప్పగించరాదు. వివిధ సమస్యలపై కమీషనర్‌కు ప్రాతినిధ్యం చేశారు.

### మున్సిపల్ ఆర్‌డికి ప్రాతినిధ్యం



విజయనగరం జిల్లాలోని మున్సిపల్ టీచర్ల సీనియార్టీ లిస్టులను సవరించవలసినదిగా రీజినల్ డైరెక్టర్, విశాఖపట్నం వారికి విజయనగరం యుటియఫ్ జిల్లా శాఖ ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఏపిఎస్ఎస్ఆర్ రూల్స్ ప్రకారం 33బి & 34ల ప్రాప్తికి వివిధ కేటగిరీల అభ్యర్థులను ఇంటర్–సే సీనియార్టీ చేసేటప్పుడు వారి జాయినింగ్ తేదీని పరిగణనలోకి తీసుకోవాలి. సాలూరు మున్సిపల్ ఉపాధ్యాయుల డిపార్ట్‌మెంటల్ పరీక్షా ఫలితాలను ఎస్ఆర్‌లో నమోదుచేసి అర్హతగల ఉపాధ్యాయులను సీనియార్టీ లిస్టులో చేర్చాలి. ఒకే జిల్లాలో వేరొక మున్సిపాలిటీ నుండి బదిలీ అయి వచ్చిన ఉపాధ్యాయులకు వారి మొదటి జాయినింగ్ తేదీ నుండి సర్వీసును లెక్కించాలి. తదితర అంశాలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది. రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి, జిల్లా కార్యదర్శులు పిళ్ళా శ్రీనివాస్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### తూర్పుగోదావరి జిల్లా

### సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయుల వినతి

**అయినవిల్లి :** తమ సమస్యలను పరిష్కరించాలని యుటియఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు అక్టోబర్ 16న గ్రీవెన్‌సెల్‌లో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. యుటియఫ్ మండల అధ్యక్షులు జి. బంగార్రాజు మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు విధానం వల్ల ఎక్కువమంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోనూ, సిగ్నల్ సరిగ్గా లేని పాఠశాలల్లోనూ గంట బోధన సమయం వృధా అవుతుందన్నారు. ఉపాధ్యాయుల హాజరు నాణ్యతను పరిశీలించేందుకు సరఫరా చేసిన యంత్రాలు అత్యంత నాసిరకంగా ఉన్నాయని, ఐరిస్‌వల్ల కంటి సంబంధిత వ్యాధులొచ్చే అవకాశముందని చెప్పారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించాలనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, మధ్యాహ్నభోజన పథకంలో చేస్తున్న వారానికి మూడు కోడిగుడ్లను ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు స్థానికంగానే కొనుగోలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, సుబ్బలక్ష్మి, పుల్లేష్, భాస్కరరావు, శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

### పశ్చిమగోదావరి జిల్లా

### ఎయిడెడ్ పాఠశాలలకూ బయోమెట్రిక్ పరికరాలు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హాజరు కొరకు బయోమెట్రిక్ తప్పనిసరి చేసినందున జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలల సిబ్బంది బయోమెట్రిక్ వేసేందుకు వీలుగా పరికరాలు సరఫరా చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) జిల్లా శాఖ పక్షాన ఎస్ఎస్ఏ ప్రాజెక్టు ఆఫీసర్ వారికి ప్రాతినిధ్యం చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, బి.గోపీమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై పివో గారు స్పందిస్తూ గురువారంలోపు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రాతినిధ్యం చేసినవారిలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్, జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్‌లు ఉన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డిఇఓకి ఉపాధ్యాయ జెఏసి ప్రాతినిధ్యం

పశ్చిమగోదావరి జిల్లాలోని విద్యాశాఖలో వివిధ రకాల బోధనేతర కార్యక్రమాలు అమలు చేయడం వలన విద్యాబోధన కుంటుపడి విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నది. సత్వరమే డిఇఓ జోక్యం చేసుకుని తగు విచారణ నిర్వహించి పాఠశాలల సక్రమ నిర్వహణకు మరియు ఉపాధ్యాయులకు ఎటువంటి బోధనేతర పనులు అప్పగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యాయ జెఏసి కోరినారు.



జిల్లాలో బయోమెట్రిక్ హాజరు విధానం రెండు పద్ధతులు (ఎ) థంబ్ హాజరు (బి) ఐరిష్ హాజరు నమోదు చేయాల్సిందిగా ఆదేశించి యున్నారు. దీని వలన ఎక్కువమంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో మరియు సిగ్నల్స్ సక్రమంగా లేని ప్రాంతాలలోను గంట సమయం వృధా అవుతున్నదని, బయోమెట్రిక్ హాజరు ఉపాధ్యాయుల జీతాలకు ముడిపెట్టరాదని, ప్రాథమిక / ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేయాలని ఆదేశాలు ఇచ్చియున్నారని, సదరు ఆదేశాలను ఉపసంహరించు కోనుటకు తగు చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టానికి భిన్నంగా ఎస్ఎంసి, పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి వాటిని యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయుచున్నారని, మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ, బాత్‌రూమ్‌ల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్స్ నిర్వహణ అరు రకాల యాప్‌లు అప్‌లోడ్ చేయడం వంటి పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయించాలని, రకరకాల ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేసి పాఠశాల పనిదినాల్లో ఉపాధ్యాయులు లేకుండా చేస్తున్నారని, పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఫోటోలతో కూడిన ఫెక్సీలను ప్రదర్శించాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని ప్రాతినిధ్యం చేశారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.జయకర్, బి.గోపీమూర్తి, ఏపిటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బివి సాల్మన్‌రాజు, ఏపిటిఎఫ్-1938 జిల్లా ప్రధానకార్యదర్శి జి.కృష్ణ, పిఆర్‌టియు సహాధ్యక్షులు పి.ఆంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి కెవివి సుబ్బారావు, వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.సుధీర్, ఆపస్ నాయకులు కె.రాజ్‌కుమార్, ఎస్ఎల్‌టిఏ నాయకులు ఎంఏ శ్రీనివాస్, ఎంబిటిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు తదితరులు ప్రాతినిధ్యం చేసినవారిలో ఉన్నారు.

### డిఇఓ పూల్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

**విఆర్ పురం :** యుటియఫ్ వి.ఆర్. పురం మండల కమిటీ ఆధ్వర్యంలో డిఇఓ పూల్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, నాణ్యత గల బయోమెట్రిక్ యంత్రాలు ఇవ్వాలని, యం.డి.యం ఇంప్లిమెంట్ ఏజెన్సీ వాళ్ళకే 2.35లు ఇవ్వాలని, ఏజెన్సీలో ప్రత్యేక డియస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానిక యంపిడిఓ శ్రీ కె.లింగేశ్వరావుకి మెమోరాండం సమర్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కు.సం.ప డైరెక్టర్, మండల ప్రధాన కార్యదర్శి సోడె నాగేశ్వరరావు, యన్.రామక్రిష్ణ, పి.రామారావు, జి.కృష్ణ మోహన్, యస్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా

### పారదర్శంగా సీనియార్టీ జాబితా రూపొందించాలి
### మున్సిపల్ ఆర్‌డికి యుటిఎఫ్ వినతి



మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం తయారు చేయటానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావును యుటిఎఫ్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్‌డిని స్థానిక బ్రాడిపేటలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. సబ్జెక్టులు, మాధ్యమాల వారీగా సీనియార్టీ జాబితాలు ప్రకటించాలని, మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో లిస్టులు రూపొందించాలన్నారు.

అర్హత కలిగిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలను సీనియార్టీ జాబితాలో చేర్చాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించే సందర్భంలో నిబంధనల ప్రకారం ఫీడర్ క్యాడర్ సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని, పుట్టిన రోజును పరిగణించటం సరికాదన్నారు. ఒకే డిఎస్‌సిలో వివిధ తేదీల్లో నియామకం పొందిన వారిని డిఎస్‌సి నియామకం లిస్టు ప్రకారం సీనియార్టీ జాబితాలో చేర్చాలని చెప్పారు. ఆయా డిమాండ్లపై ఆర్‌డి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిబంధనలకు లోబడే సీనియార్టీ జాబితాలు తయారు చేస్తామన్నారు. అవసరమైన సందర్భంలో డిఎంఎ కార్యాలయ వివరణ తీసుకుంటామన్నారు.

ఆర్‌డిని కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ప్రేమ్‌కుమార్, జి.శివపూర్ణయ్య, ఎన్‌వి జగదీష్‌కుమార్, బురాన్ అలీ, కె.వెంకటేశ్వరరావు జయకుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా

### ఉపాధ్యాయుల చేత బోధనేతర పనులు చేయించడం సరికాదు



**మార్కాపురం :** ఉపాధ్యాయుల చేత బోధనేతర పనులు చేయించడం ఎంతమాత్రం సరికాదని యుటిఎఫ్ ఉపాధ్యాయులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో అధికారులు ఉపాధ్యాయులకు అసంబద్ధమైన బోధనేతర పనులు అప్పగిస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యా బోధన కుంటుపడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేని కుటుంబాలలను గుర్తించి వారికి మరుగుదొడ్లు నిర్మించేలా ఉపాధ్యాయులపై అధికారులు వేధించడం మానుకోవాలన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధన కోసమే ఉపయోగించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ బి.రాందాస్ నాయక్‌కి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి.చలమారెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.పి రామయ్య, ఎన్.శ్రీనివాసరెడ్డి, వి.కాశిరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, ఐ.సి.సుబ్బారెరెడ్డి, ఆర్. వెంకటేశ్వర్లు, కెవి.నారాయణ, రఘురామిరెడ్డి, వసుంధరాదేవి పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



జిల్లాలోని ఉద్యోగుల జీతాల నుండే మినహా యిస్తున్న భవిష్యతనిధి, ప్రభుత్వ జీవితబీమా చందాలు వారివారి ఖాతాల్లో జమయ్యేలా సత్వర చర్యలు చేపట్టినట్లు జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటియఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సోమచంద్రారెడ్డి, ఎస్‌టియు నాయకులు జిల్లా ఖజానాధికారితో చర్చించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చర్చించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ఇంటి అద్దెల భత్యం పెంచిందని ఈ మేరకు 14.5% పలమనేరు, పుంగనూరు, పుత్తూరు, నగరి ప్రాంతాల్లోని ఉపాధ్యాయులకు అమలయ్యేలా అక్కడి ఖజానాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పేరోల్ ప్యాకేజీ విధానాన్ని రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా పలమ నేరు, చిత్తూరు ట్రెజరీల్లో 2016 నుండీ అమలు చేస్తున్నామని, పిఎఫ్, ఏపిజిఎల్ఐ వివరాల కోసం ఏపి సైబర్ ట్రెజరీ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చని జిల్లా ఖజానాధికారి గంగాద్రి తెలిపారు.

## సవరణ గెజిట్ విడుదల చేయాలి

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 14.05% ఇంటి అద్దె భత్యం అమలుకు అర్హతగల ప్రాంతాల వివరాలతో ఇటీవల విడుదల చేసిన గెజిట్‌తో కొన్ని గ్రామాల పేర్లు తప్పాయని, ఇందు కోసం గెజిట్‌కు సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని యుటియఫ్ రాష్ట్ర నాయకులు సోమచంద్రారెడ్డి, జెసి చంద్రమౌళికి వినతి పత్రం అందజేశారు.

**కడప జిల్లా**

## ఉపాధ్యాయులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



ఉపాధ్యాయులందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీచర్ ఎమ్మెల్సీ కె.నరసింహారెడ్డి కడప జిల్లా ఎలిమెంటరీ సెకండరీ స్కూల్ టీచర్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మిరాజ, కార్యదర్శి బి.వి.శివారెడ్డి కలిపి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సొసైటీ 30 సం။ల నుండి సభ్యత్వం కలిగినప్పటికి స్వంత ఇంటి నిర్మాణం కోసం స్థలం పొందటం కలగానే మిగిలిందన్నారు.

కలెక్టర్‌ను కలిసినవారిలో డైరెక్టర్లు ఎస్.రామమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎస్‌టియు నాయకులు ఎం.రఘునాథరెడ్డి, బాలగంగి రెడ్డి గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

## బీమా పాలసీ బాండులను తక్షణం జారీ చేయాలి



10వ వేతన సవరణ మూలంగా పెరిగిన జీత భత్యాలకను గుణంగా 2015 నుండి జిల్లాలోని 35వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా పాలసీ ప్రీమియంను సరాసరిగా 600 నుండి 10వేలవరకు పంచుకున్నారు. అయితే అందుకనుగుణంగా జీవితబీమా శాఖ వారు ఇంతవరకు పాలసీ బాండులను జారీ చేయలేదు. 3 సం။లు గడచినప్పటికి అధికారులలో ఎలాంటి కదలిక లేకపోవటంతో యుటియఫ్ జిల్లా శాఖ ఏపిజిఎల్ఐ సంయుక్త సంచాలకులను కలిసి వినతిపత్రం ఇస్తూ నెల రోజుల లోపల పాలసీ బాండులు మంజూరు చేయకపోతే ఏపిజిఎల్ఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.రామశేషయ్య, నాయకులు జయరాజు, మహమ్మద్ రఫిలు వినతి పత్రం సమర్పించారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. పాఠశాలల ఆకస్మిక తనిఖీ సూచనల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.452; తేది.03.10.2017**
2. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా గుడ్ల సరఫరా గురించి ప్రధానోపాధ్యాయులకు సూచనలు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.100DDMDM/2016; తేది.06.10.2017**
3. అర్ధజీతపు సెలవు నగదు చెల్లింపు తేదీ క్లారిఫికేషన్ ఉత్తర్వు
**ప్రభుత్వ ఆర్థిక శాఖ మెమో నం.33021/466/2017; తేది. 05.10.2017**
4. 2018-19 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రారంభం గురించి.
**జిఓ ఎంఎస్ నం.78; తేది.05.10.2017**
5. 2017-18 విద్యా సంవత్సరంలో పరీక్షల నిర్వహణ, మార్కుల అప్‌లోడింగ్ గురించి సూచనల ఉత్తర్వుల
**ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఉత్తర్వు ఆర్ నం.3/బి/సి & టి/ ఎస్‌సిఇఆర్‌టి/2016; తేది.10.10.2017**
6. 2018-19 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రారంభం గురించి ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.29/ ఎ&1/2017; తేది.10.10.2017**
7. ఆం.ప్ర.మున్సిపల్ ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీస్‌రూల్సు-2016కు సవరణలు
**జిఓ ఎంఎస్ నం.362; తేది.11.10.2017**
8. ఆం.ప్ర. మున్సిపల్ కార్పొరేషన్ ఎడ్యుకేషనల్ సబార్డినేట్ రూల్సు -2016కు సవరణలు
**జిఓ ఎంఎస్ నం.363, 11.11.2017**
9. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-2017కు సవరణలు
**జిఓ ఎంఎస్ నం.364; తేది.11.10.2017**
10. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీసు రూల్సు-2016కు సవరణలు
**జిఓ ఎంఎస్ నం.365; తేది.11.10.2017**
11. డా॥ఏపిజె కలామ్, ప్రతిభా పురస్కార అవార్డు సవరణ మార్గ దర్శకాలు
**జిఓ ఎంఎస్ నం.79; తేది.11.10.2017**
12. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 'అమ్మకు వందనం' కార్యక్రమం నిర్వహణ గురించి
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.31/ఏ&1/2017, తేది.10.10.2017**
13. పైలట్ ప్రాతిపదికన రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్ ఆన్‌లైన్‌లో పంపుట గురించి.
**జిఓ ఎంఎస్ నం.176; తేది.12.10.2017**
14. డిఎస్‌సి-2008 మరియు 2012 ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణ కై సమాచారము కోరుట గురించి
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.3150/Esst-III/2015, తేది.12.10.2017**
15. ఎయిడెడ్ పాఠశాలల్లో అప్రెంటీస్ పీరియడ్ రద్దు గురించి సూచనలు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.317/PS-I/2017; తేది.13.10.2017**
16. 1983-1989 మధ్య స్పెషల్ టీచర్లుగా పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరుకై సమాచారం కోరుట గురించి
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.443/Esst/2009; తేది.13.10.2017**
17. 2017 ఉపాధ్యాయ బదిలీలలో రిలీవ్‌కాని ఉపాధ్యాయుల రిలీవింగ్ గురించి సూచనలు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.1882/Esst-III/2017; తేది.17.10.2017**
18. మోడల్ పాఠశాలలకు అనుబంధంగా ఉన్న బాలికల హాస్టల్స్‌లో 7,8 తరగతులలో ప్రవేశానికి సూచనలు
**ఆర్ఎంఎస్ఏ కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.233/ఆర్ఎంఎస్ఏ/2014; తేది.17.10.2017**
19. ఉద్యోగుల ట్రెజరీ మాడ్యుల్‌లో మొబైల్ నంబర్‌లు చేర్చవలసిందిగా సూచనల ఉత్తర్వు
**ట్రెజరీ మరియు అక్కౌంట్స్ డిపార్టమెంట్ సర్క్యులర్ మెమో నం. హెచ్3/7218/2014; తేది.18.10.2017**
20. సిసిఇ విధానంలో సమ్మెటివ్ పరీక్షలకు సవరణల ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.80; తేది.25.10.2017**
21. సిసిఇ విధానంలో 8,9 తరగతుల అంతర్గత మూల్యాంకన 5% మార్కులు 2018-19 విద్యా సంవత్సరం నుండి 10వ తరగతికి కారీఫార్వర్డ్ విధానం రద్దు ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.81; తేది.25.10.2017**
22. సిఎఫ్ఎంఎస్ విధానంలో ఆన్‌లైన్‌లో ఉద్యోగుల వివరాలు సేకరించుట గురించి ఉత్తర్వు
**జిఓ ఆర్‌టి నం.2067; తేది.26.10.2017**
23. పిఎఫ్ వడ్డీ రేటు 7.8% తగ్గింపు
**జిఓ ఆర్‌టి నం.2087 ఆర్థిక; తేది.31.10.2017**

## పాఠకులకు గమనిక

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించ రాదని పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగుతున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యథావిధిగా ప్రచురించడా నికి పోస్టల్ డిపార్టు మెంట్ వారికి, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం. **- సంపాదకవర్గం**